



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 105 అమలాపురం ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ బుధవారం 07 జనవరి 2026 పేజీలు : 12 వెల : 2/-




## భోగాపురం ఎయిర్‌పోర్టు క్రెడిట్ చంద్రబాబుదే..

**తెదేపా నేత పట్టాభి**

అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ : భోగాపురం విమానాశ్రయానికి అనుమతులు తెచ్చామంటూ వైకాపా అవాస్తవాలు ప్రచారం చేస్తోందని మిగతా .. 2లో..



## సంక్రాంతికి 8,432 ప్రత్యేక బస్సు సర్వీసులు

**ఏపీఎస్ఆర్టీసీ**

అమరావతి, విశ్వంవాయిస్ న్యూస్ : సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్లే వారికోసం ఏపీఎస్ఆర్టీసీ మిగతా .. 2లో..



## బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

విశాఖపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ : ఆగ్నేయ బంగాళాఖాతంలో శ్రీలంక సమీపంలో ఏర్పడిన అల్పపీడనం.. తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది మిగతా .. 2లో..



## కవిత రాజీనామాకు మండలి ఛైర్మన్ ఆమోదం

హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ : తన ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత చేసిన రాజీనామాకు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆమోదం తెలిపారు. నిజామాబాద్ మిగతా .. 2లో..

యూపీలో 2.89 కోట్ల

## ఓట్లు తొలగింపు

**సవరించిన ముసాయిదా జాబితా విడుదల**



విశ్వంవాయిస్ న్యూస్ : ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్వహించిన ఎన్నికల సంఘం సోమవారం ఓటరు ముసాయిదా జాబితాను విడుదల చేసింది. మొత్తం 2.89 కోట్ల మంది ఓటర్లను తొలగించినట్లు వెల్లడించింది. అందులో 46 లక్షల మంది ప్రాణాలతో లేరని పేర్కొంది. 2.17 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారని, 25.47 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటర్లుగా నమోదు చేసుకొని ఉన్నారని తెలిపింది. సమగ్ర సవరణకు ముందు ఉత్తర్‌ప్రదేశ్‌లో 15.44 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఈ తొలగింపుతో ప్రస్తుతం ఆ సంఖ్య 12.56 కోట్లకు మిగతా .. 2లో..



## టీమ్ వర్క్.. బెటర్ రిజల్ట్స్...

# ఇవే అభివృద్ధి మంత్రం

- 2026లోనూ పెట్టుబడుల ఫ్లో ఏపీ వైపే ఉండాలి
- విద్యుత్ రంగంలో సంస్కరణలు తెచ్చాం.. ట్రూ డౌన్ కు నాంది పలికాం
- సూర్యలంక బీచ్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
- 14వ ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు
- రూ.19,391 కోట్ల పెట్టుబడులకు, 11,753 ఉద్యోగాలకు ఆమోదం
- ఏపీ ఐటీ ఇన్ఫ్రా కనెక్ట్ పోర్టల్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి

అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : 2025వ సంవత్సరంలో టీమ్ వర్క్‌తో చేయడం వల్లే పెట్టుబడుల్లో బెటర్ రిజల్ట్స్ సాధించామని... ఈ 2026లోనూ అదే ఉత్సాహంతో పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులకు, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 14వ ఎస్ఐపీబీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రాజెక్టులకు రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం తెలిపింది. పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాల్లో వివిధ పెట్టుబడులను 14వ ఎస్ఐపీబీ సమావేశం ఆమోదించింది. 14వ ఎస్ఐపీబీ సమావేశంలో మొత్తంగా 14 సంస్థలకు చెందిన రూ.19,391 కోట్ల పెట్టుబడులకు ఆమోదం మిగతా .. 2లో..

ఇసుక వ్యవస్థలో

## లోపాలు సరిదిద్దాలి

- మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టమైన ఆదేశాలు
- ఇసుక లారీలలో ఓవర్‌లోడింగ్ కారణంగా రహదారి ప్రమాదాలు కారణం
- మైన్స్ శాఖ పనితీరుపై సమీక్ష సమావేశం మంత్రి కొల్లు రవీంద్ర



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తున్నామని, అయినప్పటికీ ఇసుక లభ్యత ఉన్న ప్రాంతాల్లో కూడా కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని గుర్తించి సమర్థవంతంగా అధిగమించాలని ప్రజలకు ఉచిత ఇసుక పంపిణీ చేయడంపై దృష్టి సారించాలని రాష్ట్ర ఎక్సైజ్ మైన్స్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మంగళవారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మైన్స్ శాఖ పనితీరుపై రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీపై మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో ఇసుక సరఫరా, ఉచిత ఇసుక పాలసీ అమలు, అక్రమ తవ్వకాలు, రవాణా నియంత్రణ, ప్రజల సంతృప్తి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గతంలో మిగతా .. 2లో..

## అమెరికాకు పాక్ పరుగో పరుగు..

**అప్పుడు 50కి పైగా సమావేశాలు..**



విశ్వంవాయిస్ న్యూస్ : భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' దెబ్బకు పాకిస్థాన్ విలవిల్లాడిన సంగతి తెలిసిందే. మన సైనిక శక్తి ధాటిని తట్టుకోలేని దాయాది దేశం అమెరికాకు మిగతా .. 2లో..

ఆస్పత్రిలో చేరిన

## సోనియా గాంధీ



విశ్వంవాయిస్ న్యూస్ : కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ సోమవారం సాయంత్రం దిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో చేరారు. నగరంలో కాలుష్యం పెరగడం వల్ల చాలా రోజులుగా సోనియా దగ్గుతో బాధ పడుతున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రొటీన్ చెకప్‌లో భాగంగానే ఆమె ఆస్పత్రిలో చేరినట్టు మిగతా .. 2లో..

## 92 ఏళ్ల జడ్జి ముందుకు మదురో.. ఎవరీ అల్విన్..?



విశ్వంవాయిస్ న్యూస్ : వెనెజువెలాపై దాడి చేసి ఆ దేశ నేత నికోలస్ మదురో, ఆయన భార్యను నిర్బంధించి తీసుకొచ్చిన అమెరికా.. వారిని కోర్టులో హాజరుపర్చింది. మదురో దంపతుల కేసును విచారించిన మన్‌హటన్ ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి అల్విన్ హెల్లర్‌స్టీన్ వయసు 92 ఏళ్లు. దీంతో ఆయన పేరు ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఇంతకీ ఎవరీ అల్విన్..? అల్విన్ హెల్లర్‌స్టీన్ 1933లో న్యూయార్క్‌లో జన్మించారు. కొలంబియా యూనివర్సిటీ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ఆయన.. తొలినాళ్లలో అమెరికా ఆర్మీలో లాయర్‌గా పనిచేశారు. ఆ తర్వాత ప్రైవేటుగా ప్రాక్టీస్ మొదలుపెట్టారు. 1998లో నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్.. అల్విన్‌ను న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్‌కు డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జిగా నామినేట్ చేశారు.

**9/11 నుంచి ట్రంప్ హష్ మనీ కేసు వరకు..**

తన సుదీర్ఘ కెరీర్‌లో అల్విన్ ఎన్నో సివిల్ కేసుల్లో కీలక మిగతా .. 2లో..

చోరీకి వచ్చి..

## ఎగ్జాస్ట్ ఫ్యాన్ కన్నంలో ఇరుక్కొని..

విశ్వంవాయిస్ న్యూస్ : ఓ ఇంటిలో చోరీకి వెళ్లిన దొంగ.. ఎగ్జాస్ట్ ఫ్యాన్ కన్నంలో ఇరుక్కుపోయి పోలీసులకు దొరికిపోయాడు. రాజస్థాన్‌లోని కోటాలో చోటుచేసుకున్న ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎవరూ లేని ఇంటిలో చోరీ చేయడానికి పథకం వేసుకున్న ఓ దొంగ ఎగ్జాస్ట్ ఫ్యాన్ కన్నంలో నుంచి ఇంట్లోకి వెళ్లడానికి ప్రయత్నించాడు. అయితే కన్నంలో సగం దూరిన తర్వాత మధ్యలో ఇరుక్కుపోయాడు. లోపలి నుంచి బయటకు రావడానికి ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాకపోవడంతో అందులోనే మిగతా .. 2లో..

## డిజిటల్ డిపాజిట్ల మోసం..

**ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్ అరెస్ట్**



హైదరాబాద్, విశ్వంవాయిస్ న్యూస్ : ఫాల్కన్ ఎండీ అమర్‌దీప్‌ను తెలంగాణ సీఐడీ పోలీసులు అరెస్ట్ చేశారు. ముంబయిలో ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అమర్‌దీప్‌పై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ నుంచి ఆయన ముంబయికి చేరుకోవడంతో ఇమిగ్రేషన్ అధికారులు అదుపులోకి తీసుకొని తెలంగాణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. డిజిటల్ డిపాజిట్ల పేరిట అమర్‌దీప్ రూ.850 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు గుర్తించారు. యాప్ ఆధారిత డిపాజిట్లతో ఫాల్కన్ సంస్థ భారీ కుంభకోణానికి తెరతీసింది. షేర్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ప్రజలను అమర్ మిగతా .. 2లో..

ఎన్టీఆర్, చంద్రబాబు నాయకత్వంలోనే

## కరువు సీమ సస్యశ్యామల రత్నాల సీమగా మారింది

**రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు**



అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : దార్శనికుడైన నారా చంద్రబాబు నాయుడు, స్వర్గీయ ఎన్టీఆర్ రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పని చేస్తున్న కాలంలోనే రాయలసీమకు జీవనాడిలా ఉన్న ప్రతి నీటి వనరుకీ పునాది వేయడం జరిగిందని తద్వారా కరువు సీమ సస్యశ్యామల రత్నాల సీమగా మారిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా.నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతానికి సాగునీటి రూపంలో కృష్ణా జలాలను తీసుకురావడం ద్వారా శాశ్వత పరిష్కారాన్ని చూపిన నాయకుడు శ్రీ నందమూరి తారకరామారావు అన్నారు. 1983లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయన రాయలసీమ కరువును నివారించేందుకు సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యమని గుర్తించి, దూర దృష్టితో తెలుగు గంగ, హంద్రీ‌నీవా, గాలేరు‌నగరి, వెలుగోడు బ్యాలెన్సర్, గోరకల్లు, అవుకు, గండికోట వంటి అనేక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారన్నారు. ఆ మార్గంలోనే గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టులను విస్తరించి, రాయలసీమ సాగునీటి కలను సాకారం చేసే దిశగా అహర్నిశలు కృషి చేశారన్నారు. నేడు రాయలసీమలో ఏ ప్రాజెక్ట్, రిజర్వాయర్ పేరు పలికినా ప్రజలకు గుర్తుకువచ్చేది ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు అన్నారు. రాయలసీమకు జీవనాడిలా మారిన ప్రతి నీటి వనరుకీ వీరిద్దరి ప్రణాళిక, పట్టుదల, పరిపాలనా దక్షతే పునాది అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన మిగతా .. 2లో..

## మారిషస్ అధ్యక్షుడికి ఘన వీడ్కోలు



మచిలీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ : మారిషస్ రిపబ్లిక్ దేశ అధ్యక్షులు ధరంబీర్ గోకుల్ జిసిఎస్ కేకి గన్నవరం విమానాశ్రయంలో మంగళవారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈనెల 3 వ తేదీన రాష్ట్రానికి అతిథిగా వచ్చిన మారిషస్ దేశాధ్యక్షులు, వారి కుటుంబ సభ్యులు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలలో 3 రోజుల పర్యటన ముగించుకొని గుంటూరు నుండి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాన్వాయిలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకోగా కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారు కాసేపు విమానాశ్రయం రిజర్వు లాంజిలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. అంతకుమునుపే గోవా గవర్నర్ గౌరవ పూసపాటి అశోక్ గజపతిరాజు గన్నవరం విమానాశ్రయానికి చేరుకోగా రిజర్వు లాంజిలో వారితో మారిషస్ దేశాధ్యక్షులు కాసేపు ముచ్చటించారు. తదుపరి రిజర్వ్ లాంజ్ లో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ మారిషస్ దేశాధ్యక్షులతో కాసేపు ముచ్చటించారు. తదనంతరం తిరుపతికి వెళుతున్న మారిషస్ దేశాధ్యక్షులు, వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర మంత్రివర్యులు కందుల దుర్గేష్ తో పాటు జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రివర్యులు మారిషస్ దేశాధ్యక్షులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటన గుర్తుగా జ్ఞాపికను అందజేశారు. జిల్లా ఎస్పీ వీ. విద్యాసాగర్ నాయుడు నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విజయవాడ ట్రాఫిక్ డిసిపి షరీనా బేగం ప్రముఖుల కాన్వాయ్కి ఎలాంటి అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేశారు. గుంటూరు నుండి మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## భోగాపురం ఎయిర్‌పోర్టు క్రెడిట్ చంద్రబాబుదే..

తెదేపా నేత పట్టాభిరామ్ అన్నారు. 2016లోనే సైట్ క్లియరెన్స్ అనుమతులను సీఎం చంద్రబాబు సాధించారని చెప్పారు. భూసేకరణతో పాటు రైతులకు నష్టం జరగకుండా జీవో ఇచ్చారన్నారు. విమానాశ్రయానికి చంద్రబాబే అంకురార్పణ చేశారని వివరించారు. భోగాపురం విమానాశ్రయంపై పట్టాభి ప్రజెంటేషన్ ఇచ్చారు. "భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు ఎస్పీవీ ఏర్పాటుచేశారు. దీనికోసం అధికారులను నియమించారు. చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నట్లు వైకాపా పేటీఎం బ్యాచ్‌లు ఆరోపిస్తున్నాయి. వైకాపా పాత్ర లేకపోయినా తామే చేసినట్లు చెప్పుకొంటున్నారు. విమానాశ్రయం నిర్మాణాన్ని అడ్డుకుంటామని పార్టీ నేతలు గతంలో వ్యాఖ్యానించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు క్రెడిట్ చంద్రబాబుకే దక్కుతుంది. ఈ ప్రాజెక్టు వేగవంతానికి 2017లోనే స్టీరింగ్ కమిటీ ఏర్పాటైంది. కీలకమైన పర్యావరణ అనుమతులు తీసుకొచ్చాం" అని పట్టాభి వివరించారు.

## సంక్రాంతికి 8,432 ప్రత్యేక బస్సు సర్వీసులు

ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రద్దీ దృష్ట్యా రోజూ నడిచే రెగ్యులర్ సర్వీసులకు అదనంగా 8,432 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. ఈసారి స్త్రీశక్తి పథకం దృష్ట్యా రాష్ట్రంలో పలు ప్రాంతాల మధ్య ప్రత్యేక బస్సుల ఏర్పాటులో ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆర్టీసీ తెలిపింది. 71 శాతం బస్సులను రాష్ట్రంలోని పలు ప్రాంతాల మధ్య ప్రత్యేక సర్వీసులుగా నడపాలని నిర్ణయించింది. గ్రామాలు, మండలాలు, పట్టణాల మధ్య రద్దీ గణనీయంగా పెరిగిన దృష్ట్యా.. వీటి మధ్య 6 వేల ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఇతర రాష్ట్రాల్లోని హైదరాబాద్, బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు 2,432 ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపేందుకు కేటాయించింది. పండుగ ముందు రోజుల్లో మొత్తం 3,857 ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. వీటిలో హైదరాబాద్‌కు 240, బెంగళూరుకు 102, చెన్నైకు 15 బస్సులు ఏర్పాటు చేయగా... రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 3500 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. పండుగ తిరుగు ప్రయాణానికి మొత్తం 4,575 బస్సులు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు 1800, బెంగళూరు 200, చెన్నై 75 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా.. వీటిలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల మధ్య నడిపేందుకు 2500 బస్సులు ఏర్పాటు చేశారు. ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ ఛార్జీలే వసూలు చేయనున్నట్లు ఆర్టీసీ ప్రకటించింది. దూర ప్రాంతాలకు నడిచే ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సదుపాయం కల్పించినట్లు తెలిపింది.

## బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో బుధవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. తర్వాత 48 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా తమిళనాడు తీరం వైపు కదలొచ్చని పేర్కొంది. ఇది తీవ్ర వాయుగుండంగా బలపడుతుందని, దీని ప్రభావం రాష్ట్రంపై ఉండబోదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తమిళనాడులో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. రాబోయే 3 రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని, కొన్ని ప్రాంతాల్లో దట్టంగా పొగమంచు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం దక్షిణ కోస్తా, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

## కవిత రాజీనామాకు మండలి ఛైర్మన్ ఆమోదం

స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన కవిత... గత ఏడాది సెప్టెంబర్ 3న తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. తాజాగా రాజీనామాను ఆమోదించడంతో.. ఎమ్మెల్సీ స్థానానికి నోటిఫికేషన్ జారీ అయ్యింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి కవితను సస్పెండ్ చేయడంతో ఆ పార్టీతోపాటు, తద్వారా వచ్చిన ఎమ్మెల్సీ పదవికి ఆమె రాజీనామా చేశారు. తన రాజీనామాను ఆమోదించాలని రెండు మూడు సార్లు మీడియా ముఖంగా కవిత విజ్ఞప్తి చేసినప్పటికీ ఆమోదించలేదు. సోమవారం మండలిలో మాట్లాడుతూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తన రాజీనామాను ఆమోదించాలని మండలి ఛైర్మన్‌ను కోరగా.. భావోద్వేగాలతో తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలని ఆయన సూచించారు. అయినప్పటికీ.. తన రాజీనామాను ఆమోదించాలని సభాముఖంగా ఆమె మరోసారి విజ్ఞప్తి చేయడంతో తాజాగా ఆమోదించారు.

## యూపీలో 2.89 కోట్ల ఓట్లు తొలగింపు

తగ్గింది. ECINET యాప్, ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా ఈ ముసాయిదా జాబితా లో తమ పేరు ఉందోలేదో తెలుసుకోవచ్చని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. ఒకవేళ ఎవరి పేరైనా మిస్ అయినా, తమ వివరాల్లో తప్పిదాలు ఉన్నా.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వేదికగా అభ్యంతరాలు సమర్పించే అవకాశం ఉంది. ఆ అభ్యంతరాలను పరిష్కరించిన తర్వాత ఎస్ఐఆర్ తుది జాబితా మార్చి 6న విడుదల కానుంది. ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరి ఉన్నాయి. గతేడాది తొలిదశ బిహార్‌లో పూర్తయింది. ఆ తర్వాత అక్కడ అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగాయి. గత నెలలో బెంగాల్‌లోనూ ముసాయిదా విడుదల చేశారు. కాగా.. ఈ ఎస్ఐఆర్‌ను కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా ఇతర విపక్షలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఉద్దేశపూర్వకంగానే ఓటర్లను తొలగిస్తున్నారని విమర్శిస్తున్నాయి. ఏమాత్రం ప్రణాళిక, సన్నద్ధత లేకుండా తాత్కాలిక పద్ధతుల్లో, తీవ్ర అవకతవకలతో ఎస్ఐఆర్‌ను ఈసీ కొనసాగిస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ (మీుఎ్ఘు దీుఅవతీయవవ) ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పలుమార్లు ఆమె ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు లేఖలు కూడా రాశారు. తాజాగా ఇదే అంశంపై ఆ పార్టీ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

## ఆస్పత్రిలో చేరిన సోనియా గాంధీ

తెలిపాయి. సోనియా ఆరోగ్యం నిలకడగానే ఉందని, చికిత్స కొనసాగుతోందని పేర్కొన్నాయి. ప్రస్తుతం ఆమె వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

## కరువు సీమ సస్యశ్యామల రత్నాల సీమగా మారింది

తరువాత సాగునీటి ప్రాజెక్టులపై చూపిన ప్రత్యేక శ్రద్ధ కారణంగా రాయలసీమలోని జలాశయాలు, చెరువులు అన్నీ జలకళతో ఉట్టిపడుతున్నాయన్నారు. రాయలసీమలోని 17 ప్రధాన రిజర్వాయర్లలో 86% , మధ్యస్థాయి రిజర్వాయర్లలో 67%, మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల్లో 53% నీరు నిల్వగా ఉందన్నారు. మొత్తం రాయలసీమ నీటి నిల్వ సామర్థ్యం 464 టీఎంసీలు కాగా, వాటిలో 366 టీఎంసీలు (79%) ప్రస్తుతం నిండుగా ఉన్నాయన్నారు. ఇది కూటమి ప్రభుత్వం తీసుకున్న సమర్థ నీటి నిర్వహణ చర్యలకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. హంద్రీఉనివా ప్రాజెక్ట్, రాయలసీమకు జీవనాడిగా పరిగణించదగ్గదని, 2019 నాటికే 3850 క్యూసెక్కుల సామర్థ్యం గల పంపులు సిద్ధంగా ఉన్నప్పటికీ, గత ప్రభుత్వ పాలనలో ఆ పంపులను వినియోగించకపోవడం వల్ల రాయలసీమ రైతులపై ద్రోహం చేయడం జరిగిందన్నారు. గత ఐదు సంవత్సరాల పాలనలో హంద్రీఉనివాకు కేవలం రూ.514 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, ప్రస్తుతం చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కేవలం ఒక సంవత్సరంలోనే రూ.3880 కోట్లు ఖర్చు చేసిందన్నారు. అదేవిధంగా, కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సరన్నర కాలంలో రూ.3145 కోట్లు అదనంగా వెచ్చించి కృష్ణమ్మ నీరు కుప్పం బ్రాంచ్ కెనాల్ చివరి మైలు వరకు, అలాగే మడకసిర బ్రాంచ్ కెనాల్ (490 కి.మీ) వరకు ప్రవహించేలా చేసి, రాయలసీమ రైతుల కలలను నెరవేర్చడం జరిగిందన్నారు. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, గోరకల్లు రిజర్వాయర్, అవుకు రిజర్వాయర్ వంటి ప్రాజెక్టులు గత ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యనికి గురయ్యాయన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వీటిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టి గోరకల్లు రిజర్వాయర్‌కు రూ.58.50 కోట్లు, అవుకు రిజర్వాయర్‌కు రూ.4.5 కోట్లు, అలగనూరుకి రూ.36 కోట్లు, తుంగభద్ర ప్రాజెక్ట్ మరమ్మతులకు రూ.54.42 కోట్లు మరియు శ్రీశైలం ప్లంజ్‌పూల్ మరమ్మతులకు రూ.203 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పింఛ ప్రాజెక్ట్ కొట్టుకుపోయి, దాని ప్రభావంతో అన్నమయ్య ప్రాజెక్ట్ విరిగి 39 మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు, అప్పటి ముఖ్యమంత్రి అక్కడికి వెళ్లి బాధితులను పరామర్శించలేకపోయారన్నారు. కానీ అధికారంలో లేని చంద్రబాబు నాయుడు స్వయంగా అక్కడికి వెళ్లి ప్రజలకు ధైర్యం చెప్పారని, ఇదే ప్రజానాయకత్వం అన్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల భద్రతా పరిరక్షణ దిశగా కూటమి ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందని, తుంగభద్ర ప్రాజెక్టు గేటు కొట్టుకుపోయినప్పుడు కేవలం ఐదు రోజుల్లో కొత్త స్టాప్‌లాక్ గేట్ అమర్చడం, శ్రీశైలం ప్రాజెక్ట్ ప్లంజ్‌పూల్ మరమ్మతులకు రూ.203 కోట్లు కేటాయించడం అనేది తమ ప్రభుత్వం చురుకుదనం, బాధ్యతాయుత పరిపాలనకు సంకేతాలు అన్నారు. ఈ విధంగా రాయలసీమలోని ప్రతి సాగునీటి ప్రాజెక్ట్, రిజర్వాయర్ పునరుద్ధరించబడుచున్నాయని, చెరువులు, ట్యాంకులు నిండిపోతున్నాయన్నారు. రైతులు రెండో పంట కూడా సాగు చేయగలుగుతున్నారన్నారు. ఒకప్పుడు కరువు సీమగా పేరుపొందిన రాయలసీమ, ఈరోజు సస్యశ్యామల రత్నాల సీమగా మారే మార్గంలో ఉందన్నారు. గత ప్రభుత్వ ఐదు సంవత్సరాల పాలనలో నిర్లక్ష్యని గురైన అన్ని ప్రాజెక్టులకు కూటమి ప్రభుత్వం కేవలం ఒక సంవత్సరంలోనే వేల కోట్ల పెట్టుబడులు పెట్టి, ప్రాజెక్టుల పునరుజ్జీవనానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఇది రాయలసీమ రైతుల జీవితాల్లో నీటి రూపంలో పునర్జీవాన్ని నింపిన చారిత్రాత్మక మార్పుగా నిలిచిందన్నారు.

రాయలసీమ ఎత్తిపోతల పథకం పై అసత్య ప్రచారాన్ని ప్రజలు నమ్మరు

రాయలసీమ ఎత్తిపోతల పథకం పై ప్రధాన ప్రతిపక్ష పార్టీ ప్రతినిధులు చేస్తున్న అసత్య ప్రచారాంలో ఏమాత్రం పసలేదని, వారి తప్పుడు ప్రచారాన్ని ప్రజలు ఎవరూ నమ్మరని మంత్రి పేర్కొన్నారు. ఆ పథకానికి సంబంధించిన వాస్తవాలను ఆయన తెలియజేస్తూ శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఇప్పటికే 841 అడుగుల స్థాయివరకు గ్రావిటీ పద్ధతిలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా, ఎటువంటి లిఫ్టింగ్ అవసరం లేకుండా నీరు రాయలసీమకు వస్తోందన్నారు. అయితే గత ప్రభుత్వ హయాంలో 2020లో ప్రతిపాదించిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మాత్రం 800 అడుగుల స్థాయి నుంచి మాత్రమే నీటిని లిఫ్ట్ చేసే విధంగా రూపుదిద్దుకుందన్నారు. ఆ స్థాయిలో లభించే నీటి పరిమాణం కేవలం 34 టీఎంసీలు మాత్రమేనని, అందులోనూ కృష్ణా నది బోర్డు కేటాయించిన వాటా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు దక్కేది 66% అంటే కేవలం 22 టీఎంసీలు మాత్రమే అని ఆయన తెలిపారు. ఈ నీటిని కూడా ఇప్పటికే ఉన్న మాల్యాల (834 ఫీట్) మరియు ముచ్చుమర్రి లిఫ్టుల ద్వారా లభ్యమయ్యే నీటి సామర్థ్యంతోనే రాయలసీమకు అందించడం జరుగుతోందన్నారు. కాబట్టి రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ ద్వారా అదనంగా నీటి లబ్ధి పెద్దగా ఏమీ ఉండబోదన్నారు. ఈ ప్రాజెక్టుకు 2020లో రూ.3,850 కోట్ల పరిపాలన అనుమతి ఇచ్చి, ఎటువంటి డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (ఞూ=) లేకుండా, ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ (జుజ) లేకుండా గత ప్రభుత్వం పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఫలితంగా 2020 మే 20న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (చీ+ు) పనులు నిలిపివేయమని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. 2024 మార్చిలో చీ+ు తిరిగి రూ.2.65 కోట్ల జరిమానా విధించిందన్నారు. ఇదంతా గత ప్రభుత్వ హయాంలోనే జరిగిందన్నారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించిన పనుల పేరుతో రూ.990 కోట్లు ఖర్చుచేసినట్టు రికార్డులు ఉన్నాయని, ఇందులో సివిల్ పనుల కోసం రూ.390 కోట్లు, మెకానికల్ పనుల కోసం రూ.283 కోట్లు, బ్యాంకు వడ్డీగా రూ.134 కోట్లు, ఇతర ఖర్చుల పేరుతో రూ.183 కోట్లు వినియోగించడం జరిగిందన్నారు. కానీ ఒక్క చుక్క నీరు కూడా రాయలసీమకు రాలేదన్నారు. అదే విధంగా గత ప్రభుత్వ హయాంలో జిఎన్ఎస్ఎస్-టు-హెచ్ఎన్ఎస్ఎస్ లింక్ ప్రాజెక్ట్ (రూ.5,036 కోట్లు) పేరుతో భూసేకరణ లేకుండా, పర్యావరణ అనుమతులు లేకుండా మట్టి పనులు మాత్రమే చేసి కోట్ల రూపాయలను దుర్వినియోగం చేయడం జరిగిందన్నారు. ఎక్కడ సాఫ్ట్ సోయిల్ ఉందో అక్కడే పనులు చేసి రూ.1067.74 కోట్ల విలువైన బిల్లులను క్లియర్ చేయించుకోవడం జరిగిందన్నారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో ముదివేడు రిజర్వాయర్ (అంచనా రూ.500 కోట్లు, ఖర్చు రూ.167.97 కోట్లు), నేటిగుంటపల్లి రిజర్వాయర్ (అంచనా రూ.571 కోట్లు, ఖర్చు రూ.494 కోట్లు) మరియు ఆవులపల్లి రిజర్వాయర్ (అంచనా రూ.482 కోట్లు, ఖర్చు ?28 కోట్లు) అనే మూడు కొత్త రిజర్వాయర్ల నిర్మాణ పనులను పర్యావరణ అనుమతులు లేకుండా చేపట్టడం జరిగిందన్నారు. ఈ మూడు రిజర్వాయర్ల పనులకు సుమారు రూ.700 కోట్ల ఖర్చు పెట్టి, అనుమతులు లేకపోవడంతో రూ.100 కోట్ల జరిమానా విధించిందన్నారు. భూసేకరణలో రైతులకు ఒక్క రూపాయి పరిహారం ఇవ్వకుండా భూములు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ విధంగా గత ఐదు సంవత్సరాల్లో రాయలసీమ అభివృద్ధి పేరుతో వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేయడం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హంద్రీనివా, గోరకల్లు, అవుకు, అలగనూరు, శ్రీశైలం, తుంగభద్ర వంటి ప్రధాన ప్రాజెక్టులకు పునరుద్ధరణ చర్యలు చేపట్టి, భద్రతా పనుల కోసం రూ.3880 కోట్లు హంద్రీనివాకు, రూ.203 కోట్లు శ్రీశైలంకు, రూ.55 కోట్లు గోరకల్లు రిజర్వాయర్‌కి, రూ.36 కోట్లు అలగనూరుకు మరియు రూ.54 కోట్లు తుంగభద్ర మరమ్మతులకు కేటాయించడం జరిగిందన్నారు. అదనంగా పోతిరెడ్డి పాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద లైనింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, వీటి ద్వారా నీటి రవాణా సామర్థ్యం రెండింతలు పెరిగి, వరద కాలంలో సముద్రంలో కలిసిపోయే కృష్ణా నీటిని రాయలసీమ రిజర్వాయర్లలో నిల్వ చేయగలుగుతామన్నారు. అలాగే గోదావరి వరద జలాల (ప్రతీ సంవత్సరం 3,000ఉ4,000 టీఎంసీలు) వినియోగానికి పోలవరంఉబొల్లాపల్లిఉకృష్ణ లింక్ ప్రణాళికపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. బొల్లాపల్లి రిజర్వాయర్ (178 టీఎంసీ సామర్థ్యం) ద్వారా రాయలసీమ, బనకచర్ల, నల్లమలసాగర్ ప్రాంతాలకు నీరు అందించాలన్నది ప్రభుత్వ దృక్పథం అన్నారు. ఈ సమావేశంలో జలవనరుల శాఖ సలహాదారులు ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## మారిషస్ అధ్యక్షుడికి ఘన వీడ్కోలు

కాన్వాయ్ ఇన్చార్జిగా ఏఆర్ డిఎస్పీ గాంధీ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మారీషస్ దేశ హై కమిషన్ కార్యదర్శి గీతాంజలి,ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, విమానాశ్రయం డైరెక్టర్ ఎమ్ఎల్ రెడ్డి, టర్మినల్ ఇన్చార్జ్ అంకిత్ జైస్వాల్, సిఎస్ఓ ధర్మేంద్ర, సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్ మల్లికార్జునరావు, గుడివాడ ఆర్డిఓ జి.బాలసుబ్రమణ్యం, గన్నవరం డిఎస్పి శ్రీనివాసరావు, మచిలీపట్నం పిటిసి ఇన్చార్జ్ డిఎస్పి శ్రీనివాసరావు, జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి గోపాలకృష్ణ, గన్నవరం తహసిల్దారు శివయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

## 92 ఏళ్ల జడ్జి ముందుకు మదురో.. ఎవరీ అల్విన్..?

తీర్పులిచ్చారు. 2001 సెప్టెంబరులో న్యూయార్క్, వాషింగ్టన్‌లో జరిగిన అల్‌ఖైదా ఉగ్రదాడుల కేసును విచారించారు. శృంగార తారకు హష్ మనీ కేసు విచారణను ఫెడరల్ కోర్టుకు మార్చాలంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చి వార్తల్లో నిలిచారు. గతేడాది వెనెజువెలా డ్రగ్స్ ముఠా సభ్యులను కోర్టు విచారించకుండా డిపోర్ట్ చేసేందుకు ట్రంప్ యంత్రాంగం చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసును కూడా గత 15 ఏళ్లుగా విచారిస్తున్నారు. ఇదే కేసులో 2020లోనే మదురోపై అమెరికా అభియోగాలు మోపగా.. ఆ దేశ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ హ్యూగో ఆర్మాండో ఇప్పటికే దోషిగా తేలారు.

**అసాంజేను విడిపించిన లాయర్‌తో..**

ఇక, ఈ కేసులో మదురో తరఫున అమెరికాకు చెందిన ప్రముఖ న్యాయవాది బారీ జె.పోలక్ వాదనలు వినిపించనున్నారు. వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే తరఫున వాదించి 2024లో ఆయనను జైలు నుంచి విడిపించడంతో పోలక్ పేరు అప్పట్లో మార్మోగింది. తన మూడు దశాబ్దాల కెరీర్‌లో పోలక్ ఎంతోమంది కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్స్, రాజకీయ ప్రముఖుల తరఫున వాదించారు.

## ఎగ్జాస్ట్ ఫ్యాన్ కన్నంలో ఇరుక్కొని..

వేలాడుతూ ఉన్నాడు. రాత్రి ఒంటి గంట సమయంలో ఇంటికి వచ్చిన యజమాని వంటగదిలోని ఎగ్జాస్ట్ ఫ్యాన్ కన్నంలో దొంగ వేలాడుతుండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దాదాపు గంటపాటు శ్రమించి దొంగను కన్నం నుంచి బయటకు తీశారు. అతడిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. కాగా చోరీ చేయడానికి వచ్చిన దొంగ ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు పోలీసు స్టిక్కర్ ఉన్న కారులో వచ్చినట్లు తెలిపారు. ఈ ఘటన జనవరి 3న జరిగినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

## డిజిటల్ డిపాజిట్ల మోసం..

మళ్ళపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. స్కామ్ వెలుగులోకి రాగానే అమర్‌దీప్ దంపతులు దుబాయ్‌కి పారిపోయారు. ఈ కేసులో ఇప్పటికే సీఈవో, అమర్‌దీప్ సోదరుడిని అధికారులు అరెస్ట్ చేశారు.

నకిలీ వెబ్‌సైట్, యాప్‌లతో మోసాలు

ఫాల్కన్ ఇన్‌వాయిస్ డిస్కౌంటింగ్ పేరిట భారీ పెట్టుబడి మోసానికి పాల్పడినట్లు సీఐడీ పోలీసులు తెలిపారు. నకిలీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా మోసాలు చేశారని.. ప్రముఖ ఎంఎన్‌సీల పేర్లతో ఫేక్ ఇన్‌వాయిస్ ఒప్పందాలు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. దాదాపు 7,056 మంది డిపాజిటర్లు.. అందులో 4,065 మంది బాధితులు ఉన్నారని తెలిపారు. తక్కువ కాలంలో ఎక్కువ పెట్టుబడి వచ్చేలా బాధితులను ఆకర్షించారన్నారు. ఇప్పటి వరకు 11 మంది నిందితులను అరెస్ట్ చేశామని.. వీరిలో డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, చార్టర్డ్ అకౌంటెంట్‌లు ఉన్నారని తెలిపారు. 12 ప్లాట్లు, 4 లగ్జరీ కార్లు, నగదు, బంగారం, షేర్లను సీజ్ చేసినట్లు వివరించారు.

## అమెరికాకు పాక్ పరుగో పరుగు..

పరుగులు పెట్టింది. వాషింగ్టన్‌లో లాబీయింగ్ చేసేందుకు విస్తృతంగా ప్రయత్నించినట్లు యూఎస్ ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద దాఖలైన పత్రాలను ఉటంకిస్తూ ఓ జాతీయ మీడియా సంస్థ తాజాగా కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం.. ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా ప్రభుత్వాధికారులు, చట్ట సభ్యులు, మీడియా సంస్థలతో పాక్ బృందాలు 50కి పైగా సమావేశాలు జరిపినట్లు సమాచారం. 60 మంది అధికారులు, మధ్యవర్తులకు ఈ-మెయిల్స్, ఫోన్ కాల్స్ చేశాయి. వ్యక్తిగత సమావేశాలూ నిర్వహించాయి. భారత్ సైనిక చర్యను ఆపే లక్ష్యంతో వాషింగ్టన్ జోక్యం చేసుకునేందుకు షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం నానా తంటాలు పడింది. ఆ సందర్భంగా పాక్ ప్రతినిధులు.. కశ్మీర్ అంశం, ప్రాంతీయ భద్రత, అరుదైన ఖనిజాలు, ద్వైపాక్షిక సంబంధాల గురించి ప్రస్తావించినట్లు సదరు కథనంలో పేర్కొంది. అలాగే, లాబీయింగ్ కోసం ఆ దేశం భారీగా ఖర్చు చేసిందని, ఇక ఆపరేషన్ సిందూర్ జరిగిన సమయంలో ఆ మొత్తం అమాంతం పెరిగినట్లు అమెరికాలోని ప్రఖ్యాత మీడియా సంస్థ పరిశోధనలో తేలినట్లు తెలిపింది. ట్రంప్ యంత్రాంగానికి మరింత చేరువయ్యేందుకు, వాణిజ్య, దౌత్యపరమైన అంశాల్లో అనుకూల ఫలితాలు పొందేందుకు లాబీయింగ్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇదిలా ఉంటే.. పాకిస్థాన్‌తో ఉద్రిక్తతల విషయంలో భారత్ తొలినుంచి మూడో పక్షం జోక్యాన్ని వ్యతిరేకిస్తూ వస్తోంది. ఆపరేషన్ సిందూర్ దెబ్బకు కంగుతిన్న పాక్ చివరకు కాళ్లబేరానికి రావడంతో మన ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించిన విషయం తెలిసిందే.

## ఇసుక వ్యవస్థలో లోపాలు సరిదిద్దాలి

ఇసుక విధానాల్లో జరిగిన లోపాల కారణంగా భవన నిర్మాణ రంగం వెనుకబడిందని, ఇప్పుడు అలా జరగకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. ఇసుక రీచ్‌ల నిర్వాహకులు అపరాధ రుసుములపై చేసిన ఆరోపణలను పరిశీలిస్తామని, అయితే చట్టబద్ధమైన విధానాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఇసుక లభ్యమయ్యే విషయంలో లోపాలను వెంటనే గుర్తించి సరిదిద్దాలని, ఇసుక రవాణాలో బిల్లులు తప్పనిసరిగా ఉండాలని, అక్రమ రవాణా, అధిక లోడ్, అక్రమ మైనింగ్‌పై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజల సంతృప్తి ముఖ్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇసుక రవాణా విషయంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తుచేశారు. పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ సర్వేలో గత మూడు నెలల్లో సుమారు 10 శాతం పెరుగుదల నమోదవడం సానుకూల పరిణామమని, ఈ స్థాయిని మరింత పెంచేలా క్షేత్రస్థాయిలో పనితీరు మెరుగుపరచాలని సూచించారు. జిల్లా కలెక్టర్ (ఎఫ్ఏసి) / జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ మంత్రి చేసిన సూచనల మేరకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉచిత ఇసుక పాలసీని సమర్థవంతంగా అమలు చేయడంపై దృష్టి సారిస్తామని, అదే సమయంలో అధిక లోడ్, అక్రమ మైనింగ్, అక్రమ రవాణాపై గనులు, పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖల సమన్వయంతో కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ, ఇసుక లారీలలో ఓవర్‌లోడింగ్ కారణంగా రహదారి ప్రమాదాలు పెరిగి ప్రాణనష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని నివారించేందుకు ఇసుక లారీలపై కఠిన పర్యవేక్షణ చేపట్టి అధిక లోడ్‌ను అరికట్టాలని, అలాగే నదుల్లో బోట్ల ద్వారా జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను పూర్తిగా కట్టడి చేయడానికి పోలీస్ శాఖ ఇతర విభాగాలతో సమన్వయంగా పనిచేస్తుందని తెలిపారు. జిల్లా గనులు & భూగర్భ శాఖ అధికారి డి. ఫణి భూషణ్ రెడ్డి జిల్లా ప్రగతిపై వివరాలు తెలియజేస్తూ, ్ూూమీ ద్వారా రియల్‌టైమ్ డిజిటల్ ట్రాకింగ్ అమలుతో పారదర్శకత పెరిగిందన్నారు. జిల్లాలో 77 చట్టబద్ధ అనుమతులున్న ఇసుక రీచ్‌లలో సుమారు 4.13 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని, అదనంగా అనుమతుల ప్రక్రియలో ఉన్న 43 రీచ్‌లలో 1.36 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందన్నారు. అక్రమ రవాణాపై చర్యలతో సరిహద్దు గ్రామాల్లో ఇసుక బుకింగ్‌లు సుమారు 83 శాతం తగ్గాయని, గ్రావెల్, ఓపెన్ ఎర్త్, రోడ్ మెటల్ అక్రమ తవ్వకాలపై రూ.39.31 లక్షల జరిమానా వసూలు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ (ఎఫ్ఏసి)/జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్, శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి, ఆర్డీవో రాణి సుస్మితతో పాటు మైన్స్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, గ్రౌండ్ వాటర్, ఇరిగేషన్ అధికారులు, బోట్స్‌మాన్ సొసైటీ, క్వారీ యూనియన్, ఇసుక రీచ్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## టీమ్ వర్క్... బెటర్ రిజల్ట్స్... ఇవే అభివృద్ధి మంత్రం

లభించింది. వీటి ద్వారా 11,753 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. దీంతో ఇప్పటి వరకు రూ.8,74,705 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించగా, 8,35,675 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఎస్ఐపీబీ సమావేశం ప్రారంభం కాగానే మంత్రులు, సీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025లో భారీ ఎత్తున పెట్టుబడులు వచ్చేలా చేయగలిగామని సీఎంతో చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."2025లో రాష్ట్రం కోసం అందరూ అద్భుతంగా పని చేశారు. గత ప్రభుత్వ పాలనలో పోయిన బ్రాండ్ ఇమేజ్ రాష్ట్రానికి తిరిగి వచ్చి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. భారీ పరిశ్రమలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయి. గూగుల్, టాటా, జిందాల్, బిర్లా, అదానీ, రిలయన్స్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టాయి. ఏ చిన్న పొరపాటుకు తావివ్వకుండా మంత్రులు, అధికారులు బాధ్యత తీసుకోవాలి."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

ప్రజలపై భారాన్ని తగ్గించగలిగాం... సంతోషంగా ఉంది: సీఎం చంద్రబాబు

"విద్యుత్ రంగంలో అద్భుతంగా పనిచేశాం. 13 పైసలు విద్యుత్ ఛార్జీలు తగ్గించాం. రూ.4500 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించాలని నిర్ణయించాం. విద్యుత్ కొనుగోళ్ల ధరలను కూడా తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. 2029 నాటికి విద్యుత్ కొనుగోలు ధరను రూ. 3.70కు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడకుండా చూడడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. విద్యుత్ రంగంలో మనం చేసిన కృషి వల్లే డేటా సెంటర్లు వచ్చాయి. విద్యుత్ రంగంతోపాటు... వివిధ రంగాల్లో పెట్టుబడులు బాగా వచ్చాయి. దావోస్ సదస్సుకు వెళ్లాం ఏపీ బ్రాండ్ ప్రమోట్ చేయగలిగాం... విదేశీ కంపెనీలను ఆకర్షించగలిగాం. ఏపీకి గూగుల్ ఏఐ డేటా సెంటర్ తీసుకురావడానికి లోకేష్ కృషి చేశారు. స్టస్ ఇచ్చే కిక్ అద్భుతంగా ఉంటుంది... ఆ కిక్ కోసం అందరూ పని చేయాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సులో ఫలితాలు రావాలనే లక్ష్యంతో పని చేయాలి."అని సీఎం సూచించారు.

ఐ ల్యాండ్ టూరిజం అభివృద్ధిపై ఫోకస్

"సూర్యలంక అత్యంత సురక్షితమైన బీచ్ ప్రాంతం. బీచ్ టూరిజంపై మాస్టర్ ప్లాన్ తయారు చేయండి. సూర్యలంక బీచ్ రిసార్ట్స్ బ్రాండింగ్ చేయండి. సూర్యలంక బీచ్ ఫ్రంట్ అభివృద్ధి చేయాలి. 15 కిలోమీటర్ల మేర క్లీన్ బీచ్ ఫ్రంట్ ఉండాలి. కాలుష్య రహిత ప్రాంతంగా సూర్యలంక బీచ్ ఫ్రంట్ ఉండాలి. సూర్యలంకతో పాటు సూళ్లూరు పేట వద్ద ఉన్న చిన్ని చిన్న ద్వీపాలను కూడా బీచ్ టూరిజం కింద అభివృద్ధి చేయవచ్చు. మాల్దీవ్స్ తరహాలో ఐ ల్యాండ్ టూరిజం తయారు చేసుకోవాలి. 25 వేల గదులు నిర్మించగలిగితే పర్యాటకుల్ని ఆకర్షించవచ్చు. టూరిజం కార్పోరేషన్ మరింత బలోపేతం కావాలి. సూర్యలంక ఏపీటీడీసీ రేటింగ్ పెరగాల్సిన అవసరం ఉంది. రాబోయే 15 ఏళ్లలో వెయ్యి కోట్ల ఆదాయం టూరిజం కార్పోరేషన్ కు వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. పాపికొండలు-పోలవరం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే అంశంపై దృష్టి పెట్టండి. కోనసీమ, పులికాట్, విశాఖ క్లస్టర్లు అత్యద్భుత పర్యాటక క్లస్టర్లుగా తయారవుతాయి. అనంతపురం నుంచి గండికోట వరకూ టూరిజం క్లస్టర్లలో కూడా పర్యాటకానికి అవకాశం ఉంది. తిమ్మమ్మ మర్రిమాను అతిపెద్ద మర్రిచెట్టు. గూగుల్ మ్యాపింగ్ చేయండి. ఈ చెట్టుకు 2 వేల ఏళ్ల చరిత్ర ఉంది. ఆవకాయ్ ఫెస్టివల్, ఫ్లెమింగో ఫెస్టివల్, గండికోట ఉత్సవాలు, విశాఖ అరకు ఉత్సవ్, సీ టూ స్కై, ఏపీ ట్రావెల్ మార్ట్ లను ఘనంగా నిర్వహించండి. విశాఖ, అమరావతికి హోటళ్లు, ఆస్పత్రులు విద్యా సంస్థలు వచ్చేలా చూడండి. ప్రతిష్టాత్మక విద్యా సంస్థలకు మాన్సాస్ ట్రస్ట్ తన భూములను విరాళంగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయండి." అని సీఎం చెప్పారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో రైతులకు మేలు

"మరిన్ని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు తిరుపతి ప్రాంతానికి రావాల్సి ఉంది. అప్పుడే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. వివిధ రకాల వెరైటీలు, ఫుడ్ ప్రాసెసింగ్ ఉత్పత్తులు గ్లోబల్ మార్కెట్లకు వెళ్లాలి. వాల్యూ అడిషన్ జరిగితేనే రైతులకు గరిష్ట ప్రయోజనం దక్కుతుంది. ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థలతో సమావేశం ఏర్పాటు చేయండి. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఏపీ ఛాంపియన్ కావాలి. ప్రస్తుతం రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. భవిష్యత్తులో ఉద్యాన ఉత్పత్తులు పెద్ద ఎత్తున పండే అవకాశం ఉంది. దానికి అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు కావాలి. పాలసీల అమలు విషయంలో ఎలాంటి డీవియేషన్ ఉండేందుకు వీల్లేదు. అందరికీ సమానంగా అవకాశాలు అందాలి. పాలసీ నిబంధనల్లో ఎలాంటి మినహాయింపులూ ఉండకూడదు. కొప్పర్తి ఎలక్ట్రానిక్స్ క్లస్టర్ సమీపంలో మరింత భూమిని పరిశ్రమల కోసం సిద్ధం చేయండి. ఎంప్లాయిమెంట్ పోర్టల్ కూడా త్వరలోనే అందుబాటులోకి రావాలి. స్పేస్ సిటీ కోసం కనీసం 5 వేల ఎకరాలు అవసరం అవుతాయి. మాకవరపాలెం వద్ద ఫుడ్ పార్క్ సహా అల్యూమినియం డౌన్ స్ట్రీమ్ పరిశ్రమలు వచ్చేలా చూడండి. దీని కోసం ఇండస్ట్రియల్ పార్క్ సిద్ధం చేయండి."అని ముఖ్యమంత్రి వివరించారు. ఎస్ఐపీబీ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏపీ ఐటీ ఇన్ఫ్రా పోర్టల్ ను ప్రారంభించారు. 14వ ఎస్ఐపీబీ సమావేశానికి మంత్రులు నారా లోకేష్, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, నారాయణ, టీజీ భరత్, కందులు దుర్గేష్, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, సీఎస్ విజయానంద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఎడిటర్ వాయిస్

## మోత మోగిస్తున్న ఏపీ బ్రాండ్

ఏపీలో రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డ్ ఎస్ఐపీబీ ని అత్యంత కీలకం చేశారు. ఎంతలా అంటే 19 నెలల కూటమి పాలనలో ఇప్పటికి 14 రాష్ట్ర స్థాయి ఎస్ఐపీబీ సమావేశాలు జరిగాయి అంటే ఆలోచించాల్సిందే. ఏపీలో పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకుని వచ్చేందుకు కూటమి ప్రభుత్వం నిర్విరామ కృషి చేస్తోంది. పెట్టుబడులకు పెద్ద పీట వేయడమే కాకుండా ఈజ్ ఆఫ్ బిజినెస్ డూయింగ్ తో ఎవరైనా ఏపీ వైపు చూస్తే చాలు వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. సింగ్ విండో విధానంలో పెట్టుబడులు పెట్టేందుకు అవసరం అయిన అన్ని అనుమతులు మంజూరు చేస్తున్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా టాప్ టూ బాటమ్ మానిటరింగ్ చేస్తున్నారు.

**ఎస్ఐపీబీ కీలకంగా :**

ఏపీలో రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డ్ ఎస్ఐపీబీ ని అత్యంత కీలకం చేశారు. ఎంతలా అంటే 19 నెలల కూటమి పాలనలో ఇప్పటికి 14 రాష్ట్ర స్థాయి ఎస్ఐపీబీ సమావేశాలు జరిగాయి అంటే ఆలోచించాల్సిందే. అంటే సగటున నెలకు ఒక మీటింగ్ అన్న మాట. ఈ సమావేశాల ద్వారా ఆ కాల పరిధిలో వచ్చిన పెట్టుబడుల దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి ఎక్కడికక్కడ వెంటనే అనుమతులు మంజూరు చేస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన తాజాగా అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో జరిగిన 14వ ఎస్ఐపీబీ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అంతే కాదు వివిధ ప్రాజెక్టులకు సంబంధించి సమావేశంలో ఎస్ఐపీబి ఆమోదం తెలిపింది.

**భారీ ఎత్తున పెట్టుబడులు :** ఇదిలా ఉంటే ఇప్పటిదాకా జరిగిన 13 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా ఏపీకి 8.55 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. వీటి ద్వారా 8.23 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని ఎస్ఐపీబీ పేర్కొంటూ వాటికి ఆమోదం తెలిపింది. పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాలలో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయి. **మంత్రులు తీరు అద్భుతం :** ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 2025 ఏడాది ఏపీకి గొప్ప అభివృద్ధి సంకేతంగా తెలిపారు. ఈ ఏడాది ఏపీలో పెట్టుబడులు భారీ ఎత్తున వచ్చాయని ఆయన తెలిపారు. అంతే కాదు అదే ఉత్సాహంతో 2026లో కూడా అంతా కలసి పూర్తి కో ఆర్డినేషన్ తో పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరడం విశేషం. ఇక రాష్ట్రాభివృద్ధి కోసం మంత్రులు, అధికారులు అద్భుతంగా పని చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు కితాబు ఇవ్వడం మరో విశేషం.

**ఏపీకి బ్రాండ్ :** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి పోయిన బ్రాండ్ తిరిగి వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వరసబెట్టి రావడం శుభ సూచకం అని అన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన భారీ పరిశ్రమలు ఏపీలో పెట్టుబడులు పెడుతున్నాయని ముఖ్యమంత్రి అంటూ ఏపీ ప్రగతి గతిని మార్చే దిశగా అడుగులు పడుతున్నాయని అన్నారు. టాటా, జిందాల్, బిర్లా, అదానీ, రిలయెన్స్, టీసీఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రముఖ సంస్థలు ఏపీలో పెట్టుబడులు పెట్టాయి అని ఆయన గుర్తు చేశారు. అయితే వెల్లువలా పెట్టుబడులు వస్తున్న క్రమంలో ఎక్కడా ఏ చిన్న పొరపాటు తావివ్వకుండా మంత్రులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు సూచించడం విశేషం.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## అమెరికాలో తెలుగు యువతి హత్య



### మాజీ ప్రియుడే కాలయముడు

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆమెను చంపేసి.. తన అపార్ట్‌మెంట్‌లోనే మృతదేహం వదిలేసి.. భారత్‌కి పారిపోయి వచ్చిన మాజీ బాయ్‌ఫ్రెండ్.అమెరికాలోని మేరీల్యాండ్‌లో ఉన్న వెడా హెల్త్‌లో.. డేటా అండ్ స్ట్రాటజీ ఎనలిస్ట్‌గా పని చేస్తున్న నికితా రావు (27).అయితే.. నికితా కనిపించట్లేదని, డిసెంబర్ 31న ఎల్లికాట్ సిటీలో చూశానని పోలీసులకి అర్జున్ వర్మ(26) ఫిర్యాదు.ఈ నెల 2న అర్జున్ ఫిర్యాదు చేయగా.. 3న నికితా మృతదేహాన్ని అతని అపార్ట్‌మెంట్‌లోనే కనుగొన్న పోలీసులు.అదే రోజు అర్జున్ ఇండియా పారిపోవడంతో.. అతడే నికితాను హత్య చేసి ఉంటాడని అనుమానిస్తున్న పోలీసులు.భారత్‌కు పరారైన అర్జున్‌ని అరెస్టు చేయడం కోసం.. ఫెడరల్ పోలీసుల సహాయం కోరిన స్థానిక పోలీసులు.

మహిళను హతమార్చిన

## గ్యాస్ డెలివరీ బాయ్.. ఆపై ఆత్మహత్య

**తిరుపతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుపతిలో దారుణం చోటుచేసుకుంది. వివాహేతర సంబంధాన్ని నిరాకరించిన మహిళను హత్య చేసిన ఓ వ్యక్తి.. ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొర్లగుంట మారుతీనగర్‌లో ఈ ఘటన జరిగింది. తిరుపతి తూర్పు సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. రేణిగుంట మండలం గుత్తివారిపల్లికి చెందిన సోమశేఖర్ తిరుపతిలో గ్యాస్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గతంలో అతనికి వివాహం జరిగింది. భార్యతో విడిపోయి కొర్లగుంటలోని మారుతీనగర్‌లో ఒంటరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తెలంగాణలో ఖమ్మం జిల్లాకు చెందిన లక్ష్మి.. కొంతకాలం క్రితం తిరుపతిలోని జీవకోనకు వచ్చారు. ఆమె భర్త, కుమారుడితో కలిసి నివాసముంటోంది. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సమోసా దుకాణంలో పనిచేస్తోంది. గ్యాస్ డెలివరీ నిమిత్తం అక్కడికి వెళ్లే సోమశేఖర్‌తో లక్ష్మికి పరిచయం ఏర్పడింది. అది వివాహేతర సంబంధంగా మారింది. ఇటీవల ఈ బంధాన్ని ఆమె నిరాకరించింది. దీంతో చివరిగా మాట్లాడదామని ఆమెను సోమవారం తన గదికి పిలిపించుకున్నాడు. అక్కడికి వచ్చిన తర్వాత చాకుతో లక్ష్మి గొంతు కోసి హతమార్చాడు. అనంతరం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## పోలీస్‌స్టేషన్ ఎదుటే నరికేశారు

### వివాహేతర సంబంధమే కారణం
### శ్రీసత్యసాయి జిల్లా తనకల్లులో ఘటన



**తనకల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** మాయమాటలు చెప్పి తన భార్యను తీసుకుపోయాడన్న కోపంతో ఒక వ్యక్తి తన సోదరుడి సాయంతో పోలీస్ స్టేషన్ ఎదుటే అతడిని దారుణంగా నరికి చంపాడు. శ్రీ సత్యసాయి జిల్లా తనకల్లు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తనకల్లు మండలం తవళం పంచాయతీకి చెందిన ఎర్రి హరి, నాగశిరీషలకు వ్యవసాయమే జీవనాధారం. వారికి సంతానం లేదు. ఆమెకు ఇటీవల తనకల్లు మండలంలోని రాగినేపల్లికి చెందిన ఈశ్వరప్పతో వివాహేతర సంబంధం ఏర్పడింది. అతడు అన్నమయ్య జిల్లా ములకలచెరువులో హొటల్ నిర్వహిస్తున్నాడు. భార్య ఇరవై రోజుల కిందట మృతిచెందింది. ఇటీవల నాగశిరీష కనిపించకుండా పోవడంతో ఎర్రి హరి గత నెల 31న తనకల్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు ఆమె తిరుపతి జిల్లా గూడూరులో ఉన్నట్లు తెలుసుకున్నారు. డ్రైవర్ గంగులప్ప కారులో హరితోపాటు ఇద్దరు పోలీసులు ఆదివారం అక్కడికి వెళ్లారు. ఈశ్వరప్పతోపాటు నాగశిరీషను అదుపులోకి తీసుకున్నారు. వారిని సోమవారం తెల్లవారుజామున 3.30 గంటలకు తనకల్లు పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చారు.

**పథకం ప్రకారం..**

అప్పటికే హరి ఈ విషయాన్ని తన సోదరుడు చిన్నప్పకు ఫోన్‌లో తెలిపి, వేటకొడవళ్లను సిద్ధం చేయించుకున్నాడు. ఈశ్వరప్ప కారు దిగి పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్తుండగా హరి, చిన్నప్ప దాడి చేసి వేటకొడవళ్లతో నరకడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. ఈ ఘటనతో నిర్ఘాంతపోయిన నాగశిరీష అక్కడి నుంచి పరారైంది. పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకొని పుట్టపర్తి తరలించారు. కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ నాగేంద్ర ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం బృందం ఆధారాలు సేకరించారు. పోలీసులు హరి, చిన్నప్పతోపాటు కారు డ్రైవర్ గంగులప్ప, సహకరించిన శంకర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తల్లిదండ్రులు బడికెళ్ళమన్నందుకు

## ఉరివేసుకుని బాలుడి ఆత్మహత్య

**రాయదుర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** సెలవులు ముగిశాయి..బడికి వెళ్లేందుకు సిద్ధం కావాలని తల్లిదండ్రులు చెప్పడంతో అందుకు ఇష్టంలేని ఓ బాలుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్.బాలరాజు కథనం ప్రకారం.. ఏపీలోని కడప జిల్లా పోరుమామిళ్ల మండం, అక్కలరెడ్డి పల్లె గ్రామానికి చెందిన ఓ కుటుంబం 15 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి గౌలిదొడ్డిలో నివాసం ఉంటోంది. కుటుంబ పెద్ద వాచ్‌మన్‌గా పనిచేస్తోండగా.. ఆయన కుమారుడు (14) చందానగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. కాగా క్రిస్మస్ సెలవులు ముగిసినా బడికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఆదివారం సాయంత్రం తల్లిదండ్రులు సోమవారం నుంచి బడికి వెళ్లేందుకు బ్యాగు సర్దుకుని సిద్ధం కావాలని కుమారుడికి చెప్పారు. ఈ క్రమంలో తల్లి ఇంటి బయట పనిలో నిమగ్నమవగా బాలుడు లోపల ఇంట్లోని రేకుల పైకప్పు రాడ్డునకు ఉరివేసుకున్నాడు. కాసేపటి తర్వాత తల్లి వచ్చి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. తండ్రి ఫిర్యాదుతో గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉంగరాల స్వామీ.. బంగారం ఏదీ

### ప్రజలను మోసం చేసిన ఆశ్రమం నిర్వాహకులు - ఎస్పీ కార్యాలయానికి వచ్చిన బాధితులు

**మదనపల్లె, విశ్వం వాయిస్ న్యూస్ :** మీ ఇంట్లో ఉన్న బంగారాన్ని తీసుకొచ్చి పూజలో పెట్టండి.. ఏడాదిలో రెట్టింపు బంగారం కొనుగోలు చేస్తారంటూ ఓ స్వామీజీ చెప్పడంతో ప్రజలు గుడ్డిగా నమ్మారు. పెద్ద సంఖ్యలో బంగారం, నగదు ఆయనకు అందజేశారు. తీరా స్వామీజీ అనారోగ్యంతో కన్నుమూయగా ఆయన కుటుంబ సభ్యులు, మనవడు సొత్తు తీసుకొని ఉడాయించడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ ఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లెలో చోటు చేసుకుంది. మదనపల్లెలోని బసినికొండ గ్రామంలో వెంకటశాస్త్రి అనే వ్యక్తి ఉంగరాల స్వామిగా పేరొందాడు. సొంతంగా కేదారేశ్వర ఆలయాన్ని నిర్మించి అక్కడే ఒక ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆయన మనవడు తరుణ్, మరికొందరు ఈ ఆశ్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఎవరైనా 42 రోజుల పాటు బంగారాన్ని తమ ఆశ్రమంలో ఉంచి పూజలు చేస్తే, ఏడాది తిరిగేసరికి వారు రెట్టింపు బంగారాన్ని కొనగలుగుతారంటూ కొన్నాళ్లుగా వెంకటశాస్త్రి, తరుణ్ ప్రచారం నిర్వహించారు. దీంతో మదనపల్లెతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు 3 కిలోల బంగారం, రూ.కోటి వరకు నగదును ఆశ్రమంలో పెట్టారు. రెండు నెలల క్రితం వెంకటశాస్త్రి (62) అనారోగ్యంతో మృతి చెందారు. అనంతరం స్వామీజీ కుటుంబ సభ్యులు మొత్తం సొమ్ముతో పరారయ్యారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీ ధీరజ్‌ను ఆశ్రయించారు. స్వామీజీ పరిచయం చేసిన వారిని నమ్మి 19.40 గ్రాముల బంగారు, రూ.59 వేలు నగదు ఆశ్రమంలో పెట్టామని మదనపల్లె మండలం బసినికొండకు చెందిన లావణ్య విలపించారు. 90 గ్రాముల బంగారు, రూ.70 వేలు నగదు స్వామీజీకి ఇస్తే, కుటుంబ సభ్యులు ఎత్తుకుపోయారని తమిళనాడు రాష్ట్రం పల్లిపట్టుకు చెందిన రామ్మూర్తి వాపోయారు.

# హెల్త్ వాయిస్

## బొప్పాయి గింజలు తింటున్నారా..?

### అయితే, మీ శరీరంలో ఏం జరుగుతుందో తెలిస్తే..



బొప్పాయి ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరమైన ఆహారం. పోషకాలకు శక్తివంతమైన ఇది శరీరానికి అవసరమైన పోషకాలను తిరిగి నింపడంలో సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండే బొప్పాయిలో ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, అమైనో ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర పోషక లోపాలను పూరించడానికి సహాయపడతాయి. బొప్పాయి లోని ఫైబర్ జీర్ణక్రియకు సహాయపడుతుంది. శరీర పనితీరును సరైన రీతిలో నిర్వహిస్తుంది. అయితే, బొప్పాయి మాదిరిగానే ఆరోగ్యానికి మేలు చేస్తుంది. కానీ, మనం బొప్పాయి తిన్న తర్వాత విత్తనాలను పారేస్తాము. మీరు పారేస్తున్న బొప్పాయి గింజలు కేవలం వ్యర్థ పదార్థాలు మాత్రమే కాదు.. అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్నాయని మీకు తెలుసా? బొప్పాయి గింజల ప్రయోజనాలు, వాటిని ఎలా తినాలో ఇక్కడ తెలుసుకుందాం.. మీరు మాంసాహారం తినకపోతే ఈ విత్తనాలు మీ శరీరంలోని ప్రోటీన్ లోపాన్ని పూరించడంలో సహాయపడతాయి. ఈ విత్తనాలను తినడం వల్ల పేగు ఆరోగ్యం మెరుగుపడుతుంది. వాటిలో ఫైబర్, పపైన్, కార్పైన్ వంటి జీర్ణ ఎంజైమ్‌లు ఉంటాయి. ఇవి సరైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తాయి. బొప్పాయి విత్తనాలలో ఆరోగ్యకరమైన మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ నియంత్రణలో సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ విత్తనాలలో ఫ్లేవనాయిడ్లు, ఫినాలిక్ సమ్మేళనాలు వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి అవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. బొప్పాయి గింజల్లో మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఆరోగ్యానికి అవసరమైన వివిధ అమైనో ఆమ్లాలు కూడా వీటిలో ఉంటాయి. బొప్పాయి గింజల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది, ఇది రోగనిరోధక శక్తిని బలంగా ఉంచుతుంది. మీరు ఈ విత్తనాలను కూడా తినాలి. బొప్పాయి గింజల్లో యాంటీ-ఆక్సిడెంట్లు, విటమిన్లు మరియు మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. ఇవి చర్మం, జుట్టు సంబంధిత సమస్యలను దూరం చేయడంలో దివ్యౌషధంగా పనిచేస్తుంది. బొప్పాయి గింజలు తీసుకుంటే ఊబకాయ సమస్య తగ్గుతుంది. ఈ గింజల నీటిని పరగడపున తాగితే నడుము చుట్టూ పేరుకుపోయిన కొవ్వు కరిగిపోతుంది. కడుపు నిండిన భావన కలిగిస్తుంది. దీని వల్ల జీర్ణశక్తి, జీవక్రియకి మంచిది. మొత్తం బరువుని కంట్రోల్ చేయడంలో తోడ్పడుతుంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 07 జనవరి 2026




www.viswamvoice.com









## కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే

# బ్లో అవుట్ ప్రమాదం

### ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడంలో బీజేపీ విపరీత ధోరణి : సిపిఐ
### ఇరుసుమండలో సంభవించిన బ్లో అవుట్ ప్రమాద తీవ్రతను పరిశీలించిన పలు మానవ హక్కుల సంఘాలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య విధానాల వలనే బ్లో అవుట్ ప్రమాదం సంభవించిందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తుల పరం చేయడంలో బిజెపి ప్రభుత్వం విపరీత ధోరణి పాటిస్తుందని సిపిఐ కార్యకర్తలు మంగళవారం ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఇరుసు మండలో సంభవించిన బ్లో అవుట్ ప్రమాద తీవ్రత పై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టగా, పలు మానవ హక్కుల సంఘాలు ఆ ప్రాంతాన్ని మంగళవారం పరిశీలించాయి. ఈ సందర్భంగా సిపిఐ కార్యకర్తలు మాట్లాడుతూ ప్రమాదం సంభవించిన ప్రాంతంలో తీవ్రతను తగ్గించేందుకు అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని, ప్రమాదం జరిగిన చుట్టుపక్కల ప్రాంతాలలో నష్టపోయిన రైతులకు, ప్రజలకు ప్రభుత్వం ఆర్థిక భరోసా అందించి, అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు. ఇరుసుమండ గ్రామంలో మెడికల్ క్యాంపులు, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై సహాయక చర్యలు చేపట్టాలని, అవసరమైన పరీక్షలు నిర్వహించి వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని సంస్థలను నిర్వీర్యం చేసి, ప్రైవేట్ వ్యక్తుల చేతిలో వాటిని పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఓఎన్జిసి కార్యక్రమాలను స్వతంత్రంగా జరగనీయకుండా అడ్డుకుంటూ, ఇబ్బంది పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓఎన్జిసి కార్యకలాపాలలో నూతన యంత్రాలతో పని జరగనీయకుండా చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఖగోళ శాస్త్రవేత్తలు అనధికారికంగా చేపడుతున్న త్రవ్వకాల వలన భూమి కుంగిపోతుందని హెచ్చరిస్తున్నప్పటికీ ప్రభుత్వాల తీరులో మార్పు లేదని వాపోయారు. ఆయిల్ ను భూమి నుండి తీసిన తరువాత ఆ ప్రాంతాన్ని ఇసుకతో పూడ్చాలని కానీ నిబంధనలను తుంగలో తొక్కి ప్రమాదాలకు కారణమయ్యేలా ప్రభుత్వాలు తీరు ఉందన్నారు. ఇరుసమండ ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ప్రాంతంలో ఓఎన్జిసి, ఆయిల్ తవ్వకాలు జరిగే ప్రాంతాలలో తనిఖీలు ఉధృతం చేసి చర్యలు చేపట్టాలని, వైపుల పరిస్థితి పాడైన నేపథ్యంలో సాంకేతికతను ఉపయోగించి నూతన కార్యకలాపాలను జరిగించాలి అని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆరోగ్యాలతో ప్రభుత్వాలకు ఆటలు తగవని సిపిఐ కార్యకర్తలు హితవు పలికారు.







## రాజమండ్రిలో ట్రాఫిక్ నియంత్రణ సాధ్యమేనా..?



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం నగరం ఒక చారిత్రాత్మక పట్టణం మరియు పుణ్యక్షేత్రం. అనునిత్యం ట్రాఫిక్ రద్దీగా ఉండే ఈ నగరంలో ప్రయాణికులు ఎదుర్కొనే సమస్యల గురించి సేకరించిన ప్రజాభిప్రాయం మీ ముందుకు తీసుకువచ్చే చిరు ప్రయత్నం. రాజమండ్రి నగరంలో ట్రాఫిక్ రద్దీ మరియు వాహనాల పార్కింగ్ సమస్యలు ప్రజలకు ఎన్నో ఇబ్బందులను కలిగిస్తున్నాయి. ఏ రోడ్డు చూసినా రోడ్డుకు రెండు ప్రక్కల వాహనాల పార్కింగ్‌కు ప్రజలు వాడుకోవడం, ఎంత ఇరుకు వీధిలకైనా కార్లు, ఆటోలు ప్రయాణించడం, ప్రధాన వ్యాపార కూడలిలో దుకాణాల ముందు కార్లు, ఆటోలు ఆపి కొనుగోలు చేయడం, సాటి ప్రయాణికుడు గురించి ఆలోచించకుండా విచ్చల విడిగా వాహనాలు నడపడం, ఉన్న రోడ్డును కార్లు, ద్విచక్ర వాహనాలు పార్కింగ్‌కు వాడడం వంటి అంశాల వల్ల వాహనదారులు ఎన్నో ఇబ్బందులకు గురికావడమే కాకుండా ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. ట్రాఫిక్ రద్దీ వల్ల ప్రయాణ సమయం పెరుగుతోంది, ఇది ప్రజల విలువైన సమయాన్ని దూరం చేస్తోంది. అంతేకాకుండా, ట్రాఫిక్ రద్దీ వల్ల వాహనాల ఇంధన వినియోగం పెరుగుతోంది, ఇది ఆర్థిక నష్టాన్ని కలిగిస్తోంది, ఇక ఉదయం సాయంత్రం అయితే చెప్పుకోనక్కర్లేదు.. స్కూలు, కాలేజ్ విద్యార్థుల తో బస్సులు, ఆటోలు ఎప్పుడు ఎక్కడ బ్రేక్ వేస్తారో తెలియదు..సడన్గా బ్రేకులు వేస్తారు.. నడి రోడ్డుపై.. వీధికి అడ్డంగా నిలుపుతారు..ప్రమాదాలకు కారణభూతులవ్వుతారు. విద్యార్థులు అతి వేగంగా వాహనాలను నడుపుతూ.. తోటి ప్రయాణికులకు ఇబ్బంది కలిగిస్తుంటారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి, ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయడం, వన్ వే మార్గాలు నెలకొల్పడం,ట్రాఫిక్ నియమాలను పాటించేలా చూడడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి చర్యలు తీసుకోవాలి. అప్పుడే రాజమండ్రి నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించవచ్చు



మరియు ప్రజలకు సురక్షతమైన ప్రయాణాన్ని కల్పించవచ్చు. రాజమండ్రి ట్రాఫిక్ పోలీసులు ప్రతిక్షణం వారి విధులను నిర్వహిస్తూ.. వారు చేస్తున్న పనితీరును కూడా ప్రజలు అభినందిస్తున్నారు.పెరుగుతున్న వాహనాలు దృష్ట్యా ,అలాగే ట్రాఫిక్ నిబంధనలు పాటించి ట్రాఫిక్ సిబ్బందికి కూడా ప్రజలు సహకరించాలి, రాజమండ్రి నగర అభివృద్ధికి మరియు ప్రజలకు సురక్షతమైన ప్రయాణానికి ప్రభుత్వ అధికారులు, నాయకులతో పాటు మనం అందరం కలిసి పనిచేస్తే, రాజమండ్రి నగరాన్ని ఒక ఆదర్శ నగరంగా మార్చవచ్చు అని పలువురు నగరవాసులు తమ అభిప్రాయాన్ని పత్రిక ముఖంగా తెలిపారు.

### పరకామణి కేసులో

## పోలీసులపై క్రిమినల్ చర్యలు

### కీలక వ్యాఖ్యలు చేసిన ఏపీ హైకోర్టు
### సీఐడీ, ఏసీబీ దర్యాప్తుకు ఆదేశాలు - టీటీడీ లెక్కింపుపై పలు ప్రశ్నలు




**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల పరకామణి కేసు విచారణలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న పోలీసు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దర్యాప్తు విషయంలో ముందుకు సాగాలని సీఐడీ, ఏసీబీలను ఆదేశిస్తూ స్పష్టమైన సూచనలు చేసింది. నిందితులతో కొందరు పోలీసు అధికారులు చేతులు కలిపినట్లు సీఐడీ సమర్పించిన నివేదికలో స్పష్టంగా ఉందని ధర్మాసనం పేర్కొంది. ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పనిసరిగా తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. సీఐడీ, ఏసీబీ దర్యాప్తులో తేలిన ఇతర అంశాలపై కూడా విచారణ కొనసాగించవచ్చని కోర్టు స్పష్టం చేసింది. పరకామణిలో కానుకల లెక్కింపు అంశంలో టేబుళ్ల ఏర్పాటు, లెక్కింపు విధానం స్పష్టంగా లేకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. లెక్కింపునకు లుంగీలు ధరించి రావడం వంటి అంశాలకు బదులుగా ప్రత్యామ్నాయ విధానాన్ని ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించింది. టేబుళ్ల ఏర్పాటు, పర్యవేక్షణపై పూర్తి వివరాలు నివేదికలో లేవని కోర్టు పేర్కొంది. ఈ అంశాలపై టీటీడీ ఈవోతో చర్చించి పూర్తి వివరాలు కోర్టు ముందు ఉంచుతామని తిరుమల తిరుపతి దేవస్థానం తరఫు న్యాయవాది తెలిపారు. కేసులో ప్రమేయం ఉన్న వారిపై శాఖాపరమైన చర్యలు అవసరమని హైకోర్టు మరోసారి స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి వాయిదా వేసింది.



భోగాపురం విమానాశ్రయంతో

# ఉత్తరాంధ్రకు విశ్వఖ్యాతి



**భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు ప్రాణం పోసింది సీఎం చంద్రబాబే**
**ఉత్తరాంధ్ర భవితకు భోగాపురం గేట్వే ఉ చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం**
**అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ పాలన : రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు ద్వారా ఉత్తరాంధ్ర కు విశ్వక్యాతి దక్కనుందని, ఎయిర్ పోర్ట్ నిర్మాణంలో కర్త, కర్మ, క్రియాగా సీఎం చంద్రబాబు నాయుడే చేసారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ విషయం జగన్ పాలనలో మరుగున పడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శరవేగంతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తయ్యే దశకు చేరిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి, నిర్ణయాత్మక నిర్ణయాలుతో ఎయిర్ పోర్ట్ కు 2014-19 మధ్య శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్ర ప్రాంతాన్ని అంతర్జాతీయ అభివృద్ధి పటంపై నిలపాలన్న సంకల్పంతో భోగాపురం విమానాశ్రయాన్ని రూపకల్పన చేసి భూసేకరణ, కేంద్ర ప్రభుత్వ అనుమతులు, పెట్టుబడుల సమీకరణ వంటి క్లిష్ట అంశాలన్నింటినీ సమర్థంగా పరిష్కరించి ప్రాజెక్టును పట్టాలెక్కించిన ఘనత ఆయనకే దక్కుతుందని మంత్రి తెలిపారు. జగన్ పాలనలో ఈ కీలక ప్రాజెక్ట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసి, ఫైళ్లలోనే మగ్గేలా చేసి ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. అభివృద్ధి అంటే ఫ్లెక్సీలు, ప్రకటనలు కాదనౌ అభివృద్ధి అంటే నిర్ణయాలు, కార్యాచరణ, ఫలితాలు అని చంద్రబాబు పాలన మరోసారి నిరూపిస్తోందని ఆయన అన్నారు. భోగాపురం విమానాశ్రయం ద్వారా ఉత్తరాంధ్రకు అంతర్జాతీయ గుర్తింపు, పరిశ్రమలు, ఐటీ, పర్యాటక రంగాల్లో భారీ పెట్టుబడులు రావటం ద్వారా వేలాది యువతకు ఉపాధి అవకాశాలు విశాఖపట్నం పరిసర ప్రాంతాల ఆర్థిక విప్లవం, ఇవన్నీ సాధ్యమవు తుందన్నారు. సీఎం చంద్రబాబు ప్లానింగ్, ఎగ్జిక్యూషన్, విజన్ వల్ల రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు. నాలుగేళ్లు అభివృద్ధిని అడ్డగించినవారు ఇప్పుడు విమర్శలు చేసే నైతిక హక్కు కోల్పోయారని, పని చేసే నాయకుడు ఎవరో.. అభివృద్ధిని ఎవరు అడ్డుకున్నారో ప్రజలు స్పష్టంగా చూస్తున్నారని మంత్రి సుభాష్ ఘాటుగా వ్యాఖ్యానించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గేట్వేగా నిలుస్తుందని, ఇది పూర్తిగా సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వ విజయమని మంత్రి తేల్చిచెప్పారు. ఎర్ర బస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్పోర్ట్ ఎందుకంటూ జగన్ అప్పట్లో అన్న మాటలు వాస్తవం కాదా అని మంత్రి ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు తీసుకొచ్చిన అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ పాలన చేశారని మంత్రి దుయ్యబట్టారు. కూటమి పాలన 18 నెలల కాలంలో విమానయాన నుంచి ముఖ్యమైన క్లియరెన్స్ లు, సిఐఎస్ఎఫ్ భద్రత దళాల నియామకం, కస్టమ్స్, ఇమిగ్రేషన్ చెక్ పోస్ట్ (ఐ సి పి) వంటి అనుమతులు వచ్చాయన్నారు. ఇప్పుడు జగన్ ప్రభుత్వంలోనే భోగాపురం విమానాశ్రయం తీసుకొచ్చామని దుష్ప్రచారం చేయడం నీతిమాలిన చర్య అని మంత్రి సుభాష్ ఘాటుగా విమర్శించారు.

# గ్యాస్ లీకేజ్ పట్ల ఆందోళన వద్దు : కలెక్టర్ మహేష్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరుసుమండ గ్రామంలో నిన్న జరిగిన గ్యాస్ లీకేజ్ మూలంగా చుట్టుపక్కల పరిసర ప్రాంతాల వారు ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని మంటలు అదుపు లోనికి వచ్చాయని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడించారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక కలెక్టరేట్ నందు పాత్రికేయులు సమావేశం నిర్వహించి గ్యాస్ లీకేజీ సందర్భంగా ఓఎన్జిసి చేపట్టిన గ్యాస్ లీకేజ్ మంటల నియం త్రణ చర్యల పరిణామాలను పాత్రికేయులకు వివరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్కిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఓ ఎన్ జి సి చమురు బావి నందు పెర్ఫోరేషన్ చేస్తుండగా ఈ నెల 5 వ తేదీ ఉదయం 11:30 గంటలకు గ్యాస్ లీకేజీ అయ్యి 12:30 గంట లకు మంటలు వ్యాపిం చాయని తెలిపారు. ఈ యొక్క మం టలను అదుపు చేసేందుకు బోరుబావి చుట్టూ పంట కాలువల నుండి నీటిని నాలుగు పంపులు ద్వారా నీటిని పంపిణీ చేస్తుండడం మూలంగా మం టలు చాలావరకు అదు పులోకి వచ్చాయన్నా రు. ఇరుసుమండ లక్కవరం, గుబ్బల వారి పాలెం గ్రామాలకు చెందిన సుమా రు 450 మందిని బ్లో అవుట్ సంఘటన మూలంగా సురక్షత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. ఈ మూడు గ్రామాల వారు ఎటువంటి భయాందోళనల కు గురి కావాల్సిన అవస రం లేదని గ్యాస్ లీకేజీ మంటలు 90% తగ్గు ముఖం పట్టాయని రానున్న నాలుగు రోజులలో మంట లు అదుపులోకి వస్తాయని మొత్తం మీద వారం రోజు లలో బోరు బావికి క్యాపిం గు బిగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఒకేసారి బోరు బావులు మంటలు అదుపు చేయడం వల్ల శాస్త్రీయంగా పర్యావర ణపరంగా ఇబ్బం దులు ఉన్నాయని ప్రత్యే క గ్యాస్ లీక్ నియంత్రణ టీము లు నిర్ధారించిన నేపథ్యంలో వారి సూచనల మేరకు క్రమక్రమంగా మంటలను అదుపు చేస్తూ 4 రోజులలో పూర్తిగా మంటలను నిలు పుదల చేయడం జరుగు తుందన్నారు. రెండు ప్రత్యేక నిపుణులతో కూడిన గ్యాస్ లీకేజ్ నియంత్రణ టీములు ముంబై , నుంచి డ్రిల్లింగ్ ప్రాం తానికి చేరుకొని నియం త్రణ చర్య లకు సిద్ధమ య్యాయన్నా రు గ్యాస్ లీకేజీబ్లో అవుట్ మూలంగా ఇరుసుమండ గ్రామంలో బోరుబావి చుట్టు పక్కల మూడు ఎకరాల విస్తీర్ణంలో వరి పంట 75 కొబ్బరి చెట్లు దెబ్బతిన్నాయని, అదేవి ధంగా సుమారు 450 మందికి పునరావాసం కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఉత్త ర్వుల మేరకు నష్టాల అంచ నాలను గణించి నష్టపరి హారాలను అందిం చడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఓఎన్జిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శాంత నూరు దాస్, రాజమండ్రి, సక్సేన న్యూ ఢిల్లీ, జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిశాంతి, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్, రాహుల్ మీనా తదితరులు పాల్గొ న్నారు.

ఓఎన్జిసి, గెయిల్ వంటి సంస్థలు కోనసీమ జిల్లాను

# అగ్నిగుండంగా మార్చేస్తున్నాయి..

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామంలో ఓ ఎన్ జి సి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న వర్క్ ఓవర్ రిగ్, డీప్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతూ ఇటీవలే ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే. ఈ సంస్థ నాసిరకం మెటీరియల్ వాడుతూ, సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం వల్ల ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై నిపుణుల కమిటీతో దర్యాప్తు చేయించి సరైన కారణాలు కనుగొని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. కోనసీమ జిల్లాను ఓఎన్జిసి, గేయిల్ వంటి సంస్థలు అగ్నిగుండంగా మార్చేస్తున్నాయనీ దుయ్యబట్టారు. కోనసీమ లో ఈ సంస్థలు భూగర్భం నుండి చమురు నిల్వలు మరియు గ్యాస్ తీసి వేస్తున్నారు తప్ప, తీసిన దానికి సమాన రీతిలో వాటర్తో ఆ భాగాన్ని భర్తీ చేయడం లేదని, దీనిని ప్రభుత్వం మరియు ఓఎన్జిసి అధికారులు పట్టించుకోవడం లేదని, దీనివల్ల కొన్ని సంవత్సరాలకు కోనసీమ జిల్లా మనుగడకే ప్రమాదం పొంచి ఉందని ఆయన తెలియజేశారు. ఓఎన్జిసి ,గేల్ వంటి సంస్థలు బావులను ప్రైవేట్ వారికి అప్పగించడం వల్ల వారు పూర్వకాలపు పాత పైపులను మార్పు చేయకుండా, కేవలం లాబాపేక్షతో పాత పైపులస్థానంలో కొత్త వాటిని మార్చుకున్న తరాలుగా వాటిని కొనసాగించడం వల్ల ఇటువంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల భద్రత ను పూర్తిగా గాలికి వదిలేసారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఓఎన్జిసి గెయిల్ సంస్థల వలన దీని కారణంగా కోనసీమ జిల్లాలో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని, రోడ్లు పాడైపోతున్నాయి,భూగర్భ జలాలు పాడైపోయి, తద్వారా ప్రజల అనారోగ్యం పాలవుతున్నారని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించి ప్రజల ఆరోగ్యాన్ని మరియు భద్రతను కాపాడాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తక్షణమే పునరావాసం పొందుతున్న బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, కొబ్బరి తోటలు పంట పొలాలు నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సరైన భద్రత ప్రమాణాలు పాటించకుండా ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటున్న ఈ ఓఎన్జిసి సంస్థలపై వైఎస్ఆర్సిపి పార్టీ తరపున ప్రజా ఉద్యమం చేస్తామని ఆంధ్ర ప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ తెలియజేశారు.

విద్యానిధి కళాశాలలో

# 37వ రహదారి భద్రతా మాసోత్సవాలు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలోని విద్యానిధి కళాశాలలో 37వ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా రవాణా అధికారి డి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు రహదారి భద్రతా నియమాల ప్రాముఖ్యతను వివరించారు.ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ, విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హెల్మెట్ వినియోగం పాటించేలా ప్రతిజ్ఞ చేయించారు. అలాగే రోడ్లపై ప్రయాణించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా సూచనలు చేశారు. అనంతరం కళాశాల సిబ్బందికి డిటిఓ హెల్మెట్లను బహూకరించి రహదారి భద్రతపై తమ వంతు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అమలాపురం పట్టణ సీఐ వీరబాబు, అమలాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ డి.ఎల్.ఎన్.శర్మ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రవికుమార్, రవాణా శాఖ సిబ్బంది, విద్యానిధి కళాశాల చైర్మన్ నాయుడు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

అమలాపురంలో బంగి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారి

# సంక్రాంతి సంబరాలు




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఫియోనా సన్ ఫ్లవర్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులు అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రం అమలాపురంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సం బరాలు అత్యంత ఘనంగా జరిగాయి. కంపెనీ అమలాపురం ఆథరైజ్డ్ డీలర్ శ్రీ గణేష్ కిరణా అండ్ జనరల్ మర్చంట్స్ వారి ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. తెలుగు వారి సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా ఎడ్ల బండ్లు, గరగ నృత్యాలు, డోలు సన్నాయి, గంగిరెద్దులు డుడు బసవన్నలు, వినోదాన్ని అందించే ఎలుగుబంట్ల వేషదారుల కోలాహలాంతో పట్టణంలోని ఎర్రమిల్లి వారి వీధినుండి ముస్లిం వీధి కాలేజ్ రోడ్ కూచిమంచి వారి అగ్రహారం గడియార స్థంభం మీదుగా పలు వీధుల్లో తమ కంపెనీ బ్రాండ్ ను ప్రదర్శిస్తూ వీరు జరిపిన సంబరాలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడుతూ 2 శతాబ్దాల ఘన చరిత్ర కలిగిన తమ కంపెనీ 43 దేశాల్లో విస్తరించిందని తెలిపారు. వీటో టెక్నాలజీతో తాము సన్ ఫ్లవర్ ఆయిల్ ను తయారు చేస్తున్నందు వలన ఆయిల్ ను బాయిల్ చేసినప్పటికీ పోషకాలు పుష్కలంగా ఉంటాయని పేర్కొన్నారు. దేశంలోనే అత్యున్నత స్థానంలో తమ కంపెనీ కొనసాగుతుందని వెల్లడించారు. సంక్రాంతి సంబరాలు నిర్వహించడం ద్వారా తమ కంపెనీ ఆయిల్ పట్ల ప్రజలకు అవగాహనకల్పించామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గణేష్ కిరణా అండ్ జనరల్ మర్చంట్స్ యజమానులుకుప్పాల బ్రదర్స్ వీర వెంకట సత్యనారాయణ అలియాస్ శ్రీను, రామకృష్ణ అలియాస్ (ఆర్కె)వెంకటేశ్వరరావు అలియాస్ బుజ్జి, అధిక సంఖ్యలో కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోనసీమ తిరుమల వెంకన్న ఆలయ అభివృద్ధికి

# రూ.1,00,116 విరాళం



**ఆత్రేయపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకన్న ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు రూ 1,00,116/- రూపాయలను అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం వాస్తవ్యులు శాఖ చిరంజీవి, పుష్పావతి దంపతులు అందజేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మరియు డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరంజీవి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొని ఆలయ అభివృద్ధి నిమిత్తం రూ.1,00,116/- విరాళంగా అందజేశారన్నారు.ఈ సందర్భంగా చిరంజీవి కుటుంబ సభ్యులకు స్వామి దర్శనం అనంతరం స్వామి చిత్రపటాన్ని తీర్థ ప్రసాదాలను అందజేశారు ఈ సందర్భంగా ఆయన అభివృద్ధికి విరాళాలు అందజేసిన చిరంజీవిని అభినందనలు తెలియజేశారు.

# మన శంకర వరప్రసాద్ గారు మొదటి టికెట్ వేలం పాట రూ.1.11 లక్షలు




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** మన శంకర వరప్రసాద్ గారు' మొదటి ట్కెట్ వేలంపాట రూ.1.11 లక్షలకు తొలి ట్కెట్ దక్కించుకున్న మోకా వెంకట సుబ్బారావు.మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ గారు చిత్రం ఈ నెల 12వ తేదీన విడుదల కానున్న సందర్భంగా, అమలాపురం మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం శ్రీ వెంకటరమణ థియేటర్ ఆవరణలో మొదటి ట్కెట్ వేలంపాటను ఘనంగా నిర్వహించారు.ఈ వేలంపాటలో బీజేపీ సీనియర్ నాయకులు మోకా వెంకట సుబ్బారావు అందరికంటే అధికంగా రూ.1,11,000/- (ఒక లక్ష పదకొండు వేల రూపాయలు)కు మొదటి ట్కెట్‌ను దక్కించుకున్నారు. ఆయనకు పోటీగా వల్లభరెడ్డి వెంకటరమణ (వల్లభరెడ్డి మోటార్స్ అధినేత) వేలంపాటలో పాటకు రాగా, చివరకు అత్యధికంగా పాట పాడిన మోకా వెంకట సుబ్బారావు ట్కెట్‌ను సొంతం చేసుకోవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా మెగా ఫ్యాన్స్ ప్రతినిధులు నల్లా చిట్టిబాబు, యేడిద శ్రీను, నల్లా నాయుడు తదితరులు మోకా వెంకట సుబ్బారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ, చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షంచారు.ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, మెగా ఫ్యాన్స్ పాల్గొన్నారు.

# తిరుమలలో ఘనంగా 26వ అహోరాత్ర వేదపారాయణం

చారిత్రాత్మకంగా నిర్వహించిన పెదసనగంటి సీతారామమూర్తి శర్మ అవధాని



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల శ్రేయస్సు, గ్రామాభివృద్ధి. గోఉభూ సంరక్షణ, లోకకళ్యాణార్థం రావులపాలెం గ్రామానికి చెందిన ప్రముఖ టీటీడీ వేద పండితుడు పెదసనగంటి సీతారామ్మూర్తి శర్మ అవధాని కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధి తిరుమల క్షేత్రంలో 26వ అంతర్జాతీయ అహోరాత్ర వేదపారాయణం చారిత్రాత్మకంగా నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి ఉత్సవాల సందర్భంగా వివిధ రకాల పుష్పాలంకరణలు, విద్యుద్దీపాలంకరణలతో నయనమనోహరంగా అలంకరించబడిన తిరుమల క్షేత్రంలో, తీవ్రమైన శీతల వాతావరణాన్ని సైతం లెక్కచేయకుండా ఈ వేదపారాయణం అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. గతంలో 2024 2025 సంవత్సరాల్లో నిర్వహించిన వేదపారాయణాలతో పాటు, 2026 సంవత్సరంలోనూ వరుసగా మూడవసారి ఈ మహా కార్యక్రమాన్ని పెదసనగంటి సీతారామమూర్తి శర్మ అవధాని విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుక్లయజుర్వేదం కాణ్వశాఖ చరిత్రలోనే కాకుండా, తిరుమల తిరుపతి దేవస్థానం, రావులపాలెం గ్రామం, భారతదేశం, ప్రపంచ చరిత్రలో తొలిసారిగా 24 గంటల పాటు నిర్విరామంగా అహోరాత్ర వేదపారాయణం నిర్వహించామని తెలిపారు. ఈ అహోరాత్ర వేదపారాయణం 2026 జనవరి 5వ తేదీ సోమవారం ఉదయం 6.36 గంటల నుంచి 6వ తేదీ మంగళవారం ఉదయం 6.36 గంటల వరకు నిరంతరంగా కొనసాగించానని చెప్పారు. వేదపండితులు బ్రహ్మశ్రీ గౌరీశంకర్ శర్మ ఘనపాఠీ ఆధ్వర్యంలో ఈ వేదపారాయణం శ్రవణానందాన్ని కలిగించేలా ఘనంగా జరిగింది.

# ఎక్మోతో రోగికి పునర్జన్మ..

విజయవాడ ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో అరుదైన చికిత్స



**విజయవాడ (కరెన్సీనగర్), విశ్వం వాయిస్ న్యూస్ :** హైపర్ థైరాయిడిజంతో హార్ట్ ఫెయిల్ అయిన వ్యక్తికి ఎక్మో సాయంతో చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు విజయవాడలోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్ బాబు తెలిపారు. ఈ తరహా చికిత్స చేయడం అరుదన్నారు. మంగళవారం వివరాలను వెల్లడిస్తూ.. "పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన 37 ఏళ్ల యువకుడిని ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. బాధితుడు హైపర్ థైరాయిడిజం కారణంగా ఏర్పడిన తీవ్రమైన కార్డియోజెనిక్ షాక్‌కు గురైనట్లు గుర్తించాం. ఈ స్థితిలో గుండె రక్తాన్ని పంపింగ్ చేయలేకపల్స్ పడిపోవడంతో ప్రాణాలకు ప్రమాదం ఏర్పడింది. కాపాడేందుకు అత్యాధునిక 'వీఏ ఎక్మో'ను అమర్చాం. దాని సాయంతో రక్త ప్రసరణ చేయిస్తూ, గుండెకు విశ్రాంతి కల్పించాం. మందులు ఇచ్చి హృదయ స్పందనలు సాధారణ స్థితిలోకి వచ్చేలా చేశాం. 4 రోజులు చికిత్స చేశాక గుండె పనితీరు మెరుగుపడింది. తర్వాత ఎక్మో తొలగించాం" అని రమేష్‌బాబు వివరించారు. చికిత్సలో పాల్గొన్న క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ జంపాల కార్తికేయ, డాక్టర్ పవన్, ఎండోక్రైనాలజిస్ట్ రాకేష్ బొబ్బా, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు అనూప్ వెలగ, ఎన్.రాజారమేష్, రామ్ మనోహర్, శివ ప్రసాద్, విజయ్ కుమార్ బృందాన్ని అభినందించారు.




# రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## ఎమ్మెల్యే ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** తిమ్మాపురం గ్రామ రైతులకు మంగళవారం గ్రామ జనసేన నాయకుడు మాధవరపు తాతాజీ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాస్‌బుక్కులను అధికారికంగా ఎమ్మెల్యే నానాజీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రైతుల భూ హక్కులకు పూర్తి భద్రత కల్పించాలనే లక్ష్యంతో భూములను సర్వే చేసి, నూతన యజమానుల పేర్లతో పట్టాదారు పాస్‌బుక్కుల పంపిణీ ప్రక్రియను ప్రారంభించిందని తెలిపారు. గతంలో ఉన్న భూ సమస్యలు, వివాదాలు పరిష్కరించి, రైతులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు అర్హులైన ప్రతీ రైతుకు తప్పనిసరిగా పాస్‌బుక్ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వారు స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించి, వ్యవసాయ అభివృద్ధికి మరింత బలం చేకూరుతుందని తెలిపారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల కాలం లో తిమ్మాపురం గ్రామంలో 16 కోట్ల 49 లక్షల రూపాయలతో వివిధ సంక్షేమ పథకాలకి, అభివృద్ధి పథకాలకు ఖర్చు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెంకె శ్రీనివాస్ బాబా, వల్లూరి రాజా నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు, రంభాల వెంకటేశ్వర రావు, నూరుకుర్తి వెంకటేశ్వరరావు మాదారపు తాతాజీ, పాండ్రంకి రాజు, బోళ్ల కృష్ణ మోహన్ బందిల వీరీష, పితాని లీల, తాటికాయల వీరబాబు, కరెడ్ల గోవింద్, బత్తిన దొరబాబు, కాళ్ళ ధనరాజు, కర్రి వెంకటరాజు, నందూరి సత్తిబాబు, రాందేవు సీతయ్య, తలాటం దుర్గబాబు, సుందరపు సతీష్, సోదే ముసలయ్య, చల్లపల్లిగణపతి, నందిక లోవబాబు, రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధోన్మాదం నశించాలి

## వెనిజులా దేశాధ్యక్షుడు మదురోను వెంటనే విడుదల చేయాలి




**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పోలీసుగా వ్యవహరిస్తున్న అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధోన్మాదం నశించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడ మసీదు సెంటర్లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు, సిపిఐ ( ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకులు సిహెచ్ నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి జె వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా నాయకులు అయినాపురపు సూర్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు తదితరులు మాట్లాడుతూ వెనిజులాపై అమెరికా దుశ్చర్యలను తీవ్రంగా ఖండించారు. వెనిజులా అధ్యక్షుడిగా చావేజ్ ఎన్నికైన కాలం నుంచి ఆ దేశంపై అమెరికా కక్ష కట్టిందన్నారు. చావేజ్ వారసుడిగా అధికారం చేపట్టిన నికోలస్ మధురో కూడా అమెరికా ఆగడాలకు అడ్డుకట్ట వేయడం వల్ల అమెరికాకు ఆ దేశం కంటగింపుగా మారిందన్నారు. పెద్ద ఎత్తున ఆయిల్ నిక్షేపాలు కలిగిన వెనిజులాను తమ చెప్పు చేతల్లో పెట్టుకోవడానికి అమెరికన్ ఆయిల్ కార్పొరేట్ కంపెనీలు ఈ చర్యలకు అమెరికా అధ్యక్షుడిని నడిపించాయన్నారు. గతంలో ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ను, లిబియా అధ్యక్షుడు అమెరికన్ సామ్రాజ్యవాదం హతమార్చిందని విమర్శించారు. తాజాగా జనవరి మూడో తేదీన వెనిజులా దేశాధ్యక్షుడు నికొలస్ మధురోతో పాటు తన భార్యను కూడా కిడ్నాప్ చేయడం దారుణమన్నారు. ప్రపంచానికి నీతులు చెప్పే అమెరికా అంతర్జాతీయ చట్టాలను కూడా తీవ్రంగా ఉల్లంఘిస్తుందన్నారు. భారత ప్రధాని మోడీ కూడా తనను సంతోష పరచాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించాడంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై భారత్ ధీటుగా సమాధానం చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. మధురో దంపతులను విడుదల చేయాలని భారత ప్రభుత్వం ప్రపంచ దేశాలతో కలిసి గొంతు కలపాలని కోరుతున్నామన్నారు. ప్రజలంతా అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధోన్మాదాన్ని ఖండించాలని, ప్రపంచ శాంతి కొరకు నిలబడాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకురాలు జి నాగమణి ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు కె.అంజిబాబు, ఎం సత్యం, ఆర్ దుర్గా దేవి, కె.సతీష్, బీసీ సంఘం నాయకులు రాయుడు మోజెస్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మోర్త రాజశేఖర్, ఎస్ శ్రీనివాస్, టేకుమూడి ఈశ్వరరావు, సిహెచ్ రమణి, పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, నాగాబత్తుల సూర్యనారాయణ, డి ప్రసాద్, రూరల్ కమిటీ సభ్యులు టి రాజా, సిహెచ్ అజయ్, పి రామకృష్ణలతో పాటు మేడిశెట్టి వెంకటరమణ, వీరబాబు, యు సత్యనారాయణ, జి భూలక్ష్మి, టి రాణి, వల్లు రాజు బాబు, ఎం హరనాథ్, పి సూర్యారావు, వి చంద్రరావు, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో 9న డిప్యూటీ సీఎం పవన్ పర్యటన

## ఏర్పాట్లను పరిశీలించిన ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణ



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 9వ తేదీన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడలో నిర్వహించనున్న పర్యటనకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లను కాకినాడ నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ పరిశీలించారు. కాకినాడ జిల్లా ఎస్పీ కార్యాలయ ఆవరణలోని పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద చేపట్టవలసిన ఏర్పాట్లపై రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మూర్తితో ఇంచార్జ్ కమిషనర్ చర్చించారు. అనంతరం రమణయ్యపేట మార్కెట్ సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణ సందర్శించారు. అక్కడ అల్పాహారం స్వీకరిస్తున్న ప్రజలతో మాట్లాడి ఆహార నాణ్యత, సదుపాయాలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రజలు అందించిన ఫీడ్‌బ్యాక్ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, శానిటేషన్ సూపర్వైజర్ నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ఇంటర్ విద్యాధికారిగా కేశవరావు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడలోని జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారిగా (డిఐఇఓ) వి కేశవరావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. కేశవరావు పిఠాపురంలోని ఆర్ఆర్బిహెచ్ఆర్ కళాశాల ప్రిన్సిపల్గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై పిఆర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న కార్యాలయంలో డిఐఇఓగా బాధ్యతలు చేపట్టారు. కేశవరావు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులుగా ఆయన సుమారు 36 ఏళ్ల క్రితం ఈ వృత్తిలో ప్రవేశించారు. ఆ తర్వాత వివిధ చోట్ల ఆయన విధులు నిర్వహించారు. కిర్లంపూడి ఎంఈఓగా, నిడదవోలు కళాశాల ప్రిన్సిపల్ గాను పనిచేశారు. 2019-20లో రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డును అప్పటి సీఎం చేతుల మీదుగా అందుకున్నారు. అంతకుముందు ఆయన కాకినాడ పిఆర్ కళాశాలకు వృత్తి విద్యా కళాశాలకు ప్రిన్సిపాల్గా వ్యవహరించారు. అతని హయాంలో ఎస్ఆర్ఎంటి సంస్థ వద్ద నుండి సుమారు 30 లక్షలు నిధులను సేకరించి వృత్తివిద్య కళాశాల భవనాన్ని నిర్మించారు. అలాగే ఓఎన్జిసి సంస్థ సహకారంతో పది లక్షల రూపాయలతో విద్యార్థులకు అవసరమైన టాయిలెట్లను నిర్మాణం చేయించారు. నిరంతరం విద్యార్థులకు విద్య అందించేందుకు అక్కడ సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కేశవరావు వివిధ రకాలుగా కృషి చేసేవారు. కేశవరావు బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అతనికి కళాశాల అధ్యాపకులు, స్నేహితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు కలిసి అభినందనలు తెలిపారు.

# విశాఖ ఈఎస్ఐ ఆసుపత్రికి అనుబంధంగా వైద్య కళాశాల

## ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించిన కేంద్ర బృందం - ఆసుపత్రిని తమకు అప్పగించాలని కోరుతున్న ఈఎస్ఐ



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** విశాఖపట్నంలోని ఈఎస్ఐ ఆసుపత్రికి అనుబంధంగా 50 సీట్లతో వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. విశాఖలో ప్రస్తుతం 200 పడకల అనుమతితో ఆసుపత్రి కొనసాగుతోంది. దీన్ని 220 పడకలకు పెంచి, వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని ఈఎస్ఐ కార్పొరేషన్ భావిస్తోంది. కార్పొరేషన్‌కు చెందిన మెడికల్ కమిషనర్ సప్నా మిత్తల్, డిప్యూటీ మెడికల్ కమిషనర్లు సుపర్ణ పోప్లి, బిలుంగ్ ఇ థెరెసాలతో కూడిన బృందం మంగళవారం విశాఖపట్నం ఆసుపత్రిని పరిశీలించింది. పోర్టు స్థలంలో లీజు ప్రాతిపదికన ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిని రాష్ట్ర ఈఎస్ఐ విభాగం నిర్వహిస్తోంది. వైద్య కళాశాల ఏర్పాటుకు ఆసుపత్రిని తాత్కాలికంగా తమకు అప్పగించాలని కేంద్ర కార్పొరేషన్ కోరింది. అలా ఇస్తే మిగతా పడకలకు తాత్కాలికంగా నిర్మాణాలు చేసి, వైద్య కళాశాల పరిపాలన, వసతిగృహాలకు ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకోవాలని భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చూస్తే 2026-27 విద్యా సంవత్సరంలో వైద్య కళాశాల వచ్చేందుకు అవకాశం ఉంటుంది. జాప్యం జరిగితే మరో ఏడాదికి వాయిదా పడుతుంది.

స్థలం లీజు, పడకల సమస్యలు

విశాఖ ఈఎస్ఐ ఆసుపత్రికి 200 పడకలకు అనుమతులున్నా 80 పడకలతోనే నిర్వహిస్తున్నారు. పోర్టు స్థలంలో లీజు ప్రాతిపదికన నడుస్తోంది. దీన్ని కార్పొరేషన్‌కు అప్పగిస్తే అదనపు నిర్మాణాల కోసం పోర్టు అనుమతి తీసుకోవాలి. అందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలి.

రాష్ట్ర ఈఎస్ఐ విభాగం ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆసుపత్రిని కేంద్ర ప్రభుత్వంలోని ఈఎస్ఐ కార్పొరేషన్‌కు ఇస్తే అక్కడ పని చేస్తున్న సిబ్బంది సర్దుబాటుకు ఇబ్బందులు వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఈ ఆసుపత్రికి సమీపంలోనే కార్పొరేషన్ 350 పడకలతో మరో ఆసుపత్రిని నిర్మిస్తోంది. ఇది పూర్తయ్యేందుకు ఏడాదికి పైగా సమయం పట్టనుంది. ఈలోపు వైద్య కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర పరిధిలో ఉన్న ఆసుపత్రిని లీజుకు ఇవ్వాలని కార్పొరేషన్ కోరుతోంది. ఆ మేరకు ఇస్తాం.. కానీ, సిబ్బంది సర్దుబాటు, రోగులకు సేవలందించేందుకు ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న 350 పడకల ఆసుపత్రిని తమకు ఇవ్వాలని రాష్ట్ర అధికారులు ప్రతిపాదించారు. దీనిపైనా ప్రభుత్వం చొరవ చూపించాలి.

### రహదారి భద్రత పాటింపుతో

# సురక్షత ప్రయాణం

## మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ బి.శ్రీనివాస్



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతీ వాహన చోదకుడూ తాను, తోటి వారి సురక్షత ప్రయాణం కొనసాగించేందుకు రహదారి ప్రయాణ భద్రతా నియమ, నిబంధనలను విధిగా పాటించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా సంస్థ కత్తిపూడి శాఖ కార్యాలయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.శ్రీనివాస్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి సీతారామ డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలిసి స్థానిక రవాణా శాఖ అధికారులు 37వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఎం.వి.ఐ. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతీ ద్విచక్ర వాహన చోదకుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపేవారు తమ కుటుంబ క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని భద్రత చర్యలు పాటిస్తూ వాహనాలు నడపాలి. మద్యం సేవించి వాహనాలు నడపరాదు. వేగం కన్నా ప్రాణం మిన్నని గుర్తించు కోవాలి అన్నారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో ర్యాలీని నిర్వహించి, మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అన్నవరం అడిషనల్ ఎస్పై ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ వీరబాబు, ఎన్..సి.సి. కో ఆర్డినేటర్ మొగిలి అక్కారావు పాల్గొన్నారు.

# నిస్వార్థపరుడు ఆనపాలకు జన్మదిన శుభాకాంక్షలు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం నిస్వార్థ సేవకులు, అందరివాడు, చిరువ్యాపారి, పలు స్వచ్ఛంధ సంస్థలు స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న అనపాల ఆంజనేయులు రెడ్డి జన్మదినం పురస్కరించుకుని అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కాకినాడ మరియు పరిసర ప్రాంతాలలో పలు అంధుల ఆశ్రమాలు, వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమాలలో వారికి పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు, కాయగూరలు పంచిపెట్టారు. అదేవిధంగా పలు ఆశ్రమాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిశ్వార్ధ సేవా తత్పరుడు, అవసరాల్లో ఉన్న వారికి ఆపన్న హస్తం అందించే మనసున్న మంచి మనిషి 'ఆంధ్ర అవార్డు గ్రహీత, సేవారత్న పురస్కారాలు అందుకున్న అనపాల ఆంజనేయులు రెడ్డి అని, అనేక సేవా కార్యక్రమాల ద్వారా ఎంతోమందికి అవసరాల్లో అండగా నిలిచారని తెలిపారు. అనపాల ఆంజనేయులు రెడ్డి జన్మదినం సంధర్భంగా జిల్లా ఎస్పి బింధుమాధవ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంతోమందికి ఆపన్నహస్తం అందించిన అనపాల ఆంజనేయులు రెడ్డి నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కాంక్షంచారు. ఈ కార్యక్రమంలో జి.ఆర్ శ్రీనివాస్, కె.సతీష్, పి.రాంబాబు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడిగా గీసాల



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడజిల్లా బీజేపీ అధ్యక్షుడిగా కాకినాడ రూరల్ గంగనాపల్లి నాయకులు గిసాల శ్రీనివాసులు జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు రాష్ట్ర అధిష్టానం నిర్ణయం మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గీసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు అలాగే జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవకు మరియు జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలుపుతూ రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా రాష్ట్రాలలోబిజెపి పాలిస్తుంది అని గర్వంగా తెలిపారు అలాగే ఈ దేశానికి హిందూత్వం చాలా ముఖ్యమని అటువంటి హిందూత భావాలు ఉన్న బిజెపిలో తనకు ఉన్నత స్థానం కల్పించడం తన అదృష్టం అని శ్రీనివాస్ పేర్కొన్నారు కాకినాడజిల్లా బిజెపి ఉపాధ్యక్షుడిగా నియమించిన వేళ జిల్లా వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా అతనికి పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు.

### ఫిబ్రవరి 16, 17, 18తేదీల్లో

# కాకినాడలో సీపీఐ రాష్ట్ర సభలు

**డిప్యూటీ సీఎం పవన్ జిల్లా అభివృద్ధిపై అఖిల పక్ష సమావేశం నిర్వహించాలి**

**సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు**




**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** వచ్చే నెల ఫిబ్రవరి 16, 17, 18 తేదీల్లో కాకినాడలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర సభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని చెప్పారు. కాకినాడ నగర పాలక సంస్థకు ఐఏఎస్ అధికారిని నియమించాలని మధు డిమాండ్ చేశారు. మంగళవారం మధు విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ సీపీఐ జాతీయ కార్యదర్శి డి రాజా, రాష్ట్ర మాజీ కార్యదర్శి కే రామకృష్ణ, కార్యదర్శి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య పలువురు ఈ సభలకు హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశాలలో స్థానిక సంస్థల ఎన్నికలు, చంద్రబాబు ఆలపిస్తున్న కార్పొరేట్ విధానాలు వంటి అంశాలపై చర్చిస్తామన్నారు. చంద్రబాబు సంక్షేమాన్ని గాలికొదిలి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టే చర్యలను చేపడుతున్నారని చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయడం మానుకోవాలని పేదలే ప్రభుత్వాసుపత్రిలో వైద్యం చేయించుకుంటారన్నారు. అటువంటి వైద్య రంగాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని విరమించుకోవాలని మధు సూచించారు. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేసి ఆ జిల్లాలో జిందాల్ కంపెనీ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కిడ్నాప్లు చేయడం సంస్కృతిగా మారిందన్నారు. రాష్ట్రంలో కూటమికి చెందిన నాయకులు ప్రభుత్వ రంగ సంస్థలను అప్పగించడానికి తహతహలాడుతున్నారన్నారు. కాకినాడ జిల్లాలో కొత్తగా ఎటువంటి పరిశ్రమ రాలేదని జిల్లాకు చెందిన మంత్రి పవన్ కళ్యాణ్ జిల్లా సమగ్ర అభివృద్ధి రూపకల్పన చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే జిల్లా అభివృద్ధికి కలిసి అఖిల పక్ష సమావేశం నిర్వహించాలన్నారు. యువతకు ఉపాధి లేక వలస వెళ్తున్నారని దీనిపై జిల్లా ప్రజా ప్రతినిధులు దృష్టి చూపాలన్నారు. పేదల కోసం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకంకు పేరు మార్పు చేసి దానికి నిధులను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కుటిల యత్నం చేసిందన్నారు. 9న నిర్వహించే సంక్రాంతి సంబరాలకు ముందుగా డిప్యూటీ సీఎం పవన్ మేధావులు అఖిల పక్ష నాయకులతో జిల్లా అభివృద్ధిపై సమావేశం నిర్వహించాలన్నారు. కాకినాడ నగర అభివృద్ధి నిమిత్తం నగరపాలక సంస్థకు ఐఏఎస్ అధికారిని నియమించాలని చెప్పారు. ప్రజా ప్రతినిధులు కనుసన్నల్లో పనిచేసే అధికారులనే నగరపాలక కమిషనర్లుగా నియమిస్తున్నారని మధు అన్నారు. ఇంచార్జ్ అధికారులను నియమించడం వల్ల కాకినాడ నగర అభివృద్ధి జరగదని మధు అన్నారు. ఈ నెల 18వ తేదీన ఖమ్మంలో సీపీఐ వందేళ్ళ వార్షిక ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహింస్తున్నట్లు మధు చెప్పారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కే బోడకొండ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం పద్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి సత్యనారాయణ, ఏఐటీయూసీ నగర కార్యదర్శి టి అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి

## మద్యం ఆదాయ వనరుగా కాకుండా, ప్రభుత్వ లక్ష్యం మద్యం వినియోగం తగ్గింపే..

## ఎక్సైజ్ శాఖ సమీక్షలో మంత్రి కొల్లు రవీంద్ర



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖను కేవలం ఆదాయ వనరుగా కాకుండా దశలవారీగా మద్యం వినియోగాన్ని తగ్గించే సామాజిక బాధ్యత కలిగిన శాఖగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యమని రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, మైన్స్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మంగళవారం రాజమహేంద్రవరం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పనితీరుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో కలిసి ఎక్సైజ్ శాఖ వార్షిక క్యాలెండర్‌ను అధికారులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, ఎక్సైజ్ శాఖ ప్రక్షళనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, రాష్ట్రంలో అమలవుతున్న మద్యం పాలసీకి పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయని తెలిపారు. బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని సమర్థవంతంగా నియంత్రించాలన్నారు. ఆ దిశలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత పెంచి అక్రమ మద్యం సరఫరా, నాటు సారా తయారీకి ఉపయోగించే ముడి సరుకు స్పాట్లను గుర్తించి పూర్తిగా కట్టడి చేయాలని అధికారులకు ఆదేశించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేయడంలో వెనుకాడవద్దని స్పష్టం చేశారు. నాణ్యమైన మద్యం సరఫరా చేసే విధానంలో కాకినాడలో 13 రకాల పరీక్షలు నిర్వహించే ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యానికి చెడు చేసే నాటు సారా తయారీ నియంత్రణ చర్యల్లో భాగంగా ఇప్పటికే 14 మందిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని, భవిష్యత్తులో మరింత కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి వెల్లడించారు. మద్యం వినియోగం వల్ల అనారోగ్య ప్రభావానికి లోనయ్యే వారి సంఖ్య రాష్ట్రంలో గణనీయంగా తగ్గిందని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో ఎక్సైజ్ శాఖ రెండు ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ లకు విడదీసిందని, తమ ప్రభుత్వం అధికారులోకి వొచ్చినా తర్వాత ఒకే శాఖ కిందికి తీసుకుని రావడం జరిగిందనీ తెలిపారు. మెరుగైన పనితీరు చూపాలని తద్వారా శాఖకు, రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకుని రావాలని కోరారు. శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఐడీ లిక్కర్ వినియోగాన్ని దాదాపు 90 శాతం వరకు అరికట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ఐడీ లిక్కర్ వ్యాపారాన్ని జీవనోపాధిగా భావించిన వారికి ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు కల్పించడంపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై. చైతన్య మురళీ, సహాయ కమిషనర్ సీ. హెచ్. రేణుక, జిల్లా ఎక్సైజ్ అధికారులు తూర్పు గోదావరి జిల్లా సీ. హెచ్. లావణ్య, కాకినాడ జిల్లా ఏం.కృష్ణకుమారి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్.కె.వి.డి. ప్రసాద్‌తో పాటు సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, ఇతర ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మంత్రి పాత్రికేయుల సమావేశంలో పాల్గొన్నారు.

# రాయవరంలో ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన

## పలు ప్రాంతాలను పరిశీలించిన ముఖ్యమంత్రి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్

## రాయవరంలో ది గ్రీన్ విలేజ్ లో కార్యక్రమం ఏర్పాటుకు చర్యలు - ఏర్పాట్లను పరిశీలించిన జె.సి మేఘా స్వరూప్, ఎస్పీ రాహుల్ మీనా



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 9వ తేదీన తూర్పు గోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరం లో పర్యటించనున్న నేపథ్యంలో సభ నిర్వహణ ప్రాంతాలను రాజానగరం మాజీ ఎమ్మెల్యే, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ స్థానిక శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు, రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ , అధికారులతో కలిసి మంగళవారం పలు స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన రాయవరంలో మహేంద్రవాడ రహదారిని ఆనుకుని ఉన్న శ్రీ రామ నారాయణ ది గ్రీన్ విలేజ్ స్థలాన్ని కార్యక్రమం నిమిత్తం నిర్ణయించారు. సభాస్థలం, హెలిప్యాడ్, వాహనం పార్కింగ్ వంటి పలు స్థలాలను పెందుర్తి వెంకటేష్ అధికారులతో కలిసి నిర్ణయించారు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ అధికారులతో కలిసి ప్రాంగణాన్ని పరిశీలించి అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్య మంత్రి సభా స్థలంతో పాటు, రైతులకు నేరుగా వ్యవసాయ క్షత్రం లోనే ముఖ్యమంత్రి పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ చేపట్టనున్నారని అధికారులతో కలిసి పలు స్థలాలను పరిశీలించారు. అనంతరం డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి రాహుల్ మీనా, డిఎస్పీ రఘువీర్ బృందం సభా ప్రాంగణం లో హెలిప్యాడ్‌తోపాటు ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. ఏర్పాట్లపై ఆర్ అండ్ డబ్ల్యూ అధికారులతో మాట్లాడి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్దంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు ఈ



కార్యక్రమంలో మండపేట రూరల్ సిఐ పి. దొర రాజు, ఎస్సై లు సురేష్ బాబు, కిశోర్ కుమార్, హరీష్ , మండల తహశీల్దార్ బి.వి భాస్కర్, ఎంపీడీవో కీర్తి స్పందన, అనపర్తి ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు, ఏవో రమేష్ కుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ చైతన్య కుమారి, రాయవరం గ్రామ తేదేపా సీనియర్ నాయకులు వుండవిల్లి రాంబాబు, బిజెపి నాయకులు చాట్రాతి జానకి రాంబాబు, జనసేన నాయకులు దేవిశెట్టి కోటేశ్వరరావు, బేరా దుర్గాప్రసాద్, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# రంగవల్లులు సృజనాత్మకతకు, సాంస్కృతిక వైభవానికి నాంది

## - 14వ వార్డులో ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రకటించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్






**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగవల్లులు సృజనాత్మకతకు, సాంస్కృతిక వైభవానికి నాంది..అని నగర శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు.స్థానిక 14వ వార్డు తెలుగుదేశం పార్టీ వార్డు ఇంచార్జి ఈతలపాటి రవి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు.ఈ పోటీల్లో వార్డు నుంచి సుమారు 80 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర శాసన సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొని మహిళలు ఉత్సాహంగా పెట్టిన ముగ్గులను వీక్షంచి మహిళలను ప్రతివక్కరికి అభినందించారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి మాట్లాడుతూ మహిళల సృజనాత్మకతను ప్రోత్సహించే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అర్బన్ కమ్యూనిటీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి చైర్మన్ చెల్లుబోయిన సూర్యనారాయణమూర్తి, టిడిపి సీనియర్ ఈతలపాటి కృష్ణ, మహమ్మద్ అబ్దుల్లా, మాజీ కార్పొరేటర్లు కోసూరి చండీప్రియ, కూరాకుల తులసి, బంగారు నాగేశ్వరరావు, ఉడమల నాగేశ్వరరావు కరణం లక్ష్మనాయుడు, దంగేటి అన్నవరం, యర్రంశెట్టి రాజ్ కుమార్, ఎస్కే రబ్బాని, మోర్స సోమరాజు, ఎండి అబ్దుల్ వహీద్, ముత్యాలకృష్ణ, ఆర్.రవి, తోలేటి రాజేష్. శోభారాణి, బొండపల్లి బాబ్జి, ప్రతాప్, కే.సురేష్ స్థానిక కూటమి నాయకులు, వార్డు సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేశారు.

# ఆర్యవైశ్య జర్నలిస్ట్‌ల జిల్లా సమన్వయకర్తగా రవి కుమార్ పదవి బాధ్యతలు స్వీకరణ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా ఆర్య వైశ్య జర్నలిస్టల కో-ఆర్డినేటర్‌గా సీనియర్ జర్నలిస్ట్ వెలుగూరి రవికుమార్ నియమితులయ్యారు. నిన్న విజయవాడలోని వాసవి ఇంటరనేషనల్ బవనం నందు జరిగినఆర్య వైశ్య జర్నలిస్ట్ ల సంక్షమ సంఘం మహా సభలో రాష్ట్ర మంతటా కో ఆర్డినేటర్ లను నియమించారు.ఈ సభకు ముఖ్య అతిధిగా ఆర్య వైశ్య మహా సభ అధ్యక్షలు చిన్ని రామ సత్యన్నారాయణ పాల్గొన్నారు.రాష్ట్ర అధ్యక్షుడుగా కలం కౌంటర్ అధినేత సి.హెచ్.రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెనుగొండ క్షత్ర పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ బాల స్వామీజీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కు చెందిన నిఘా పత్రిక అధినేత రవి కుమార్ ను జిల్లా సమన్వయకర్తగా నియమించారు.

## న్యాయ సేవాధికార సంస్థ జోక్యంతో

# పెన్షన్ బకాయిలు విడుదల



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేంద్రవరం సమర్థవంతమైన జోక్యంతో ఒక బాధితురాలికి న్యాయం లభించిన సంఘటన విజయ గాథగా నిలిచింది. మం గళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ రాజమహేంద్రవరం చైర్మన్ గంధం సునీత, కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మ వీరికి కుమారి పి.పద్మావతి మంగళవారం జిల్లా కోర్టు లో కలిసి ధన్యవాదములు తెలియజేశారు. కుమారి పి.పద్మావతి పి.ఎల్.సి. నెంబరు 1130/2022 నందు దాఖలు చేసిన అర్జీ మేరకు, ఆమెకు రావలసిన డిపెండెంట్ పెన్షన్ బకాయిలు రూ.11,09,637/- (పదకొండు లక్షల తొమ్మిది వేల ఆరు వందల ముప్పై ఏడు రూపాయలు) 02 జనవరి 2026 న ఆమె బ్యాంక్ ఖాతాలో జమ అయ్యాయని తెలిపారు. అదేవిధంగా నెలవారీగా రూ.14,000/- పెన్షన్ మంజూరు కావడంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు కృతజ్ఞతలు తెలియ జేశారు. కుమారి పి. పద్మావతి తండ్రి రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తూ మరణించగా, ఆయన పెన్షన్ ఆమె తల్లికి అందేది. అనంతరం 2015లో తల్లి మరణించడంతో, పద్మావతికి రావలసిన డిపెండెంట్ పెన్షన్ బకాయిలు మరియు నెలవారీ పెన్షన్ మంజూరు కాకుండా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం కు చెందిన అడ్వకేట్ తూము కళ్యాణం దొర ద్వారా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రాజమహేంద్రవరం వారిని ఆశ్రయించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంబంధిత శాఖ అధికారులను పిలిపించి విచారణ చేపట్టి, పద్మావతికి చట్టబద్ధంగా రావలసిన పెన్షన్ బకాయిలు మరియు నెలవారీ పెన్షన్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంది. ఈ న్యాయ సహకారంతో బాధితురాలికి తక్షణమే న్యాయం లభించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుమారి పి. పద్మావతి, తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత,కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మ వీరికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేశారు.

# స్వర్ణ నంది పురస్కారం పొందిన చిన్నారి సత్య మనస్విని



**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కూచిపూడి నృత్యంలో మూడో తరగతి చదువుతున్న జొన్నకూటి సత్య మనస్విని స్వర్ణ నంది పురస్కారం పొందింది. చాగల్లు మండలం ఊనగట్ల గ్రామానికి చెందిన జొన్నకూటి శేషయ్య (వీఆర్వో), దేవి (ఏ.ఎన్.ఎం) దంపతుల కుమార్తె మనస్విని. కొవ్వూరులోని నిత్య కూచిపూడి డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందిన ఎనిమిదేళ్ల చిన్నారి ఈనెల 4 న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన సంక్రాంతి స్వర్ణ నంది పురస్కారాల్లో కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచింది. ఈ నేపథ్యంలోనే మనస్విని నంది పురస్కారం కైవసం చేసుకుంది. సెల్ ఫోన్లకే పరిమితం అవ్వకుండా సంప్రదాయ విధానంలో కూచిపూడి నృత్యం వైపు రాణిస్తున్న చిన్నారి మనస్విని భరత్ అకాడమీ ఫౌండర్ లలిత ప్రత్యేకంగా సన్మానించారు.ఈ సందర్భంగా నిత్య కూచిపూడి డ్యాన్స్ అకాడమి నిర్వాకురాలు ప్రవళిక, కొవ్వూరు ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ఆళ్ల హరిబాబు, తదితరులు అభినందించారు.

# విద్యాశాఖ అధికారులకు సమగ్ర శిక్ష ఉద్యోగులు శుభాకాంక్షలు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండల విద్యాశాఖ అధికారి టి కుశలోవ దొర, సుజాతలను సమగ్ర శిక్ష ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సోమవారం ఎంఈఓ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులు కుశలోవ దొర, సుజాతలను మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర, ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్చం అందజేసి, సాల్వతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ జాకోబ్ రాజు, మంగాదేవి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ చిన్ని, మెసెంజర్ ఏసు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో

# సీఎంఆర్ ఎఫ్, ఎల్‌ఓసి చెక్కుల పంపిణీ : బత్తుల

## 109 మందికి 83.04 లక్షల పంపిణీ



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గంలో ఇటీవల అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న109 మంది లబ్ధిదారులకు ఒకే రోజు రికార్డ్ స్థాయిలో ముఖ్యమంత్రి సహాయ నిధి, ఎల్‌ఓసి చెక్కులను పంపిణీ చేసినట్లు రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. మంగళవారం బత్తుల స్వగ్రామం గాదరాడలో ఇటీవల అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న 109 మంది లబ్ధిదారులకు సుమారు 83.04 లక్షల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసి చెక్కులను బత్తుల దంపతుల చేతుల మీదగా అందజేస్తారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీలో రాజానగరం నియోజకవర్గం రాష్ట్రంలోనే ప్రప్రథమంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, సీఎం ఆర్ఎఫ్ ఆఫీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలకు, కులమతాలకు అతీతంగా ఇప్పటివరకు నియోజకవర్గంలో సుమారు1263 మంది లబ్ధిదారులకు 16.82 కోట్ల రూపాయలు చెక్కులు పంపిణీ చేశామన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ సిక్స్ లో భాగంగా 90 శాతం హామీలు నెరవేర్చిందన్నారు. జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్క కుటుంబాన్ని పరామర్శించి, వెంకటలక్ష్మి స్వయంగా వెళ్లి సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించడం లక్ష్యంగా పనిచేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను, బత్తుల గోపాలకృష్ణ, యర్రంశెట్టి పోలారావు, ముక్క రాంబాబు, తన్నీరు తాతాజీ, బదిరెడ్డి దొర, జాజుల గణేష్, తాటికొండ బుజ్జి, సర్పంచులు దూది కాంతారావు, జాజుల రాము, కరణం రమణ, పలువురు జనసైనికులు, వీర మహిళలు, బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాపాక రఘుదేవపురం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం రాపాక, రఘుదేవపురం గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి గౌరీ దేవి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అధితులుగా డిఆర్‌సిఏడిఎ జయరామలక్ష్మి, ఎఆర్ఎస్ పెద్దాపురం సైంటిస్ట్ డాక్టర్ సుధీర్ మరియు డిఎఎటిటిసి సైంటిస్ట్ డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ హాజరయ్యారు. ముందుగా రాపాక రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. వరి మరియు మొక్కజొన్న పంటల చీడ, పీడల యాజమాన్యం మరియు ఎరువుల యాజమాన్యం పైన అవగాహన కల్పించడం జరిగింది. భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగించాలని, సిఫార్సు మించి వాడకూడదు అని వివరించడం జరిగింది. తర్వాత మొక్కజొన్న క్షత్రాన్ని రైతులతో కలిసి సందర్శించారు. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ను గుర్తించి దాని యాజమాన్యం పైన చర్చించారు. ఈ పురుగు ఉధృతి తక్కువ గా ఉన్నప్పుడు ,క్లోరిపైరిఫాస్ 20 ఇసి 2.5 మి.లీ/లీ లేదా క్వినాల్ పాస్ 25 ఇ సి 2.0మి.లీ/లీ. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఏమామెక్టిన్ బెంజోయేట్ 5 ఎస్ సి0.4 గ్రాములు/లీ లేదా స్పైనోశాడ్ 45 ఎస్‌సి 0.3 మీ. లీ/లీ నీటికి కలిపి పిచికారీ చేస్తే దీనిని సమర్థవంతంగా నివారించుకోవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఈవో గురుప్రియ, విఎఎ ప్రవీణ్ మరియు రైతులు పాల్గొన్నారు.

# ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

## - ప్రజలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

## - పారిశుద్ధ్య కార్మికులతో ఇంటింటి ప్రచారంలో మత్సేటిప్రసాద్




**బొమ్మూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం రూరల్ స్థానిక బొమ్మూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జెఎల్‌బి నగర్ ప్రాంతాలలో రోడ్స్ మరియు డ్రైన్స్ శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులతో పరిసరాలు శుభ్రంగా ఉంచాలని మైకు ద్వారా ఇంటి ఇంటికి వెళ్లి తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం రూరల్ మండల టిడిపి అధ్యక్షులు, బొమ్మూరు మాజీ సర్పంచ్ మత్సేటిప్రసాద్ మాట్లాడుతూ మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ..రోగాల భారిన పడకూడదు,ప్రతిఒక్కరు పంచాయతీ వారు వచ్చినప్పుడు చెత్తను వారికి అందించి సహకరించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లా తనూజా,మరడాపు చిన్న,మరడాపు రాంబాబు, రాయుడు సునిల్, నరాలశెట్టి శ్రీనివాస్, దుగ్గిరాల రాజేష్,ఓలి శ్రీనివాస్, సురేష్, జనసైనికులు పల్లెడ నాయుడు,కోట్ల దుర్గ సచివాలయం- 3 కార్యదర్శి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికాలో ట్రక్ డ్రైవర్లకు బిగ్ రిలీఫ్



అమెరికాలో స్థిరపడి ట్రక్ డ్రైవింగ్ ను వృత్తిగా మార్చుకున్న వేలాది మంది ప్రవాసులకు ముఖ్యంగా భారతీయులకు కాలిఫోర్నియా ప్రభుత్వం తీపి కబురును అందించింది. అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ అయ్యాక అక్కడ విదేశీయులను వేటాడుతున్నారు.. వెంటాడుతున్నారు. ఎలాగోలా ఆ దేశం నుంచి పంపించేందుకు కఠినమైన వలస చట్టాలను రూపొందిస్తున్నారు. ఇటీవల కాలంలో అమెరికాలో హైవేల పై రోడ్డు ప్రమాదాలు పెరగడం.. అందులో విదేశీ డ్రైవర్ల పాత్ర ఎక్కువగా ఉండటంతో అక్కడ ట్రక్ డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్స్ లపై కఠిన ఆంక్షలు విధించారు. దీంతో ఈ వృత్తిపై ఆధారపడి పొట్ట పోసుకుంటున్న చాలా దేశాల డ్రైవర్లకు కాలిఫోర్నియా సహా అమెరికా లోని కొన్ని ప్రాంతాల్లో గట్టు పరిస్థితులు ఎదురవుతున్నాయి. అమెరికాలో స్థిరపడి ట్రక్ డ్రైవింగ్ ను వృత్తిగా మార్చుకున్న వేలాది మంది ప్రవాసులకు ముఖ్యంగా భారతీయులకు కాలిఫోర్నియా ప్రభుత్వం తీపి కబురును అందించింది. వివాదాస్పదంగా మారిన కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్ లో రద్దు నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

అమెరికాలో స్థిరపడి ట్రక్ డ్రైవింగ్ ను వృత్తిగా మార్చుకున్న వేలాది మంది ప్రవాసులకు ముఖ్యంగా భారతీయులకు కాలిఫోర్నియా ప్రభుత్వం తీపి కబురును అందించింది. వివాదాస్పదంగా మారిన కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్ లో రద్దు నిర్ణయాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది

అసలేం జరిగింది? కాలిఫోర్నియా డిపార్ట్మెంట్ ఆఫ్ మోటార్ వెహికల్స్ (డిఎంవి) ఇటీవల జారీ చేసిన లైసెన్సులలో డాక్యుమెంటేషన్ లోపాలు.. గడువు తేదీల్లో విద్యాసాలు ఉన్నాయని గుర్తించింది. ఈ సాంకేతిక కారణాలను చూపుతూ సుమారు 17వేల మందికి పైగా ప్రభాస డ్రైవర్ల లైసెన్సులను రద్దు చేస్తున్నట్టు నోటీసులు జారీ చేసింది. ఇది వలస డ్రైవర్ల జీవనోపాధిని ఒక్కసారిగా ప్రశ్నార్థకం చేసింది. పోరాట ఫలితం.. కోర్టు జోక్యంతో విముక్తి ప్రభుత్వ నిర్ణయాన్ని వలసదారుల సంఘాలు పౌరహక్కుల సంస్థలు తీవ్రంగా వ్యతిరేకించాయి. డిఎంవి చేసిన తప్పులకు డ్రైవర్లను బలి చేయడం అన్యాయం అని వాదించాయి. బాధితులు కోర్టును ఆశ్రయించడంతో ఈ వ్యవహారం మలుపు తిరిగింది. తీవ్ర ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ప్రస్తుతం ఉన్న లైసెన్స్ లో రద్దు ప్రక్రియను మార్చి నెల వరకు నిలిపి వేస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం అమెరికా ఆంక్షలు వల్ల సుమారు 17వేల మందికి పైగా డ్రైవర్లు ప్రభావితమయ్యారు. లైసెన్సుల రద్దు పై మార్చి వరకు స్టే విధించడంతో ఇప్పుడు డాక్యుమెంటేషన్ గడువు తేదీలలో లోపాలను సవరించనున్నారు. డ్రైవర్లు తమ విధులను యధావిధిగా కొనసాగించవచ్చని ప్రభుత్వం తెలిపింది.

ఈ తాత్కాలిక ఉపశమనం డ్రైవర్లకు పెద్ద ఊరటగా నిలిచినప్పటికీ సమస్య పూర్తిగా సమసి పోలేదు. మార్చి లోపు డ్రైవర్లు తమ డాక్యుమెంట్లను సరి చూసుకోవాలని.. లోపాలను సవరించుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. చట్టబద్ధంగా లైసెన్స్ కలిగి ఉన్నవారు ఈ గడువులోగా తమ పేపర్ వర్క్ ను క్లియర్ చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా చూసుకోవచ్చు. ప్రస్తుతానికి ఇది వలస డ్రైవర్ల ఐక్యతకు దక్కిన తాత్కాలిక విజయంగా చెప్పవచ్చు.. కానీ వేలాది కుటుంబాల జీవనోపాధిని కాపాడిన ఈ నిర్ణయం పై ప్రవాస భారతీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# కెనడాలో 19 లక్షల మందికి 'ఎగ్జిట్ల ముప్పు..

## సగం మంది భారతీయులే..!



కెనడా.. ఒకప్పుడు వలసదారుల స్వర్గధామం. కానీ ఇప్పుడు అదే దేశం విదేశీయులకు కఠిన సవాలుగా మారుతోంది.

దూరపు కొండలు నునుపు అంటారు. అందుకే ఆ కొండలను చేరుకునేందుకు దేశాన్ని దాటి మన వాళ్లు వెళుతుంటారు. కానీ అక్కడికి వెళ్లాక కొందరు బాగుపడుతారు.. మరికొందరు బలహీనపడి తిరిగొస్తారు. అయితే రోజులు అన్నీ ఒకేలా ఉండవు కదా.. అప్పుడే సమస్యలు ఎదురవుతుంటాయి. ప్రస్తుతం వలసవాదులను తరిమికొట్టే పనిలో విదేశాలున్నాయి. ముఖ్యంగా అమెరికా, యూరప్ దేశాలు, ఇప్పుడు ్నడా కూడా అందులో చేరింది. కెనడా.. ఒకప్పుడు వలసదారుల స్వర్గధామం. కానీ ఇప్పుడు అదే దేశం విదేశీయులకు కఠిన సవాలుగా మారుతోంది. రాబోయే రెండేళ్లలో దాదాపు 19 లక్షల మంది తమ చట్టబద్ధ నివాస హోదాను కోల్పోయే ప్రమాదంలో ఉన్నారని తాజా గణాంకాలు హెచ్చరిస్తున్నాయి. ఇందులో అత్యధికంగా భారతీయ యువత, కార్మికులు ఉండటం గమనార్హం. ఇమిగ్రేషన్, రిఫ్యూజీస్ అండ్ సిటిజన్ షిప్ ్నడా (ఐఆర్.సీసీ) డేటా ప్రకారం.. 2025 చివరి నాటికి సుమారు 10 లక్షల మంది వర్క్ , స్టడీ పర్మిట్లు ముగియనున్నాయి. 2026 నాటికి మరో 9 లక్షల మందికి ఇదే పరిస్థితి ఎదురుకానుంది. ఈ భారీ సంఖ్యలో 50 శాతం మంది భారతీయులే ఉన్నారని అంచనా.. అంటే దాదాపు 9 నుంచి 10 లక్షల మంది భారతీయుల ్రీర్ ఇప్పుడు త్రిశంకు స్వర్గంలో ఉంది. ్నడా ప్రభుత్వం ఇటీవల కఠిన ఇమిగ్రేషన్ నిబంధనలతో తాత్కాలిక నివాసితుల సంఖ్యను తగ్గించాలని నిర్ణయించింది. గతంలో సులభంగా వచ్చే పర్మనెంట్ రెసిడెన్సీ ఇప్పుడు గగనమైంది. స్కోరింగ్ పద్ధతి భారీగా పెరగడంతో చాలా మంది అర్హత సాధించలేకపోతున్నారు. విద్యార్థులు చదువు పూర్తయ్యాక పొందే పోస్ట్ గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్ నిబంధనలలో మార్పులు రావడం వల్ల వర్క్ ఎక్స్ పీరియన్స్ సంపాదించడం కష్టమవుతోంది.

భారతీయులపై ప్రభావం.. కెనడాలోని ఐటీ, హెల్త్‌కేర్, లాజిస్టిక్స్ , హాస్పిటాలిటీ రంగాల్లో భారతీయుల పాత్ర కీలకం. పర్మిట్ల గడువు ముగిస్తే ఉద్యోగాలు ఊడిపోతాయి. వర్క్ పర్మిట్ లేనిదే కంపెనీలు ఉద్యోగాల్లో ఉంచుకోవు. దీనివల్ల ఆర్థిక ఇబ్బందులతో లక్షలాది రూపాయల రుణాలు తీసుకుని వెళ్లిన విద్యార్థులు ఇప్పుడు తిరుగు ప్రయాణం కావాల్సి వస్తే ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం ఉంది. చట్టబద్ధ హోదా లేకపోతే హెల్త్ ఇన్సూరెన్స్ వంటి ప్రాథమిక సదుపాయాలు కూడా నిలిచిపోతాయి.

అక్రమ వలసలు పెరిగే ఛాన్స్ పర్మిట్లు ముగిసినా దేశం విడిచి వెళ్లడానికి ఇష్టపడని వారు ఃఅక్రమ నివాసితులుఃగా మారిపోయే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల కార్మిక దోపిడీ పెరిగి.. తక్కువ వేతనానికి పని చేయించుకునే పరిస్థితి ఏర్పడుతుంది. మానసిక ఒత్తిడి, అభద్రతా భావం పెరిగి.. నగరాల్లో భద్రతా పరమైన సమస్యలు తలెత్తే ప్రమాదం వాటిల్లుతుంది. ఈ క్రమంలోనే జనవరిలో వలసదారుల హక్కుల సంఘాలు భారీ నిరసనలకు పిలుపునిచ్చాయి. ౕమేము ఈ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాం, మమ్మల్ని ఇప్పుడు గాలికి వదిలేయకండిౕ అన్నది వారి ప్రధాన డిమాండ్. ్నడా ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి నిబంధనలను సడలిస్తుందా? లేక కఠినంగానే వ్యవహరిస్తుందా? అన్నది వేచి చూడాలి.

# హెచ్-1బీ వీసా ఫీజు పెంపు అంశం..

## విచారణ వేగవంతం




హెచ్-1బీ వీసాఫీజును పెంచుతూ అధ్యక్షుడు ట్రంప్ తీసుకొన్న నిర్ణయాన్ని సమర్థిస్తూ దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును.. యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అప్పీల్ కోర్టులో సవాల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ విచారణను వేగవంతం చేయాలని తాజాగా ఛాంబర్ చేసిన అభ్యర్థనకు.. న్యాయస్థానం అంగీకరించింది. ఈ ఏడాది హెచ్-1బీ వీసాల కార్యక్రమంలో కంపెనీలు పాల్గొనాలా.. వద్దా..? అనేది ఈ కోర్టు తీర్పుపైనే ఆధారపడి ఉంటుందని ఛాంబర్ ఆఫ్ కామర్స్ తన అభ్యర్థనలో పేర్కొంది. కేసు విచారణ ఆలస్యమైతే.. హెచ్-1బీ ఉద్యోగుల నియామకాలు ఆలస్యం అవుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. మార్చిలోపు ఫీజు పెంపుపై ఊరట కల్పించాలని కోరింది. విచారణ వేగవంతంగా జరపాలనే అభ్యర్థనను ట్రంప్ ప్రభుత్వం తరఫు న్యాయబృందం కూడా వ్యతిరేకించలేదు. ఫిబ్రవరిలో దీనిపై వాదనలు వింటామని కోర్టు పేర్కొంది. ఇక, గతేడాది సెప్టెంబరులో హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం పెను సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. అయితే, ఇది వార్షిక ఫీజు కాదని, దరఖాస్తు చేసుకొనే సమయంలో కట్టాల్సిన వన్‌టైమ్ రుసుము అని ఆ తర్వాత వైట్‌హౌస్ పేర్కొంది. ట్రంప్ నిర్ణయాన్ని యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫెడరల్ కోర్టులో సవాల్ చేసింది. దీన్ని ఇటీవల విచారించిన న్యాయస్థానం.. ట్రంప్‌నకు అనుకూలంగా తీర్పునిచ్చింది.

# నేపాల్‌లో ఆందోళనలు..

## సరిహద్దు మూసేసిన భారత్



హిమాలయ దేశం నేపాల్‌లో ఆందోళనలు చెలరేగాయి. భారత సరిహద్దు ప్రాంతాల్లో మతపరమైన ఘర్షణలు చోటు చేసుకున్నాయి. దీంతో భారత్ అప్రమత్తమైంది. నేపాల్‌తో సరిహద్దును మూసేసింది. ఎమర్జెన్సీ సేవలు మినహా సీమాంతర కదలికలపై ఆంక్షలు విధించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధనుశా జిల్లాలో ఓ ప్రార్థనా మందిరాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ ఆందోళనలు చెలరేగాయి. పర్సా, రాహౌల్ తదితర సరిహద్దు ప్రాంతాల్లో ఆందోళనకారులు నిరసనలు చేపట్టారు. కొన్నిచోట్ల ఈ ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో స్థానిక యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రభావిత ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించింది.

# అహంకారానికి రూ.81 లక్షల గుణపాఠం

## బ్రిటన్‌లో జాతి వివక్షపై భారతీయుడి గెలుపు!




విదేశాల్లో ఉద్యోగం అంటే కేవలం డాలర్లు, పౌండ్ల సంపాదన మాత్రమే కాదు.. అదొక ఆత్మగౌరవ పోరాటం కూడా అని నిరూపించాడు తమిళనాడుకు చెందిన మాధేశ్ రవిచంద్రన్.

విదేశాల్లో ఉద్యోగం అంటే కేవలం డాలర్లు, పౌండ్ల సంపాదన మాత్రమే కాదు.. అదొక ఆత్మగౌరవ పోరాటం కూడా అని నిరూపించాడు తమిళనాడుకు చెందిన మాధేశ్ రవిచంద్రన్. తనపై జరిగిన జాతివివక్షను మౌనంగా భరించకుండా.. చట్టం ముందు నిలబడి పోరాడి ఏకంగా 81 లక్షల రూపాయలు (75000 పౌండ్ల) భారీ పరిహారాన్ని గెలుచుకున్నాడు. బ్రిటన్ లోని ఒక కేఎఫ్.సీ అవుట్ లెట్ లో జరిగిన ఈ ఘటన ఇప్పుడు అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అవమానాల విషవలయం.. మాధేశ్ రవిచంద్రన్ బ్రిటన్ లోని ఒక ప్రసిద్ధ 'కేఎఫ్.సీ' బ్రాంచ్ లో పనిచేసేవాడు. అయితే అక్కడ అతడికి ఎదురైన పరిస్థితులు అత్యంత దారుణంగా ఉండేవి. అతడి మేనేజర్ శ్రీలంకకు చెందిన వ్యక్తి. మాధేశ్ ను నిరంతరం జాతి వివక్షతో వేధించేవాడు. బానిస అంటూ భారతీయులు మోసగాళ్లు అంటూ కించపరచడం నిత్యకృత్యంగా మారింది. సహ ఉద్యోగులందరి ముందు మాధేశ్ ను తక్కువ చేసి మాట్లాడుతూ అతడి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశాడు. పని ప్రదేశంలో కనీసం గౌరవం లేకపోవడంతో మాధేశ్ తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనయ్యాడు.

రాజీనామా ఆపై రణరంగం అవమానాలు భరించలేక మాధేశ్ తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. సాధారణంగా చాలా మంది ఇలాంటి పరిస్థితుల్లో మౌనంగా వెళ్లిపోతారు. కానీ మాధేశ్ అలా చేయలేదు. తనకు జరిగిన అన్యాయానికి బాధ్యులైన వారికి బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నాడు. బ్రిటన్ ఎంప్లాయిమెంట్ ట్రిబ్యూనల్ ను ఆశ్రయించి తనపై జరిగిన జాతి వివక్ష వేధింపులపై ఫిర్యాదు చేశాడు. న్యాయస్థానం సంచలన తీర్పు దీర్ఘకాలంగా జరిగిన ఈ విచారణలో మాధేశ్ సమర్పించిన ఆధారాలు, సాక్ష్యలను కోర్టు నిశితంగా గమనించింది. 'ౕపని ప్రదేశంలో ఒక వ్యక్తిని వారి జాతి లేదా దేశం ఆధారంగా కించపరచడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన. ఇది తీవ్రమైన నేరం అని న్యాయస్థానం స్పష్టం చేసింది. మాధేశ్ పట్ల మేనేజర్ ప్రవర్తన అత్యంత అనుచితంగా ఉందని నిర్ధారిస్తూ.. అతడికి కలిగిన మానసిక వేదనకు పరిహారంగా సుమారు ?81 లక్షలు చెల్లించాలని తీర్పునిచ్చింది.

ప్రవాస భారతీయులకు ఒక 'టార్చ్ లైట్ల ఈ తీర్పు విదేశాల్లో ఉన్న లక్షలాది మంది భారతీయ ఉద్యోగులకు కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. వీసా పోతుందేమో లేదా ఉద్యోగం ఊడుతుందేమో అనే భయంతో వివక్షను భరించాల్సిన అవసరం లేదని ఈకేసు నిరూపించింది. ఏ దేశంలో ఉన్నా సరే.. చట్టం అందరికీ సమానమేనని.. అన్యాయంపై గొంతెత్తితే న్యాయం జరుగుతుందని ఈ విజయం చాటిచెప్పింది. మాధేశ్ రవిచంద్రన్ సాధించిన ఈ విజయం కేవలం ఒక వ్యక్తి గెలుపు కాదు.. గౌరవం అనేది మనిషి పుట్టుకతో వచ్చే హక్కు అని చాటిచెప్పే ఒక నైతిక విజయంగా చెప్పొచ్చు. అహంకారంతో విర్రవీగే వారికి ఇదొక హెచ్చరిక. మాధేశ్ రవిచంద్రన్ కథ ఒక స్ఫూర్తిదాయకమైన ఉదాహరణ. అన్యాయం ఎదురైనప్పుడు మౌనం వహించకుండా చట్టబద్ధంగా పోరాడితే ఫలితం తప్పకుండా అనుకూలంగా ఉంటుందన్నదే ఈ తీర్పు సారాంశం.

# ఇరాన్‌లో ఆందోళనలు.. అమెరికా జోక్యం చేసుకొనే అవకాశం..



ఇంటర్నెట్‌డెస్క్: ఇరాన్‌లో కొనసాగుతున్న ఆందోళనలపై ఇజ్రాయెల్‌కు చెందిన పత్రిక ది జెరూసలెం పోస్టు సంచలన కథనాన్ని ప్రచురించింది. ఆ దేశంలో కొనసాగుతున్న ఆందోళనల్లో అమెరికా, ఇజ్రాయెల్ జోక్యం చేసుకోవాలని చూస్తున్నట్లు పేర్కొంది. దీనికోసం ఇప్పటికే ఇరుదేశాల అధికారులు ఆప్షన్లు వెతుకుతున్నట్లు తెలిపింది. ఆర్థిక సంక్షభంలో కూరుకుపోయిన ఇరాన్‌లో నిరసనలు కొనసాగుతున్నాయి. ధరలు పెరిగిపోవడం, కరెన్సీ విలువ పడిపోవడంతో అనేక మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు తెలుపుతున్నారు. గతంలో కూడా ఇలాంటి నిరసనలు జరగ్గా.. ఇరాన్ అధికారులు వాటిని అణచివేశారు. ఈ తాజా ఆందోళనలపై అంతర్జాతీయ సమాజం దృష్టిసారించింది. మరోవైపు.. వెనెజువెలాపై సైనిక ఆపరేషన్ చేసి.. ఆ దేశాధ్యక్షుడు నికొలస్ మదురోను అమెరికా నిర్బంధించిన సంగతి తెలిసిందే. మదురోపై అధ్యక్షుడు ట్రంప్ తీసుకొన్న చర్యలు ఇరాన్ నిరసనకారుల్లో ధైర్యాన్ని నింపిందని జెరూసలెం పేర్కొంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై బలప్రయోగం చేస్తే తాము రంగంలోకి దిగుతామంటూ ట్రంప్ కూడా గతంలో ఇరాన్ అధికారులను హెచ్చరించారు. ఈ క్రమంలో అమెరికా జోక్యంపై వార్తలు రావడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**నెతన్యాహు హెచ్చరికలు..**

ఇరాన్ తన బాలిస్టిక్ క్షపణి కార్యక్రమాలు పునరుద్ధరించడాన్ని తాము అనుమతించమని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నారు. పార్లమెంటులో ఆయన మాట్లాడుతూ.. తమపై దాడి జరిగితే ఇరాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆ దేశంలో కొనసాగుతున్న ఆందోళనల గురించి కూడా నెతన్యాహు మాట్లాడారు. స్వేచ్ఛ, న్యాయం కోసం ఇరాన్ ప్రజలు చేస్తున్న పోరాటానికి తాము మద్దతిస్తున్నట్లు తెలిపారు.

**నిరసనల్లో 35 మంది మృతి..**

ఇరాన్‌లో కొనసాగుతున్న నిరసనల్లో చెలరేగిన హింసలో దాదాపు 35 మంది ప్రాణాలు కోల్పోయారు. వారం రోజులకు పైగా కొనసాగుతున్న ఈ ఆందోళనల్లో 1,200 మందికి పైగా అరెస్టు చేశారని మీడియా కథనాలు పేర్కొన్నాయి. వీటి కారణంగా దాదాపు 250 మంది పోలీసు అధికారులు, మరికొందరు భద్రతా దళాల సభ్యులు గాయపడ్డారని పేర్కొంది.

## బిజినెస్ వాయిస్

బంగారం, వెండి, రాగిని తలదన్నుతూ

# రేసులోకి మరో మెటల్..

భవిష్యత్తులో దీనికి మరింత డిమాండ్..



బంగారం, వెండి, రాగికి పోటీగా మరో మెటల్ కూడా రేసులోకి వస్తోంది. ఇటీవల గోల్డ్ రేట్లు ఎక్కువగా ఉండటంతో ఇతర లోహాల వైపు చాలామంది చూపు పడుతోంది. బంగారం, వెండికి డిమాండ్ పెరగడంతో రాగి కూడా అదే బాటలో నడుస్తోంది. ఇప్పుడు తాజాగా..

తరచూ బంగారం, వెండి ధరల గురించి ప్రతీఒక్కరూ చర్చించుకుంటూ ఉంటారు. లేటెస్ట్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇక పెళ్లిళ్లు లేదా ఏవైనా ఫంక్షన్లు వస్తే తొలుత బంగారం మీదే అందరి దృష్టి పడుతుంది. నలుగురిలో ఆకర్షణీయంగా కనిపించేలా గోల్డ్ ధరించి సంతోషపడుతుంటారు. ముఖ్యంగా ఇండియాలో గోల్డ్‌ను పెద్ద సెంటిమెంట్‌గా భావిస్తున్నారు. కేవలం ధరించడానికి మాత్రమే కాకుండా ఓ ఆస్తిగా కూడా దీనిని పరిగణిస్తారు. డబ్బులు ఉంటే వెంటనే గోల్డ్ కొనేసి దాచుకుంటారు. ఇక డిజిటల్ గోల్డ్‌లో ఇన్వెస్ట్‌మెంట్స్ కూడా చేస్తూ ఉంటారు. ఇప్పుడు ఎవరి నోళ్లల్లో బట్టినా బంగారం, వెండి ధరల పెరుగుదల గురించే చర్చ జరుగుతోండగా వీటికి పోటీగా మిగతా మెటల్స్ ధరలు కూడా పెరుగుతున్నాయి.

### లిథియంకు పెరుగుతున్న డిమాండ్

బంగారం, వెండి ధరలు ఊహించనంత స్థాయిలో పెరుగుతుండటంతో ఇటీవల రాగికి డిమాండ్ పెరిగింది. రాగిని వివిధ వస్తువుల తయారీలో ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. దీని వల్ల దాని ధర పెరుగుతోండగా.. ఇప్పుడు మరో మెటల్ కూడా రేసులోకి దూసుకొచ్చింది. అదే లిథియం. ఈ లోహంకు కూడా ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా ఫుల్ డిమాండ్ పెరిగింది. దీంతో ఇందులోకి పెట్టుబడులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా లిథియంను బ్యాటరీ తయారీలో ఉపయోగిస్తారని మనకు తెలిసిన విషయం. ఇక బ్యాటరీల తయారీలోనే కాకుండా ఎలక్ట్రానిక్ వెహికల్స్, ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, మెరాలు, ట్యాబుల తయారీలో వినియోగిస్తున్నారు. అలాగే ఇంధన, క్లీన్ ఎనర్జీ రంగాల్లో దీని వాడకం పెరిగిపోయింది. డిమాండ్ పెరుగుతున్న కారణంగా లిథియం ధరలు కూడా నానాటికి పెరుగుతూ వస్తోన్నాయి. దీంతో ఇప్పుడు ఇందులో పెట్టుబడులు పెడితే భవిష్యత్తులో మంచి లాభాలు వస్తాయని విశ్లేషకులు చెబుతున్నారు.

### భారత్ కూడా ఫోకస్

పాత బ్యాటరీలతో పోలిస్తే లిథియం బ్యాటరీలు వేగంగా ఛార్జ్ అవుతాయి. అలాగే మెరుగైన క్వాలిటీతో పాటు సామర్థ్యాన్ని అందిస్తాయి. టెక్నాలజీ పెరుగుతున్న క్రమంలో లిథియం బ్యాటరీలకు డిమాండ్ తగ్గే అవకాశం లేదు. దీంతో భవిష్యత్తుల్లో వీటి డిమండ్ భారీగా పెరిగే అవకాశముంది. ప్రస్తుతం ప్రపంచంలోనే లిథియం నిల్వల్లో ఆస్ట్రేలియా తొలి స్థానంలో ఉంది. ఇక రెండో స్థానంలో చిలి ఉండగా.. ఆ తర్వాత అర్జెంటీనా, బొలీవియా, చైనాలో కూడా అత్యధికంగా ఉన్నాయి. ఇక భారత్ కూడా లిథియం నిల్వలపై దృష్టి పెట్టింది. లిథియం కోసం అన్వేషించడం మొదలుపెట్టింది. దేశంలో క్లీన్ ఎనర్జీని మెరుగపర్చడం, విదేశాల నుంచి దిగమతి చేసుకోవడాన్ని తగ్గించుకునేందుకు లిథియం అన్వేషణపై ఫోకస్ పెట్టింది.

కేవలం 2 నిమిషాల్లోనే రూ.162 కోట్లు నష్టపోయిన

# డిమార్ట్ యజమాని రాధాకిషన్ దమాని

గత నాలుగు త్రైమాసికాలుగా ధర-ఆదాయ నిష్పత్తి 50 కంటే ఎక్కువగా ఉండటం వల్ల కూడా ఈ స్టాక్ ఒత్తిడిని ఎదుర్కొంది. అలాంటి సందర్భాలలో స్వల్ప నిరాశ లేదా వృద్ధిలో మెరుగుదల లేకపోవడం కూడా స్టాక్ ధరలో గణనీయమైన తగ్గుదలకు దారితీస్తుంది..

మంగళవారం స్టాక్ మార్కెట్ క్షణతతో ట్రేడయ్యింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు రెండూ రెడ్ జోన్‌లో ఉన్నాయి. ఈ క్షణత మధ్య మార్కెట్ ప్రారంభమైన వెంటనే ట్రెంట్ షేర్లు కుప్పకూలాయి. స్టాక్ అకస్మాత్తుగా 8% కంటే ఎక్కువ పడిపోయింది. అలాగే ప్రముఖ పెట్టుబడిదారు రాధా కిషన్ దమాని కేవలం రెండు నిమిషాల్లో రూ.162 కోట్లు కోల్పోయి అతిపెద్ద దెబ్బను చవిచూశారు.

ఒక్క క్షణంలో కుప్పకూలిన టాటా షేర్లు:

దలాల్ స్ట్రీట్‌లో అనుభవజ్ఞుడైన వాల్యూ ఇన్వెస్టర్, డిమార్ట్ యజమాని రాధాకిషన్ దమాని మంగళవారం స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ ప్రారంభమైన నిమిషాల్లోనే ట్రెంట్ షేర్లు 8% కంటే ఎక్కువ పడిపోయడంతో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. టాటా గ్రూప్ రిటైల్ యూనిట్ అయిన ట్రెంట్ స్టాక్ మంగళవారం భారీ అమ్మకాలను చూసింది.

ధర రూ.4000కి పడిపోయింది:

మనం చీూజు దేటాను పరిశీలిస్తే ట్రెంట్ లిమిటెడ్ షేరు రూ.4208 వద్ద ప్రారంభమైంది. దాని మునుపటి ముగింపు ధర రూ.4417 నుండి గణనీయంగా పడిపోయింది. ఆపై అకస్మాత్తుగా రూ.4060కి పడిపోయింది. ట్రేడింగ్ ప్రారంభమైన రెండు నిమిషాల్లో ఇది 8.35% భారీ పతనం. షేరు పతనం కారణంగా కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా పడిపోయింది. మధ్యాహ్నం సమయానికి ట్రెంట్ మార్కెట్ క్యాప్ రూ.1.45 లక్షల కోట్లకు పడిపోయింది.

ఆర్ దమానీ భారీ నష్టాన్ని చవిచూశారు:

ప్రముఖ పెట్టుబడిదారుడు, దేశంలోని అత్యంత ధనవంతులైన బిలియనీర్లలో ఒకరైన రాధాకిషన్ దమానీ తన పెట్టుబడి సంస్థ డ్రైవ్ ట్రేడింగ్, రిసార్ట్స్ ద్వారా ట్రెంట్‌లో 43,98,204 ఈక్విటీ షేర్లను కలిగి ఉన్నారు. ఈ షేర్ల సంఖ్య అతనికి కంపెనీలో 1.24%



వాటాను ఇస్తుంది. మంగళవారం ప్రారంభ ట్రేడింగ్ సమయంలో ఈ టాటా స్టాక్ పతనంతో అతని వాటా విలువ రూ.162.65 కోట్లు తగ్గింది. ఇది కేవలం రెండు నిమిషాల్లోనే రూ.1,948.32 కోట్ల నుండి రూ.1,785.67 కోట్లకు పడిపోయింది.

ట్రెంట్ షేర్లు కుప్పకూలిపోవడానికి ఇందుకేనా?

ట్రెంట్ షేర్లలో పదునైన క్షణతకు గల కారణాల విషయానికొస్తే, డిసెంబర్ త్రైమాసికంలో వృద్ధి వేగంపై పెట్టుబడిదారులు స్పందించిన తర్వాత పడిపోయింది. కంపెనీ బలమైన వృద్ధిని నమోదు చేస్తూనే ఉన్నప్పటికీ, వార్షిక ఆదాయ వృద్ధి గత మూడు నెలలతో పోలిస్తే ఎటువంటి మెరుగుదల చూపలేదు. ఇది కొంతమంది పెట్టుబడిదారులను లాభాలను బుక్ చేసుకోవడానికి ప్రేరేపించింది. గత నాలుగు త్రైమాసికాలుగా ధర-ఆదాయ నిష్పత్తి 50 కంటే ఎక్కువగా ఉండటం వల్ల కూడా ఈ స్టాక్ ఒత్తిడిని ఎదుర్కొంది. అలాంటి సందర్భాలలో స్వల్ప నిరాశ లేదా వృద్ధిలో మెరుగుదల లేకపోవడం కూడా స్టాక్ ధరలో గణనీయమైన తగ్గుదలకు దారితీస్తుంది.

హోమ్ లోన్ తీసుకునే ముందు ఇవి పక్కా తెలుసుకోండి..

# లేకపోతే నష్టపోవడం గ్యారెంటీ..

సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి జీవితకాల కల. ఆ కలను సాకారం చేసుకునే క్రమంలో హెూమ్ లోన్ అనేది ఒక ప్రధాన వంతెనలా నిలుస్తుంది. అయితే మీరు లోన్ తీసుకోవాలని ప్లాన్ చేస్తుంటే.. మీ ముందున్న అతిపెద్ద సవాల్ వడ్డీ రేటు. అసలు ఫిక్స్‌డ్ రేటును ఎంచుకోవాలా? లేక ఫ్లోటింగ్ రేటు మేలా? అనేది ఇప్పుడు తెలుసుకుందాం..

సొంత ఇల్లు అనేది ప్రతి ఒక్కరి జీవితకాల కల. ఈ 2026 సంవత్సరంలో మీ కలను నిజం చేసుకోవడానికి బ్యాంకు నుండి హెూమ్ లోన్ తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే లోన్ తీసుకునే ముందు ప్రతి ఒక్కరినీ వేధించే ప్రధాన ప్రశ్న.. ఏ వడ్డీ రేటును ఎంచుకోవాలి? అని. మార్కెట్లో అందుబాటులో ఉన్న ఫిక్స్‌డ్, ఫ్లోటింగ్ డ్డీ రేట్లలో మీకు ఏది లాభదాయకమో ఈ ప్రత్యేక కథనంలో తెలుసుకుందాం.

### ఏ వడ్డీ రేటు ఉత్తమ ఎంపిక?

హెూమ్ లోన్ తీసుకునేటప్పుడు ఏ వడ్డీ రేటును ఎంచుకోవాలనేది పూర్తిగా మీ ఆదాయం, రిస్క్ తీసుకునే సామర్థ్యం, మీ భవిష్యత్తు ఆర్థిక ప్రణాళికపై ఆధారపడి




ఉంటుంది.

### ఫ్లోటింగ్ వడ్డీ రేటు

ఫ్లోటింగ్ రేటులో వడ్డీ రేట్లు రుణ కాలపరిమితి మొత్తం ఒకేలా ఉండవు. ఆర్‌బీఐ రెపో రేట్లకు అనుగుణంగా ఇవి మారుతూ ఉంటాయి. మీ ఉద్యోగం స్థిరంగా ఉండి, అధిక ఆదాయం ఉన్నవారు దీనిని ఎంచుకోవచ్చు. మార్కెట్ ఒడిదుడుకుల వల్ల భవిష్యత్తులో ఈఎంఐ పెరిగినా భరించగలిగే రిస్క్ ఉన్న వారికి ఇది మేలు. భవిష్యత్తులో వడ్డీ రేట్లు తగ్గుతాయని మీరు భావిస్తే, ఫ్లోటింగ్ రేటుతో మీపై భారం తగ్గుతుంది.

### ఫిక్స్‌డ్ వడ్డీ రేటు

స్థిర వడ్డీ రేటులో, మీరు తీసుకున్న రుణ కాలపరిమితి ముగిసే వరకు వడ్డీ రేటు మారదు. మీరు చెల్లించే ఈఎంఐ ప్రతి నెలా ఒకేలా ఉంటుంది. తక్కువ ఆదాయం ఉండి, ఖచ్చితమైన నెలవారీ బడ్జెట్ పాటించే వారికి ఇది ఉత్తమం. రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడని వారు, భవిష్యత్తులో ఈఎంఐ పెరిగి బడ్జెట్ తలకిందులు కాకూడదు అనుకునేవారు దీనికి ప్రాధాన్యత ఇవ్వాలి. మీ ఉద్యోగ భద్రతపై ఏవైనా సందేహాలు ఉన్నప్పుడు, స్థిరమైన ఈఎంఐ మీకు మానసిక ప్రశాంతతను ఇస్తుంది.

### రేట్లలో తేడా ..

సాధారణంగా ఫ్లోటింగ్ రేట్ల కంటే స్థిర వడ్డీ రేట్లు కొంచెం ఎక్కువగా ఉంటాయి. స్థిరత్వం కోరుకునే వారు కొంచెం అదనపు వడ్డీ చెల్లించడానికి సిద్ధంగా ఉండాలి. మీరు హెూమ్ లోన్ తీసుకునే ముందు వివిధ బ్యాంకుల వడ్డీ రేట్లను పోల్చి చూడండి. మీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితిని బేరీజు వేసుకుని, దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మీ హెూమ్ లోన్ భారాన్ని తగ్గించుకోండి.

10 సంవత్సరాలలో

# రూ.3 కోట్లు ఎలా సంపాదించాలి?

ఆశ్చర్యపోయే బెస్ట్ ట్రిక్..!



అంతరాయం కలిగించే ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

SIP ఎందుకు సులభమైన మార్గం:

SIP (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్) అంటే ప్రతి నెలా ఒక స్థిర మొత్తాన్ని పెట్టుబడి పెట్టడం. ఇది మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గిస్తుంది. కాంపౌండింగ్ కాలక్రమేణా సంపద వేగంగా వృద్ధి చెందడానికి అనుమతిస్తుంది. చిన్న పెట్టుబడులు గణనీయమైన కార్పస్‌ను పెంచుతాయి. అందుకే సిప్ దీర్ఘకాలిక పెట్టుబడి వ్యూహంగా పరిగణిస్తారు.

మీరు ప్రతి నెలా ఎంత పెట్టుబడి పెట్టాలి?

ఒక పెట్టుబడిదారుడు సగటున 12% వార్షిక రాబడిని ఊహించినట్లయితే వారు నెలకు సుమారు రూ.129,000 పెట్టుబడి పెట్టవలసి ఉంటుంది. 10 సంవత్సరాలలో మొత్తం పెట్టుబడి సుమారు రూ.15,500,000 అవుతుంది. దీనిపై అంచనా వేసిన రాబడి సుమారు రూ.14,500,000 కావచ్చు. అందువలన మొత్తం కార్పస్ రూ.30,000,000 చేరుకోవచ్చు.

రిస్క్, రాబడిని ఎలా అర్థం చేసుకోవాలి?

సిప్ రాబడి మార్కెట్‌పై ఆధారపడి ఉంటుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్‌లు అధిక రాబడిని అందించగలవు. కానీ అవి రిస్క్‌ను కూడా కలిగి ఉంటాయి. అందువల్ల పెట్టుబడి పెట్టే ముందు మీ రిస్క్ సామర్థ్యాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. మీరు తక్కువ రిస్క్ తీసుకోవాలనుకుంటే మీరు వివిధ పథకాలలో పెట్టుబడి పెట్టవచ్చు. ఒకే ఒక్క ఫండ్‌లో పెట్టుబడి పెట్టడం వల్ల రిస్క్ పెరుగుతుంది. అందుకే మీ పెట్టుబడులను లార్జ్-క్యాప్, మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ ఫండ్లలో విస్తరించడం మంచిది. ఇది రిస్క్‌ను వ్యాపింపజేస్తుంది. స్థిరమైన రాబడిని నిర్ధారిస్తుంది. దీర్ఘకాలంలో మీ పెట్టుబడులను సురక్షతంగా చేస్తుంది.

మార్కెట్లో మంచి రాబడి సాధించేందుకు రకరకాల పెట్టుబడి మార్గాలు ఉన్నాయి. అయితే సిప్ లో ఇన్వెస్ట్ చేసినట్లయితే మంచి రాబడి సాధించవచ్చు. మీరు పది సంవత్సరాలలో 3 కోట్ల రూపాయల వరకు సంపాదించాలంటే నెలకు ఎంత సిప్ చేయాల్సి ఉంటుంది.. పూర్తి వివరాలు తెలుసుకుందాం..

ఈ ద్రవ్యోల్బణ యుగంలో రూ. 3 కోట్ల మూలధనాన్ని నిర్మించడం చాలా మందికి సుదూర కలలా అనిపిస్తుంది. అయితే, సరైన ప్రణాళిక, క్రమం తప్పకుండా పెట్టుబడి పెడితే ఈ లక్ష్యం సాధించవచ్చు. పెట్టుబడిదారులు ప్రతి నెలా క్రమశిక్షణతో పెట్టుబడి పెడితే వారు 10 సంవత్సరాలలో గణనీయమైన సంపదను నిర్మించుకోవచ్చు. మ్యూచువల్ ఫండ్ ూక్రూలు వంటి ఎంపికలు దీర్ఘకాలికంగా సమ్మేళనం చేసే ప్రయోజనాన్ని అందిస్తాయి. 10 సంవత్సరాలలో రూ. 3 కోట్లు సేకరించడానికి ప్రతి నెలా ఎంత SIP పెట్టుబడి అవసరమో తెలుసుకుందాం.

### 10 సంవత్సరాలలో రూ. 3 కోట్ల లక్ష్యన్ని ఎలా నిర్దేశించుకోవాలి?

ఏదైనా పెట్టుబడి ఒక లక్ష్యన్ని నిర్దేశించుకోవడంతో ప్రారంభమవుతుంది. ఇక్కడ 10 సంవత్సరాలలో రూ.3 కోట్ల మూలధనాన్ని నిర్మించడం లక్ష్యం. సమయం, మొత్తం స్పష్టంగా ఉన్నప్పుడు, పెట్టుబడి దిశను నిర్ణయించడం సులభం అవుతుంది. ఇది పెట్టుబడిదారులు సరైన పథకాన్ని ఎంచుకోవడానికి సహాయపడుతుంది. పెట్టుబడి

ఒక్కసారి ఛార్జ్ చేస్తే

# హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లిపోవచ్చు..!



ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీదారు సింపుల్ ఎనర్జీ భారత మార్కెట్‌కు రెండు కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్లను ప్రవేశపెట్టింది. సింపుల్ వన్ జెన్ 2, సింపుల్ అల్ట్రా అనేవి 400 కి.మీ రేంజ్ కలిగినవి. ఈ స్కూటర్.. ఆటోమొబైల్ మార్కెట్ లో ఎలక్ట్రిక్ వాహనాల హవా కొనసాగుతోంది. తాజాగా భారతీయ స్టార్టప్ సింపుల్ ఎనర్జీ సెకండ్ జనరేషన్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. మునుపటి వెర్షన్‌తో పోలిస్తే కంపెనీ స్కూటర్‌లో అనేక ముఖ్యమైన మార్పులు చేశారు. అంతేకాకుండా సింపుల్ వన్ అల్ట్రాను కూడా ప్రవేశపెట్టింది. ఈ స్కూటర్ ఒక్కసారి ఛార్జ్ చేస్తే 400 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ తెలిపింది. కంపెనీ సెకండ్ జనరేషన్ సింగిల్ వన్ స్కూటర్‌ను రూ. 1.40 లక్షల (ఎక్స్-షోరూమ్) ధరకు విడుదల చేయగా, టాప్-స్పెక్ వేరియంట్ ధర రూ. 1.78 లక్షల (ఎక్స్-షోరూమ్)గా ఉంది. ఇది మూడు కొత్త రంగు ఎంపికలలో అందుబాటులో ఉంటుంది. సోనిక్ రెడ్, ఏరో ఎక్స్, ఆస్ఫాల్ట్ ఎక్స్. కంపెనీ తన అన్ని స్కూటర్లపై బ్యాటరీ, మోటారుపై జీవితకాల వారంటీని కూడా అందిస్తోంది. ఈ స్కూటర్ ఓలా, అథర్ నుండి లాంగ్-రేంజ్ స్కూటర్లతో పోటీపడుతుంది.

### రాయల్ ఎన్‌ఫీల్డ్ ప్రియులకు బ్యాడ్‌న్యూస్.. ఈ బెస్ట్ సెల్లింగ్ బైక్‌ల ధరలు పెంపు!

ముఖ్యంగా ఇది 400 కిలోమీటర్ల రేంజ్ కలిగిన దేశంలోనే మొట్టమొదటి ఎలక్ట్రిక్ స్కూటర్. ఈ స్కూటర్ కేవలం 2.77 సెకన్లలో గంటకు 0 నుండి 40 కి.మీ. వేగాన్ని అందుకుంటుంది. ప్రస్తుతం ఈ మోడల్ గురించి కంపెనీ మరిన్ని వివరాలను అందించలేదు. సింపుల్ వన్ స్కూటర్ కోసం మూడు బ్యాటరీ ఎంపికలను అందిస్తుంది. వాటిలో 3.7, 4.5, 5 ఎెఔష్ట్ర సామర్థ్యాలు ఉన్నాయి. ఇది స్కూటర్‌కు ఒకే ఛార్జ్‌పై 400 కిలోమీటర్ల వరకు ×ణజ పరిధిని ఇస్తుంది. సింపుల్ వన్ జెన్ 2 లో అతిపెద్ద అప్‌గ్రేడ్ దాని పెద్ద బ్యాటరీ. టాప్ వేరియంట్ ఇప్పుడు 5 ఎెఔష్ట్ర బ్యాటరీని కలిగి ఉంది. ఇది మునుపటి కంటే 4 కిలోల తేలికైనది.

### లక్షణాలు, సాఫ్ట్‌వేర్:

ఈ స్కూటర్ కొత్త సింపుల్ ూూ పై నడుస్తుంది. దీనిలో అనేక కొత్త సాఫ్ట్‌వేర్ ఆధారిత లక్షణాలు ఉన్నాయి. భద్రత కోసం ఇది డ్రాప్ సేఫ్ ఫీచర్‌ను కలిగి ఉంది. ఇది స్కూటర్ పడిపోయినప్పుడు ముందుకు కదలకుండా నిరోధిస్తుంది. సూపర్ హెూల్డ్ ఫీచర్ వాలులపై స్కూటర్‌ను హ్యాండిల్ చేయడంలో సహాయపడుతుంది. దీనితో పాటు పార్కింగ్ మోడ్, రియల్-టైమ్ వెహికల్ స్టేటస్ కూడా అందుబాటులో ఉన్నాయి. సింపుల్ వన్ జెన్ 2లో 7-అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ ఉంది. ఇది ఆటో బ్రైట్‌నెస్, బ్లూటూత్ కనెక్టివిటీ, నాన్-టచ్ ఇంటర్‌ఫేస్‌ను కలిగి ఉంటుంది. వేరియంట్‌ను బట్టి స్టోరేజ్ కూడా మారుతుంది. దీనిలో టాప్ వేరియంట్ 8 +దీ వరకు ఇంటర్నల్ మెమరీని కలిగి ఉంటుంది.

### డిజైన్, చాసిస్:

సింపుల్ వన్ జెన్ 2 పదునైన డిజైన్‌ను కలిగి ఉంది. బాడీ అంతటా కొత్త గ్రాఫిక్స్‌తో ఇది తిరిగి డిజైన్ చేయబడిన రియర్-వ్యూ మిర్రర్‌లను కూడా కలిగి ఉంది. ఇంకా ఇంటీరియర్ కూడా సవరించింది. స్కూటర్ ఇప్పుడు కొత్త ఛాసిస్‌పై నిర్మించింది. ఇది 22 శాతం ఎక్కువ బలం, స్థిరత్వాన్ని అందిస్తుందని కంపెనీ పేర్కొంది. ఇది స్కూటర్ స్థిరత్వం, రైడర్ విశ్వాసాన్ని మెరుగుపరుస్తుంది.

# ఘనంగా స్వర్ణాంధ్ర 28వ వార్షికోత్సవ వేడుకలు

**వృద్ధుల సంక్షమాన్ని లక్ష్యంగా ఆదుకుంటున్న రాంబాబు అభినందనీయులు : ఎమ్మెల్సీ సోము వీర్రాజు**
**రాంబాబు సేవలకు ప్రభుత్వ గుర్తింపు దక్కాలి : అనుశ్రీ సత్యనారాయణ**
**దాతల సహకారంతోనే సేవలు అందిస్తున్నా : డాక్టర్ గుబ్బల రాంబాబు**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజం పట్ల బాధ్యత, సేవా భావమే అసలైన మానవత్వమని, స్వర్ణాంధ్ర సమాజానికి చేస్తున్న సేవలు ఆదర్శణీయమని బిజేపి జాతీయ కార్యవర్గ సభ్యులు, శాసనమండలి సభ్యులు సోము వీర్రాజు పేర్కొన్నారు. స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో మంగళవారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ 28వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సోము వీర్రాజు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం ఎందరో వృద్ధులకు ఆకలి తీరుస్తుందన్నారు. వృద్ధుల సంక్షమాన్ని లక్ష్యంగా చేసుకుని డాక్టర్ గుబ్బల రాంబాబు అభినందనీయులు, అవసరమైన సంరక్షణ అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న స్వర్ణాంధ్ర సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమన్నారు. కేవలం వృద్ధుల సంక్షమమే కాకుండా సమాజంలోని వారి అవసరతలను గుర్తించి ఆ దిశంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు. స్వర్ణాంధ్ర రాంబాబు తన ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేసి అంకితభావంతో సమాజానికి సేవలు అందిస్తున్నారన్నారు. రాంబాబు సేవలు ముందు తమలాంటి ప్రజాప్రతినిధుల సేవలు కూడా తక్కువగానే అనిపిస్తాయన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ 28వ వార్షికోత్సవ వేడుకలలో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. సమాజం పట్ల సేవా దృక్పథంతో పనిచేస్తున్న ఇలాంటి సంస్థలు మరెన్నో ముందుకు రావాలని ఆకాంక్షస్తున్నామన్నారు. మరో ముఖ్య అతిథి జనసేన రాజమహేంద్రవరం సిటీ ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ(అనుశ్రీ) మాట్లాడుతూ నగరంలో సేవ అంటే స్వర్ణాంధ్ర రాంబాబు గుర్తుకు వస్తారన్నారు. సమాజానికి ఆయన అందిస్తున్న బహుముఖ సేవలను కూటమి ప్రభుత్వం గుర్తించి, పురస్కారాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్వర్ణాంధ్ర రాంబాబు సమాజానికి సేవలు అందించడానికి ఆయనకు సహకరిస్తున్న ప్రతి దాత అభినందనీయులన్నారు. స్వర్ణాంధ్ర మెంటార్ చింతా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాంబాబు లాంటి విలువలు ఉన్న వ్యక్తి రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాంబాబు సేవలు స్ఫూర్తిదాయమని, ఆయనకు తాము ఎళ్ళవేళలా సహకారం అందిస్తామన్నారు. గుబ్బల రాంబాబు మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సహకారం వలనే తాను ఈ సంస్థను నిరాటంకంగా ముందుకు నడిపించగలుగుతున్నానన్నారు. ఈ సంస్థలో తాను ఒక బాధ్యుడుని మాత్రమేనన్నారు. సమాజంలో స్వర్ణాంధ్రకు దక్కే గౌరవం ఈ సంస్థకు సహకరిస్తున్న దాతల నుండి సేవలు అందిస్తున్న సిబ్బంది వరకు ప్రతి ఒక్కరికి దక్కుతుందన్నారు. ప్రభుత్వం నుండి గానీ, విదేశాల నుండి గానీ ఎటువంటి విరాళాలు అందకపోయినా కేవలం నగరంలోని దాతలు, తాను పనిచేసిన ఎల్ఐసి సంస్థలోని మిత్రులు అందిస్తున్న సహకారంతోనే సంస్థను నడిపిస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర 28వ వార్షికోత్సవంతో పాటు రాంబాబు పుట్టినరోజు కూడా కావడంతో సర్వమత ప్రార్ధనలు నిర్వహించి, కేక్‌ను కట్‌చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్వర్ణాంధ్రలో కుట్టు శిక్షణ పొందిన పలువురు మహిళలకు ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేతులు మీదుగా కుట్టు మిషన్‌లు అందజేశారు. అలాగే పలువురు వ్యాపారులకు వర్షం, ఎండ నుండి రక్షణకు గొడుగులను, పలువురికి ట్రైసైకిల్స్, తోపుడు బండ్లు అందజేశారు. సేవా మూర్తులను, సంస్థకు సహకరించిన దాతలను సత్కరించారు. రిటైర్డ్ ఆర్డీవో మారిశెట్టి జితేంద్ర, బాంసెఫ్ జాతీయ అధ్యక్షలు నయనాల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ అజ్జరపు వాసు, ట్రాన్స్‌కో విశ్రాంత ఎస్ఇ కొల్లూరు గోపాలకృష్ణ, లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ గ్రంధి వెంకటేశ్వరరావు, వివిఎస్ఆర్ఎస్ స్వామియాజులు తదితరులు మాట్లాడుతూ గుబ్బల రాంబాబు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కవి గూటం స్వామి వ్యాఖ్యతగా వ్యహరించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర అధ్యక్షలు పడాల రామిరెడ్డి, రిటైర్డ్ ఎఎస్పీ వాసంశెట్టి గోపాలకృష్ణ, రాజోలు ఎంపిడివో ఐఇ కుమార్, అన్నా మినిస్ట్రీస్ ఎవో ఎన్ రాజేష్‌కుమార్, 50వ వార్డు టిడిపి ఇన్‌చార్చి మరుకుర్తి రవియాదవ్, జనసేన నాయకులు వైవిడి ప్రసాద్, విన్నా వాసు, అల్లాటి రాజు, ఎలిపే శ్రీనివాస్, కాటే సత్యనారాయణరాజు, సమ్మతం గన్నెయ్య, పడాల చంద్రశేఖర్, మహేష్‌బాబు ఫ్యాన్స్ తనూజ్, అనూప్‌జైన్, ఎల్ఐసి పి రామ్‌కుమార్, స్వర్ణాంధ్ర సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొని రాంబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆటో డ్రైవర్ల పండుగలు చేసుకోలేని దుస్థితి

**- వీరి పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉంది.. - ఆర్టీసీ ఉచిత ప్రయాణం తో మరిన్ని ఇబ్బందులు**
**- బియ్యం బస్తాలు పంపిణీ చేసిన వాసంశెట్టి గంగాధర్ రావు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించడంతో ఆటో డ్రైవర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని ది రాజమండ్రి ఆటో వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షలు,ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షడు వాసంశెట్టి గంగాధర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో వారు ఏ పండుగ చేసుకోలేని దుస్థితిలో ఉన్నారని అందువల్లనే ఒక్కొక్క ఆటో డ్రైవర్ కు ఒక్కొక్క బియ్యం బస్తా పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. ఈ మేరకు స్థానిక దేవిచౌక్ సమీపంలో ఉన్న ఆయన నివాసం వద్ద అప్సర ఆటో స్టాండ్ (అండర్ గ్రౌండ్) యూనియన్ లో ఉన్న 45 మంది ఆటో డ్రైవర్లకు మంగళవారం సాయంత్రం బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి గంగాధర్ రావు మాట్లాడుతూ యూనియన్ అధ్యక్షడిగా వారి పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఆటోలు తెచ్చి స్టాండ్ ల వద్ద పెట్టుకుంటున్నప్పటికీ ఎక్కేవారు కనిపించడం లేదని దీనితో వారు తీవ్ర నిరాశకు గురవుతున్నారని అన్నారు. లేపాక్ష ఆటో స్టాండ్ పరిధిలోని 40 మంది డ్రైవర్లకు బియ్యం పంపిణీ చేశామని, ఇప్పుడు అప్సర ఆటో స్టాండ్ కార్మికులకు పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. ప్రభుత్వం ఏడాదికి ఆటో డ్రైవర్లకు 15 వేలు ఇచ్చినా దేనికి సరిపోవడం లేదని, ఫైనాన్స్ కంపెనీలు ప్రతినెల ఓడీలపై ఓడీలు వేస్తూ ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆటో ఫైనాన్స్ కంపెనీలను ప్రభుత్వం నియంత్రించలేని పరిస్థితుల్లో ఉందని విమర్శించారు. మరొకవైపు పోలీస్ అధికారులు.. రవాణా శాఖ టార్గెట్లు పెట్టుకుని మరీ ఆటో డ్రైవర్ల పై కేసులు రాసుకుంటూ పోతున్నారని దీనివల్ల వారి జీవనం అగమ్య గోచరంగా మారిందని పేర్కొన్నారు. రాజమండ్రి ఆటో వర్కర్స్ యూనియన్ స్థాపించి 40 సంవత్సరాలు దాటడం, సంక్రాంతి పండుగ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఈ మేరకు సహాయం చేయడానికి ముందుకు వచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం ఈ విధంగా ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. మరొకవైపు కార్మిక చట్టాలు కూడా పూర్తిగా మార్చేశారని దీనివల్ల మరింతగా ఇబ్బందుల్లోకి వెళ్లే పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ఆటో కార్మికుల తరపున రోడ్డు ఎక్కితే న్యాయం జరుగుతుందన్న నమ్మకం కూడా పోయిందన్నారు. ఆందోళనలు, ఉద్యమాలు చేసి అరెస్టులకు గురైతే తమ పరిస్థితి ఏమిటన్న ఆవేదన ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆటో కార్మికుల సంక్షమాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి న్యాయం చేసేందుకు జాగ్రత్తగా ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి జోగా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షలు టి.సురేంద్ర కుమార్,ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు తమ్మిశెట్టి రామజోగయ్య, లంక పట్టాభి,పిల్లి రాజు, చిన్నారావు,తంగిరెడ్డి అప్పన్న,తదితరులు పాల్గొన్నారు.

# నన్నయ్యకు ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫికెట్

**వీసీని అభినందించిన మంత్రి నారా లోకేష్ - వర్సిటీలలో తొలిసారి ఫైవ్ స్టార్ రేటింగ్ సర్టిఫికెట్**

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉన్నత విద్యలో అత్యుత్తమ పనితీరు, నిబద్ధతకు గుర్తింపుగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫిట్ లభించింది. విశ్వవిద్యాలయాల్లో తొలిసారిగా నన్నయ విశ్వవిద్యాలయానికి దక్కిన ఈ గౌరవ సర్టిఫిట్టును రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ కి ప్రదానం చేసి అభినందించారు. సోమవారం విజయవాడలో జరిగిన వైస్ ఛాన్సలర్ల్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి(హెచ్.ఆర్.డి.), ఐ.టి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ మరియు రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫిట్ ను అందుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు వీసీ తెలియజేస్తూ హిమ్ ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ విశ్వవిద్యాలయాల్లో తొలిసారిగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫిట్ ను ఇచ్చిందన్నారు. హిమ్ ఇంటర్నేషనల్ నిపుణుల అంచనా బృందం నిర్వహించిన సమగ్ర మూల్యాంకనం తర్వాత ఈ సర్టిఫికేషన్ లభించిందని చెప్పారు. అధ్యాపకుల పనితీరు విద్యార్థుల ఫలితాలు వంటి అకడమిక్ ఎక్సలెన్స్, క్యాంపస్ పర్యావరణం వంటి గ్రీన్ ఇనిషియేటివ్‌లు మరియు సస్టైనబిలిటీ ప్రాక్టీసెస్, బి.ఇడి లో నూరు శాతం విద్యా ఫలితాలు వంటి వివిధ కేటగిరిలలో క్షణ్ణంగా పరిశీలించి ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫిట్ విడుదల చేశారని చెప్పారు. ఈ సర్టిఫిట్ ను విద్యాశాఖలో విజనరీ నాయకుడైన మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా తీసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. విశ్వవిద్యాలయాలు నాణ్యత ప్రమాణాలు పెంచాలని, ఉపాధి కల్పించే వారధులుగా మారని, నాక్, ఎన్.ఆర్.ఎఫ్.ఐ.ర్యాంకింగ్స్ సాధించాలని, ఏఐ, క్వాంటం టెక్నాలజీ, ఆటోమేషన్ వంటి అంశాలలో వర్సిటీలు ముందుండాలని మంత్రి స్ఫూర్తిని నింపారని తెలిపారు. ఆదికవి నన్నయ



విశ్వవిద్యాలయం ఏడు యూనివర్సిటీ కాలేజ్ క్యాంపస్ లతో, సుమారు 320 అనుబంధ కళాశాలలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయంగా పేరొందిందని, ఈ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో అందరూ సమష్టిగా సహకరించాలని కోరారు. తాను బాధ్యతలు చేపట్టిన సంవత్సరం పూర్తి కాకుండానే క్యాంపస్ ను సుందరీకరించడం, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపే కార్యక్రమాలు చేపట్టడం, క్యాంపస్ అభివృద్ధిలో అందరిని భాగస్వామ్యం చేయడంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఐదు ఐ.ఎస్.ఓ. సర్టిఫిట్లు లభించాయన్నారు. విశ్వవిద్యాలయానికి దక్కిన ఫైవ్ స్టార్ క్వాలిటీ రేటింగ్ సర్టిఫిట్ మరింత బాధ్యతను పెంచుతుందని, ఇదే స్ఫూర్తితో అందరూ విశ్వవిద్యాలయ అభివృద్దే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.

# అక్కడ దీపం వెలిగించొచ్చు..

**'కార్తిక దీపం' ఉత్తర్వులను సమర్థించిన హైకోర్టు**

**చెన్నై, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుప్పరకుంద్రం కొండపై కార్తిక దీపం వెలిగించే విషయంలో తమిళనాడు డీఎంకే ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. మదురైలోని ఈ కొండపై ఉన్న దీప స్తంభంలో దీపం వెలిగించేందుకు అనుమతినిస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు తాజాగా డివిజన్ బెంచ్ సమర్థించింది. ఆ స్తంభంలో దీపం వెలిగించొద్దని ఆగమశాస్త్రంలో పేర్కొన్నట్లు వ్యాజ్యదారులు బలమైన ఆధారాలు చూపించలేకపోయారని డివిజన్ బెంచ్ వెల్లడించింది. ఈ సందర్భంగా దీపం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలను ధర్మాసనం తిరస్కరించింది. ఏడాదిలో ఒకరోజు ఆ స్తంభంలో దీపం వెలిగిస్తే శాంతిభద్రతలకు ఆటంకం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడం హాస్యాస్పదం అని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని అనవసరంగా రాజకీయం చేశారంటూ కోర్టు అభిప్రాయపడింది. ఈ దీపస్తంభం సుబ్రమణ్యస్వామి ఆలయానికి చెందినదే అని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**కేసు వివాదం ఇదీ..**

తిరుప్పరకుంద్రం కొండపై ఉచ్చి పిళ్లైయార్ ఆలయం వద్ద కార్తిక దీపోత్సవం సందర్భంగా ఏటా దీపం వెలిగిస్తారు. అయితే, ఈ కొండపై సికందర్ దర్గాకు 15 మీటర్ల దూరంలో ఉన్న దీపస్తంభం పైనా దీపం వెలిగించేందుకు అనుమతినివ్వాలంటూ రామ రవికుమార్ అనే వ్యక్తి గతేడాది డిసెంబరులో మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన మదురై బెంచ్ సింగిల్ జడ్జి.. ఆ స్తంభంపైనా దీపం వెలిగించేందుకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. అక్కడ ఏర్పాట్లు చేయలేదని పిటిషనర్ మళ్లీ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మదురై ధర్మాసనంలో భద్రతా విధుల్లో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బందితో వెళ్లి దీపం వెలిగించుకోవచ్చని పిటిషనర్‌కు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటికే ఉచ్చి పిళ్లైయార్ ఆలయం వద్ద సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్వాహకుల తరపున కార్తిక దీపం వెలిగించారు. దర్గా సమీపంలో దీపం వెలిగించేందుకు రామ రవికుమార్, హిందూ నేతలతో ప్రయత్నించగా.. తోపులాట జరిగి పలువురు పోలీసులు గాయపడ్డారు. దీంతో ఈ కొండ వద్ద 144 సెక్షన్ విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, దర్గా ప్రతినిధులు డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపైనే నేడు డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది.

**ఇరుసుమండ బ్లోఅవుట్..**

# పునరావాస కేంద్రాలకు 500 కుటుంబాలు: అమలాపురం ఎంపీ

**మలికిపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండలో బ్లోఅవుట్ వద్ద మంటలు ఇంకా పూర్తి స్థాయిలో అదుపులోకి రాలేదు. ఓఎన్జీసీ సాంకేతిక సిబ్బంది ఆధ్వర్యంలో నియంత్రణ చర్యలు కొనసాగుతున్నాయి. అమలాపురం ఎంపీ హరీశ్ మాధుర్ ఈ ఘటనపై మాట్లాడారు. ప్రస్తుతం మంటలను అదుపు చేసే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. 500 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించినట్లు చెప్పారు. బాధితులకు అన్ని సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనుక్షణం పరిస్థితిని సమీక్షస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతం నుంచి ఆయిల్ తీసుకోవడం, బావులు తవ్వుకోవడానికి తమకు అభ్యంతరం లేదని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. అయితే.. ప్రమాదంపై కనీసం స్థానికులకు సమాచారం ఇవ్వలేదన్నారు. ఓఎన్‌జీసీ సరిగ్గా వ్యవహరించి ఉంటే ఇంత ప్రమాదం జరిగేది కాదని పేర్కొన్నారు. ఘటనకు ఓఎన్జీసీ అధికారులే సమాధానం చెప్పాలన్నారు.

**ట్రంప్ గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకొంటే**

# అది నాటోకి అంతమే: డెన్మార్క్ పీఎం

**విశ్వంవాయిస్ న్యూస్ :** వెనెజువెలా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా బంధించిన అనంతరం గ్రీన్‌లాండ్ పేరు ఎక్కువగా వినిపిస్తోంది. గ్రీన్‌లాండ్ గురించి ఇంకో 20 రోజుల్లో మాట్లాడదామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడెరిక్సన్ తీవ్రంగా స్పందించారు. తోటి నాటో దేశంపై అమెరికా దాడి చేస్తే.. మొత్తం సంబంధాలు ఆగిపోతాయని ఆమె స్పష్టం చేశారు. ఇది నాటోకు ముగింపేనన్నారు. నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) ఒక సైనిక కూటమి. సోవియట్ విస్తరణను అడ్డుకోవడానికి 1949లో అమెరికా, యూకే, ఫ్రాన్స్, కెనడా సహా 12 దేశాలు కలిసి దీనిని ఏర్పాటుచేశాయి. ఆ తర్వాత దీనిని విస్తరించారు. ప్రస్తుతం 30కి పైగా సభ్యదేశాలు ఉన్నాయి. నాటోలో చేరిన దేశం కూటమి కార్యకలాపాల్లో సైనిక సహకారం అందించడానికి సిద్ధంగా ఉండాలి.

**గ్రీన్‌లాండ్ డెన్మార్క్‌దే అనడానికి ఆధారం ఏమిటీ..?**

డెన్మార్క్ ప్రధాని వ్యాఖ్యల వేళ.. ట్రంప్ సలహాదారు స్టీఫెన్ మిల్లర్ స్పందించారు. గ్రీన్‌లాండ్ డెన్మార్క్‌దే అనడానికి ఆధారం ఏమిటని ప్రశ్నించారు. దానిని నియంత్రణలోకి తీసుకోవడం ద్వారా సైనిక కూటమి, ఆర్కిటిక్ ప్రయోజనాలను అమెరికా కాపాడుతుందన్నారు. మిల్లర్ సతీమణి కేటీ మిల్లర్ పెట్టిన పోస్టు ఇప్పటికే కలకలం సృష్టించింది. అమెరికా జెండా రంగుల్లో ఉన్న గ్రీన్‌లాండ్ మ్యాప్‌ను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దానికి 'త్వరలో' అనే పదాన్ని జత చేసిన సంగతి తెలిసిందే.

**వెనిజువెలాలో ఉద్రిక్తత..**

# అధ్యక్ష భవనం వద్ద కాల్పులు

**మిరాఫ్లోర్స్ అధ్యక్ష భవనం సమీపంలో భారీగా పేలుళ్లు, కాల్పులు**
**తాత్కాలిక అధ్యక్షరాలిగా బాధ్యతలు స్వీకరించిన డెల్సీ రోడ్రిగ్జ్**
**వెనిజువెలాను తామే నడిపిస్తామన్న అమెరికా అధ్యక్షడు డొనాల్డ్ ట్రంప్**
**అమెరికా చర్యను తప్పుబట్టిన భారత్, రష్యా, చైనా మరియు బ్రెజిల్**

**విశ్వంవాయిస్ న్యూస్ :** వెనిజువెలా రాజకీయ సంక్షభం యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది. మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా బలగాలు బందీగా పట్టుకున్న తర్వాత రాజధాని కారకాస్‌లో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. తాజాగా అక్కడి మిరాఫ్లోర్స్ అధ్యక్ష భవనం సమీపంలో భారీగా కాల్పులు, ఘర్షణలు జరిగాయి. ప్రస్తుతానికి పరిస్థితి అదుపులోనే ఉందని అధికారులు చెబుతున్నప్పటికీ, నగరం మొత్తం భయాందోళనలో మునిగిపోయింది. మదురో గైర్హాజరీలో వెనిజువెలా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉపాధ్యక్షరాలు డెల్సీ రోడ్రిగ్జ్ తాత్కాలిక అధ్యక్షరాలిగా ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికాతో చర్చలకు సిద్ధమని ఆమె సంకేతాలిచ్చారు. అయితే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం వెనిజువెలాలో సరైన అధికార మార్పిడి జరిగే వరకు ఆ దేశాన్ని అమెరికా నడిపిస్తుందని స్పష్టం చేశారు. అమెరికా తీరుపై కొలంబియా అధ్యక్షుడు గుస్తావో పెట్రో తీవ్రంగా స్పందించారు. గతంలో గెరిల్లా పోరాటం చేసిన తాను మాతృభూమి రక్షణ కోసం మళ్లీ ఆయుధం పడతానని హెచ్చరించారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డి సిల్వా సైతం అమెరికా చర్యను తీవ్రంగా ఖండించారు. ఒక సార్వభౌమ దేశంపై బాంబులు వేయడం, అధ్యక్షుడిని పట్టుకోవడం ఆమోదయోగ్యం కాదని మండిపడ్డారు. అమెరికా సైనిక చర్యను రష్యా, చైనా దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇది ఒక దేశంపై జరిగిన సాయుధ దురాక్రమణ అని రష్యా అభివర్ణించగా, ఒక దేశాధ్యక్షుడిపై బలాన్ని ప్రయోగించడం దిగ్భ్రాంతికరమని చైనా పేర్కొంది. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ స్పందిస్తూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వెనిజువెలా ప్రజల క్షమం తమకు ముఖ్యమని, అన్ని పక్షలు శాంతియుతంగా చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చింది. ప్రాంతీయ స్థిరత్వం దెబ్బతినకుండా చూడాలని భారత్ కోరింది.

## క్రీడా వాయిస్

# చివరి బంతికి సిక్సర్ బాది మరీ 200..




అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం సాక్షిగా కేరళ బ్యాటర్ విష్ణు వినోద్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. విజయ్ హజారే ట్రోఫీలో పుదుచ్చేరి బౌలర్లను ఊచకోత కోస్తూ సిక్సర్ల సునామీ సృష్టించాడు. కేవలం 84 బంతుల్లోనే 162 పరుగులతో అజేయంగా నిలిచి, కేరళకు కళ్లు చెదిరే విజయాన్ని అందించాడు. సంజు శాంసన్ వంటి స్టార్ ప్లేయర్లు విఫలమైన చోట విష్ణు వినోద్ చూపించిన విధ్వంసం ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. పుదుచ్చేరి నిర్దేశించిన 248 పరుగుల లక్ష్యాన్ని కేరళ జట్టు కేవలం 29 ఓవర్లలోనే ఊదేశందంటే అది విష్ణు వినోద్ పుణ్యమే. ఓపెనర్లు రోహన్ కున్నుమ్మల్ (8), సంజు శాంసన్ (11) త్వరగానే అవుట్ అయినప్పటికీ, విష్ణు వినోద్ మాత్రం తగ్గలేదు. తన ఇన్నింగ్స్‌లో మొత్తం 14 భారీ సిక్సర్లు, 13 ఫోర్లు బాదాడు. అంటే అతను చేసిన 162 పరుగుల్లో 136 పరుగులు కేవలం బౌండరీల (ఫోర్లు, సిక్సర్లు) ద్వారానే వచ్చాయి. 29 డాట్ బాల్స్ ఆడినప్పటికీ, మిగిలిన బంతుల్లో బౌలర్లపై దండయాత్ర చేసి 192 పైగా స్ట్రైక్ రేట్‌తో పరుగులు రాబట్టాడు. 63 బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకున్న విష్ణుకు ఇది లిస్ట్-ఏ కెరీర్‌లో అత్యధిక స్కోరు. విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలో విష్ణు వినోద్ ఇప్పుడు 'సిక్సర్ల వీరుడు'గా మారుతున్నాడు. ఇప్పటివరకు ఈ టోర్నీలో అతను మొత్తం 106 సిక్సర్లు బాదాడు. అత్యధికంగా 109 సిక్సర్లు కొట్టిన మనీష్ పాండే రికార్డును అధిగమించేందుకు విష్ణు కేవలం 4 సిక్సర్ల దూరంలోనే ఉన్నాడు. ప్రతి 19.9 బంతులకు ఒక సిక్సర్ బాదుతూ, ఈ టోర్నీలో అత్యుత్తమ బాల్/సిక్సర్ నిష్పత్తి కలిగిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ఈ గణాంకాలే విష్ణు వినోద్ పవర్ హిట్టింగ్ సామర్థ్యాన్ని చాటిచెబుతున్నాయి. విష్ణు వినోద్ టాలెంట్ కొత్తదేమీ కాదు, కానీ ఐపీఎల్‌లో అతనికి సరైన అవకాశాలు రాలేదు. 2017లో ఆర్‌సీబీ తరపున అరంగేట్రం చేసినా కేవలం 3 మ్యాచ్‌లే ఆడాడు. ఆ తర్వాత 2023లో ముంబై ఇండియన్స్ తరపున కూడా కొన్ని మ్యాచ్‌లే ఆడే అవకాశం దక్కింది. ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ జట్టులో ఉన్న విష్ణు వినోద్, ఈ ఏడాది విజయ్ హజారేలో చూపిస్తున్న ఫామ్ చూస్తుంటే.. ఐపీఎల్ 2026లో అతనికి ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. పంజాబ్ కింగ్స్ యజమాని ప్రీతి జింటా ఈ ఇన్నింగ్స్ చూస్తే ఖచ్చితంగా ఫిదా అయిపోవాల్సిందే.



సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో అమన్ రావు విధ్వంసం సృష్టించాడు. టాస్ గెలిచిన బెంగాల్ బౌలింగ్ ఎంచుకోగా, హైదరాబాద్ ఓపెనర్లు రాహుల్ సింగ్ (65), అమన్ రావు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. అమన్ మొదట నిలకడగా ఆడి 108 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో మరో సంచలనం నమోదైంది. హైదరాబాద్ ఓపెనర్ అమన్ రావు ఆకాశమే హద్దుగా చెలరేగిపోయి డబుల్ సెంచరీతో చరిత్ర సృష్టించాడు. బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో సిక్సర్ల వర్షం కురిపించిన ఈ కుర్రాడు, ఇన్నింగ్స్ ఆఖరి బంతికి సిక్సర్ బాది తన డబుల్ సెంచరీ పూర్తి చేయడం విశేషం. ఇంతకీ ఎవరీ అమన్ రావు? అమెరికాలో పుట్టి భారత్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్న ఈ కుర్రాడి కథేంటో చూద్దాం. సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో అమన్ రావు విధ్వంసం సృష్టించాడు. టాస్ గెలిచిన బెంగాల్ బౌలింగ్ ఎంచుకోగా, హైదరాబాద్ ఓపెనర్లు రాహుల్ సింగ్ (65), అమన్ రావు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. అమన్ మొదట నిలకడగా ఆడి 108 బంతుల్లో తన సెంచరీని పూర్తి చేశాడు. అయితే, వంద పరుగులు దాటాక అమన్ విశ్వరూపం చూపించాడు. తర్వాతి 100 పరుగులను కేవలం 46 బంతుల్లోనే బాదేశాడు. ఆకాశ్ దీప్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో, చివరి

## ఎవరీ అమన్ రావు..

బంతికి ముందు అమన్ 194 పరుగుల వద్ద ఉన్నాడు. ఆఖరి బంతిని స్టాండ్స్‌లోకి పంపి అద్భుతమైన రీతిలో తన డబుల్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. మొత్తంగా 154 బంతుల్లో 200 పరుగులు చేసిన అమన్ ఇన్నింగ్స్‌లో 13 భారీ సిక్సర్లు, 12 ఫోర్లు ఉన్నాయి. అమన్ రావు నేపథ్యం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. అతను జూన్ 2, 2004న అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్రంలోని మాడిసన్ నగరంలో జన్మించాడు. పుట్టింది అమెరికాలోనే అయినా, తన క్రికెట్ కలను నెరవేర్చుకోవడానికి హైదరాబాద్‌కు వచ్చాడు. ఇప్పుడు ఇక్కడ డొమెస్టిక్ క్రికెట్‌లో పరుగుల సునామీ సృష్టిస్తున్నాడు. కేవలం 3 లిస్ట్-ఏ మ్యాచ్‌ల్లోనే 252 పరుగులు, 11 టీ20ల్లో 301 పరుగులు చేసి తన సత్తా చాటుకున్నాడు.

అమన్ రావు టాలెంటును ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఇప్పుడే గుర్తించాయి. ఐపీఎల్ 2026 వేలంలో రాజస్థాన్ రాయల్స్ జట్టు అతడిని రూ. 30 లక్షల బేస్ ప్రైస్‌కు కొనుగోలు చేసింది. వేలంలో తక్కువ ధరకే దొరికిన ఈ వజ్రాన్ని రాజస్థాన్ ఎలా వాడుకుంటుందో చూడాలి. ప్రస్తుత విజయ్ హజారే ఫామ్‌ను చూస్తుంటే ఐపీఎల్‌లో కూడా అమన్ తన బ్యాట్‌తో విధ్వంసం సృష్టించడం ఖాయంగా కనిపిస్తోంది. తిలక్ వర్మ కెప్టెన్సీలో ఆడుతున్న అమన్, భవిష్యత్తులో టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు.

# కేఎల్ రాహుల్‌కు ఏమైంది?

**వరుసగా రెండోసారి ఫెయిల్.. కివీస్ వన్డే సిరీస్‌కు ముందు టెన్షన్‌లో టీమిండియా**



టీమిండియా స్టార్ ప్లేయర్ కేఎల్ రాహుల్ ఫామ్ ఇప్పుడు సెలెక్టర్లకు పెద్ద తలనొప్పిగా మారింది. న్యూజిలాండ్‌తో కీలకమైన వన్డే సిరీస్ ముంచుకొస్తున్న తరుణంలో విజయ్ హజారే ట్రోఫీలో తన హోమ్ టీమ్ కర్ణాటక తరఫున ఆడుతున్న రాహుల్ వరుసగా విఫలమవుతున్నాడు. టీమిండియా స్టార్ ప్లేయర్ కేఎల్ రాహుల్ ఫామ్ ఇప్పుడు సెలెక్టర్లకు పెద్ద తలనొప్పిగా మారింది. న్యూజిలాండ్‌తో కీలకమైన వన్డే సిరీస్ ముంచుకొస్తున్న తరుణంలో విజయ్ హజారే ట్రోఫీలో తన హోమ్ టీమ్ కర్ణాటక తరఫున ఆడుతున్న రాహుల్ వరుసగా విఫలమవుతున్నాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్లు విశ్రాంతి తీసుకుంటుంటే, ఫామ్ కోసం దేశవాళీ బరిలోకి దిగిన రాహుల్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు. జనవరి 3న త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ కేవలం 35 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ చేరాడు. కనీసం రాజస్థాన్‌తో జరిగిన రెండో మ్యాచ్‌కైనా పుంజుకుంటాడని ఆశించిన అభిమానులకు నిరాశే ఎదురైంది. మంగళవారం (జనవరి 6) జరిగిన ఈ పోరులో రాహుల్ కేవలం 25 పరుగులు చేసి చేతులెత్తేశాడు. న్యూజిలాండ్‌తో జరగబోయే వన్డే సిరీస్‌లో అతనే వికెట్ కీపర్ బ్యాటర్‌గా ప్రధాన బాధ్యత తీసుకోవాల్సి ఉంది. ఇలాంటి సమయంలో రాహుల్ బ్యాట్ ఝుళిపించకపోవడం టీమ్ మేనేజ్‌మెంట్‌ను కలవరపెడుతోంది. గతంలో సౌతాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లో కేఎల్ రాహుల్ కెప్టెన్‌గా భారత్‌కు 2-1తో సిరీస్ విజయాన్ని అందించాడు. ఆ సిరీస్‌లో వరుసగా రెండు హాఫ్ సెంచరీలు (60, 66 పరుగులు) చేసి మంచి టచ్‌లో కనిపించాడు. అయితే ఇప్పుడు కివీస్ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా తిరిగి వస్తుండటంతో, రాహుల్ కేవలం మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా, వికెట్ కీపర్‌గా జట్టును ఆదుకోవాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుత ఫామ్ చూస్తుంటే మిడిల్ ఆర్డర్‌లో రాహుల్ ఎంతవరకు నిలబడతాడనేది ప్రశ్నార్థకంగా మారింది. 33 ఏళ్ల రాహుల్ వన్డే కెరీర్ రికార్డులు చాలా బలంగా ఉన్నాయి. 2016లో జింబాబ్వేపై అరంగేట్రం చేసిన అతను ఇప్పటివరకు 91 వన్డేల్లో 49.50 సగటుతో 3,218 పరుగులు సాధించాడు. ఇందులో 7 సెంచరీలు, 20 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అయితే గత 10 వన్డేల్లో కేవలం రెండు హాఫ్ సెంచరీలు మాత్రమే రావడం అతని ఫామ్ పడిపోతోందని చెప్పడానికి నిదర్శనం. వచ్చే వారం నుంచే కివీస్ సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రాహుల్ తన బ్యాటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




విడిపోయిన 11 నెలల తర్వాత

# మళ్లీ కలవబోతున్న చాహల్, ధనశ్రీ

అతి త్వరలో ప్రారంభం కానున్న ది 50 అనే సరికొత్త రియాలిటీ షోలో స్టార్ ప్లేయర్ యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ కలిసి కనిపించబోతున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొనే ఈ షోలో వీరిద్దరూ కంటెస్టెంట్లుగా రాబోతున్నారట. టీమిండియా స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్, అతని మాజీ భార్య ధనశ్రీ వర్మల గురించి సోషల్ మీడియాలో ఎప్పుడూ ఏదో ఒక వార్త చక్కర్లు కొడుతూనే ఉంటుంది. ఈ క్రేజీ కపుల్ విడిపోయి అభిమానుల మనసు గాయపరిచినప్పటికీ, ఇప్పుడు వీరిద్దరూ మళ్ళీ ఒకే వేదికపైకి రాబోతున్నారనే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. విడాకులు తీసుకున్న 11 నెలల తర్వాత వీరిద్దరి రీయూనియన్ జరగబోతుండటంతో బుల్లితెరపై తలపడనున్న ఈ జంట కోసం ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

తాజా నివేదికల ప్రకారం.. అతి త్వరలో ప్రారంభం కానున్న ది 50 అనే సరికొత్త రియాలిటీ షోలో యుజ్వేంద్ర చాహల్, ధనశ్రీ వర్మ కలిసి కనిపించబోతున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొనే ఈ షోలో వీరిద్దరూ కంటెస్టెంట్లుగా రాబోతున్నారట. మేకర్స్ ఇంకా అధికారిక లిస్టును ప్రకటించనప్పటికీ, విడిపోయిన ఈ జంటను ఒకే చోట చూడటం వల్ల షో రేటింగ్స్ ఎక్కడికో వెళ్తాయని భావిస్తున్నారు. ఈ షో ఫిబ్రవరి 1 నుంచి రాత్రి 9 గంటలకు జియో హాట్‌స్టార్?లో, ఆ తర్వాత 10:30 గంటలకు కలర్స్ ఛానల్‌లో ప్రసారం కానుంది. చాహల్, ధనశ్రీల పరిచయం 2020 లాక్‌డౌన్ సమయంలో మొదలైంది. అదే ఏడాది డిసెంబర్‌లో వీరిద్దరూ వివాహం చేసుకున్నారు. ధనశ్రీ తన డ్యాన్స్ వీడియోలతో ఎంత పాపులర్ అయిందో, చాహల్ వికెట్ తీసినప్పుడు గ్యాలరీలో ఆమె ఇచ్చే ఎక్స్‌ప్రెషన్లు అంతకంటే ఎక్కువ వైరల్ అయ్యేవి. అయితే ఏమైందో ఏమో కానీ, 2024లో వీరి మధ్య విభేదాలు మొదలయ్యాయి. చివరికి మార్చి 2025లో ఈ జంట చట్టబద్ధంగా విడాకులు తీసుకుని విడిపోయారు. అప్పటి నుంచి వీరిద్దరూ కలిసి ఏ వేదికపైన కనిపించలేదు.

ధనశ్రీతో విడిపోయిన తర్వాత చాహల్ పేరు ఆర్జే మహ్వాష్ తో వినిపిస్తోంది. ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో మహ్వాష్ స్టేడియానికి రావడం, చాహల్ టీమ్‌ను ఉత్సాహపరచడం చూస్తుంటే వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే రూమర్లు బలంగా వినిపిస్తున్నాయి. మరోవైపు చాహల్ కెరీర్ విషయానికి వస్తే.. భారత్ తరపున 72 వన్డేలు, 80 టీ20లు ఆడిన అతను 200లకు పైగా వికెట్లు తీశాడు. 2023 ఆగస్టు తర్వాత అతను మళ్ళీ ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడలేదు. మరి ఇప్పుడు రియాలిటీ షో ద్వారా చాహల్ తన వ్యక్తిగత విషయాలను ఏమైనా బయటపెడతాడేమో చూడాలి.



# గల్లీ క్రికెట్ కంటే దారుణంగా ఆడుతున్న గిల్..

**డకౌట్ అవ్వడానికి కూడా ఇంత బిల్డప్ అవసరమా బ్రో?**

టీమిండియా స్టార్ బ్యాటర్, ప్రస్తుత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫామ్ ఇప్పుడు ఆందోళనకరంగా మారింది. గాయం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ సాధించినప్పటికీ, బ్యాట్‌తో పరుగులు చేయడంలో గిల్ తీవ్రంగా తడబడుతున్నాడు. న్యూజిలాండ్‌తో జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో భారత జట్టును నడిపించాల్సిన బాధ్యత గిల్‌పై ఉంది.

టీమిండియా స్టార్ బ్యాటర్, ప్రస్తుత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఫామ్ ఇప్పుడు ఆందోళనకరంగా మారింది. గాయం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ సాధించినప్పటికీ, బ్యాట్‌తో పరుగులు చేయడంలో గిల్ తీవ్రంగా తడబడుతున్నాడు. న్యూజిలాండ్‌తో కీలకమైన వన్డే సిరీస్ ప్రారంభానికి కేవలం ఐదు రోజుల ముందు విజయ్ హజారే ట్రోఫీలో గిల్ దారుణంగా విఫలం కావడం అభిమానులను, సెలెక్టర్లను కలవరపెడుతోంది.

న్యూజిలాండ్‌తో జనవరి 11 నుంచి ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌లో భారత జట్టును నడిపించాల్సిన బాధ్యత గిల్‌పై ఉంది. ఈ క్రమంలో ప్రాక్టీస్ కోసం విజయ్ హజారే ట్రోఫీలో గోవాపై బరిలోకి దిగిన గిల్, కేవలం 12 బంతుల్లో 11 పరుగులు మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. రెండు ఫోర్లు కొట్టి ఫామ్‌లోకి వచ్చినట్లు కనిపించినా, వాసుకి కౌశిక్ బౌలింగ్‌లో అనవసర షాట్‌కు ప్రయత్నించి పెవిలియన్ చేరాడు. దీంతో గిల్ బ్యాటింగ్ టెక్నిక్‌పై మళ్ళీ విమర్శలు మొదలయ్యాయి. శుభ్‌మన్ గిల్ గతేడాది ఫిబ్రవరి 20 నుంచి వైట్ బాల్ క్రికెట్‌లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయాడు. గత 8 వన్డే ఇన్నింగ్స్‌ల్లో అతని అత్యధిక స్కోరు కేవలం 46 పరుగులు మాత్రమే. కేవలం వన్డేల్లోనే కాదు, టీ20ల్లో కూడా గిల్ పరిస్థితి ఏమీ బాగోలేదు. గత 15 టీ20 మ్యాచ్‌ల్లో వరుసగా విఫలం కావడంతో, టీ20 వరల్డ్ కప్ జట్టు నుంచి అతడిని తప్పించారు. వైట్ బాల్ క్రికెట్‌లో (వన్డే ం టీ20) కలిపి వరుసగా 23 మ్యాచ్‌ల్లో గిల్ విఫలం కావడం ఒక రికార్డుగా మారింది.

ఒకవైపు రెండు నెలల విరామం తర్వాత వచ్చిన శ్రేయస్ అయ్యర్ 82 పరుగులతో వీరవిహారం చేస్తుంటే, మరోవైపు టీమిండియా కెప్టెన్లు గిల్, సూర్యకుమార్ యాదవ్ మాత్రం వరుసగా విఫలమవుతున్నారు. హిమాచల్ ప్రదేశ్‌పై జరిగిన మ్యాచ్‌లో సూర్య కేవలం 24 పరుగులు మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. కివీస్‌తో వన్డే సిరీస్ ప్రారంభం కానున్న తరుణంలో ఓపెనర్, కెప్టెన్ అయిన గిల్ ఫామ్ లేకపోవడం టీమిండియాకు పెద్ద తలనొప్పిగా మారింది. ఇదే ఫామ్ కొనసాగితే జట్టులో గిల్ స్థానానికే ఎసరు వచ్చే ప్రమాదం ఉంది.



## బ్యూటిఫుల్ లుక్‌లో రకుల్..

రకుల్ ప్రీత్ సింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ ముద్దుగుమ్మ ఒకప్పుడు టాలీవుడ్‌లో వరస సినిమాలతో ఇండస్ట్రీనే షేక్ చేసింది. కానీ ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మకు తెలుగులో ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు. దీంతో బాలీవుడ్ చక్కేసి అక్కడ తన సినిమాలు చేస్తూ బిజీ అయిపోయింది. అందాల చిన్నది రకుల్ ప్రీత్ సింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే టాలీవుడ్ అభిమానులను ఆకట్టుకుని, ఫేవరెట్ నటిగా తన మార్క్ చూపెట్టింది. అందాల చిన్నది రకుల్ ప్రీత్ సింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ అమ్మడు అందానికి ఎవ్వరైనా ఫిదా అవ్వాల్సిందే. వెంకటాద్రి ఎక్స్ ప్రెస్ సినిమాతో తెలుగు వెండితెరకు పరిచయమైన ఈ బ్యూటీ మొదటి సినిమాతోనే టాలీవుడ్ అభిమానులను ఆకట్టుకుని, ఫేవరెట్ నటిగా తన మార్క్ చూపెట్టింది. ఇక ఈ ముద్దుగుమ్మ సందీప్ కిషన్ సరసన వెంకటాద్రి సినిమాలో నటించి మెప్పించింది. కానీ ఈ మూవీ అంతగా హిట్ అవ్వలేదు, అయినప్పటికీ ఈ అమ్మడుకు మాత్రం అవకాశాలు క్యూ కట్టాయి అని చెప్పాలి. దీంతో ఈ అమ్మడు వరసగా సినిమాల్లో నటించింది. ముఖ్యంగా ఈ సినిమా తర్వాత అల్లు అర్జున్ సరైనోడు, రామ్ చరణ్ సరసన ధృవ, బ్రూస్ లీ, నాన్నకు ప్రేమతో, రారండోయ్ వేడుక చూద్దాం, కొండ పొలం రటం. ఇలా చాలా సినిమాల్లో నటించి మెప్పించింది. ఈ సినిమాలన్నీ చాలా బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాయి. ఇక ఒకప్పుడు స్టార్ హీరోల సరసన వరసగా అవకాశాలు అందుకుంటూ దూసుకెళ్లింది. కానీ తర్వాత తెలుగులో అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్ చక్కేసింది. అక్కడ కూడా వరసగా సినిమాలు చేస్తూ మంచి గుర్తింపు సంపాదించుకుంది. అంతే కాకుండా అక్కడే బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీని వివాహం చేసుకుంది.

## ఎట్టకేలకు ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్ చేసుకున్న 'అయలాన్' సినిమా..




శివకార్తికేయన్ హీరోగా తెరకెక్కిన సైన్స్ ఫిక్షన్ మూవీ 'అయలాన్'ఎట్టకేలకు ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. 2024 జనవరిలో రిలీజ్ అయిన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర మిక్సిడ్ టాక్ సొంతం చేసుకుంది. ఆర్.రవికుమార్ డైరెక్ట్ చేసిన ఈ సినిమా ఇప్పుడు తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్ ఆహాలో జనవరి 7 నుంచి స్ట్రీమింగ్‌కు రానుంది. విజువల్ ఎఫెక్ట్స్, ఫాంటసీ అంశాలతో తెరకెక్కిన 'అయలాన్' ఒక ఎలియన్ కథ ఆధారంగా రూపొందింది. కామెడీ, ఎమోషన్‌తో పాటు అడ్వెంచర్ టచ్ ఉండడంతో పిల్లలు, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ చిత్రాన్ని రూపొందించారు. శివకార్తికేయన్ నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇక ఈ సినిమాను థియేటర్లలో చూసినవారితో పాటు మిస్ అయిన ప్రేక్షకులు దీని కోసం ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. జనవరి 7 నుంచి ఆహాలో స్ట్రీమింగ్ కానున్న ఈ సినిమాకు మూవీ లవర్స్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ దక్కుతుందో చూడాలి.



### 'నారీ నారీ నడుమ మురారి'కి

## అదిరిపోయే ఓటీటీ డీల్ !

శర్వానంద్ హీరోగా రాబోతున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'నారీ నారీ నడుమ మురారి', తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం కేవలం ఓటీటీ రైట్స్ ద్వారానే సుమారు రూ. 17.5 కోట్లు రాబట్టినట్లు తెలిసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. అలాగే, ఈ సినిమాకి సంబంధించి ఇతర హక్కులు కూడా మంచి ధరకు అమ్ముడైనట్లు వార్తలు వస్తున్నాయి. ఇక ఈ చిత్రంలో శ్రీ విష్ణు అతిథి పాత్రలో కనిపించనున్నారు. అయితే, శ్రీవిష్ణు పాత్రకు సంబంధించిన వివరాలను ఇంకా గోప్యంగానే ఉంచారు. కాగా సంక్రాంతి కానుకగా 2026 జనవరి 14న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయబోతున్నారు. సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు ఉన్నాయి. దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో ఇందులో ఎంటర్‌టైన్‌మెంట్‌కు ఢోకా ఉండదని ప్రేక్షకులు ఆశిస్తున్నారు. ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా ఏ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు. మరి ఈ సినిమా ఏ రేంజ్ విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

### 'పతంగ్' చిత్రాన్ని థియేటర్‌లోనే

# ఎంజాయ్ చేస్తారు..!

### దర్శకుడు ప్రణీత్ పత్తిపాటి



ప్రముఖ నిర్మాత డి.సురేష్ బాబు సమర్పణలో సినిమాటిక్ ఎలిమెంట్స్ , రిషఅబశ్రీశ్రీన్ సినిమాస్, మాన్‌సూన్ టేల్స్ సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన చిత్రం 'పతంగ్'. ప్రణవ్ కౌశిక్, వంశీ పుజిత్, ప్రీతీ పగడాల ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమా గతవారం రిలీజ్ అయి బాక్సాఫీస్ దగ్గర మంచి రెస్పాన్స్ అందుకుంది. ఈ సినిమాకు వస్తున్న రెస్పాన్స్‌తో తమ చిత్ర యూనిట్ సంతోషంగా ఉందని తెలిపారు దర్శకుడు ప్రణీత్ పత్తిపాటి. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ప్రణీత్ పత్తిపాటి తాజాగా విలేకరులతో మాట్లాడారు.

ఫీడ్‌బ్యాక్ ఎలా ఉంది?

టాక్‌తో పాటు కలెక్షన్లు రోజు రోజుకు పెరుగుతున్నాయి. యూనివర్సల్‌గా ఈ సినిమాకు హిట్‌టాక్..తో పాటు ఓ మంచిసినిమావ చూశామన్న సంతృప్తిని ఆడియన్స్ వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారు. ముఖ్యంగా సినిమా పతాక సన్నివేశాలు ఓ స్టేడియంలో ఓ మ్యాచ్‌ను చూస్తున్నఅనుభూతికి లోనవుతున్నారు.

పతంగుల పోటీ నేపథ్యంలో సినిమా తీయడానికి కారణం ఏమిటి?

ఓ సంక్రాంతి రోజు అనిపించింది. మనం ఫారిన్ నుంచి తీసుకొచ్చిన రగ్బిలాంటి స్టోరీతో సినిమాలు తీశాం కానీ ఇది మన నేటివిటి స్పోర్ట్స్ కదా.. దీని మీద మనం ఎందుకు తీయలేము అని పతంగ్‌ను మొదలుపెట్టాం. సినిమా మొదలు పెట్టిన తరువాత ఎందుకు తీయలేదో అనే విషయం సీజీ వర్క్ అప్పుడు తెలిసింది. సీజీ వర్క్‌కు చాలా సమయం పట్టింది.

మూడు సంవత్సరాల సమయంలో నిర్మాతల సపోర్ట్ మీకు ఎలా ఉంది?

ఈ సినిమాకు బిగ్గెస్ట్ ప్లస్ మా నిర్మాతలే నేను ఎక్కడైనా రాజీపడ్డ వాళ్లు మాత్రం రాజీపడలేదు. ఎంతో ఖర్చు పెట్టి ఈ సినిమాను క్వాలిటీగా నిర్మించారు. ఈ రోజు సినిమా ఇంత రిచ్‌గా, కలర్‌ఫుల్‌గా కనిపించడానికి వాళ్లు పెట్టిన ఖర్చే కారణం.

ఈ కిస్మస్ సీజన్‌లో విడుదల కావడంతో మీకు సరైన థియేటర్లు దొరకలేదు అంటున్నారు?

థియేటర్లు ట్రై చేస్తున్నాం. సినిమా తీయడంతో ఇక అయిపోయింది అనుకునేవాడ్ని.కానీ సినిమా తీసిన తరువాత మళ్లీ ప్రమోషన్,రిలీజ్ ఇంత పని ఉంటుందా అని నాకు ఈసినిమాతోనే తెలిసింది. మౌత్‌టాక్‌తో సినిమా బాగుంది అని తెలిసినా సరైన థియేటర్లు , టైమింగ్స్ లేకపోవడంతో సినిమా బాగున్నా జనాలకు అందుబాటులో లేకపోవడవం తో చూడలేకపోతున్నారు. అయితే సినిమా ఆడుతున్న థియేటర్లుమాత్రం ఫుల్ అవుతున్నాయి. దర్శకుడు గౌతమ్ వాసుదేవ మీనన్ ఈ సినిమాలో ముఖ్యపాత్రలో కనిపించారు? ఆ ఐడియా ఎవరిది? స్క్రిప్ట్‌లో అనుకున్న ప్రకారం ఆ పాత్రకు మొదట సందీప్ రెడ్డి వంగా, దిల్‌రాజు, ఎస్‌జే సూర్య నాగ్ అశ్విన్, ఇలా ఎక్స్‌పెక్ట్ చేయని వాళ్లను అడిగాం. కానీ వర్కింగ్ డేస్ ఎక్కువగా ఉండటం వల్ల ఒప్పుకోలేదు. ఇక సినిమాలో గౌతమ్ మీనన్ పాత్రనున గౌతమ్‌మీనన్ చేస్తే బాగుంటుందని అయన్ని అప్రోచ్ అయ్యాం. ఆయనపాత్ర కథ,విని ఒప్పుకున్నారు. ఆయన మీద పంచ్‌లు వేయడం కూడా బాగా నచ్చింది. ఈ సినిమా కొత్తవాళ్లతో చేయడానికి కారణం? కథకు తగ్గట్టుగా కొత్తవాళ్లతోనే అనుకున్నాం. కథ, మాటలు అన్నీ నేను రాసుకున్నాను.

### 'అనగనగా ఒక రాజు' ట్రైలర్ వాయిదా.. రిలీజ్ ఎప్పుడంటే..?




టాలీవుడ్ హీరో నవీన్ పొలిశెట్టి నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'అనగనగా ఒక రాజు' సంక్రాంతి బరిలో గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ నుంచి ట్రైలర్ లాంచ్‌కు మేకర్స్ రెడీ అవుతున్నారు. అయితే, తొలుత ఈ చిత్ర ట్రైలర్‌ను జనవరి 7న లాంచ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. ఈ మేరకు అధికారిక ప్రకటన కూడా చేశారు. కానీ, అదే రోజు వరుస మూవీ ఈవెంట్స్ ఉండటంతో ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను వాయిదా వేశారు. 'అనగనగా ఒక రాజు' మూవీ ట్రైలర్‌ను జనవరి 8న ఉదయం 10 గంటల నుంచి శ్రీరాములు థియేటర్‌లో లాంచ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తాజాగా ప్రకటించింది. దీంతో ఈ వాయిదా చాలా మంచిదని పలువురు కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాను దర్శకుడు మారి డైరెక్ట్ చేయగా పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ మూవీ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయనుంది. ఈ సినిమాలో అందాల భామ మీనాక్ష చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా మిక్కీ జే మేయర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చున్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.

విశ్వం వాయిస్ తెలుగు దినపత్రికలో వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com